14-05Pg1exHNWMJQE.qxd:14-05Pg1exHNWMJQE.qxd 1/1/02 6:58 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 103 పేజీలు: 16 వెల: 6.50

## నందిగ్రామ్ సీటుకు బెంగాల్ సిఎం సువేందు గుడ్‌బై

5లో

షణ్ముగం వర్గాన్ని పార్టీ పదవులనుంచి తొలగించిన పళనిసామి

## వరి, మరికొన్ని పంటలకు కనీస 'మద్దతు' పెంపు

### రైతుల ఆదాయం పెంచే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

### వరి క్వింటాల్‌కు రూ. 72 హెచ్చింపు

**విజయవాడ, మే 13,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ రైతాంగ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయమని ఆయన అభినందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతం లక్ష్యంగా తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా రైతుల్లో నూతన నమ్మకాన్ని పెంచుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఖరీఫ్ పంటల ఎంఎస్‌పి పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల భారీ వ్యయాన్ని ఆమోదించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పెట్టుబడి >>2

## 20 లక్షల ఉద్యోగాల లక్ష్యసాధనకు ఎంఎస్‌ఎంఇలు కీలకం: మంత్రి లోకేష్

**విజయవాడ, మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనలో ఎంఎస్‌ఎంఇల పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. "మేడ్ ఇన్ ఆంధ్ర - మేడ్ ఫర్ ఇండియా-మేడ్ ఫర్ దివరల్డ్" లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందనితెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, ఎపి >>2

# ఆరోగ్య రాజధానిగా అమరావతి



బుధవారం నిడమర్రు వద్ద కిమ్స్ ఆసుపత్రికి భూమి పూజ చేస్తున్న సిఎం చంద్రబాబు

### ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు అమరావతినుంచే ఉండాలి

### ఏరోస్పేస్ హబ్‌గా అనంతపురం, టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ

### తిరుపతిలో ఏరోస్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ

### నిడమర్రు వద్ద కిమ్స్ ఆసుపత్రికి భూమిపూజ చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో త్వరలోనే 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రాబోతుందని సిఎం చంద్రబాబు తెలిపారు. దీనికి ఎలాంటి అనుమతులు కావాలన్న త్వరగా ఇస్తామని వెల్లడించారు. మంగళగిరి మండలం నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి సిఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. అనంతరం బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అమరావతిలో కిమ్స్ ఆస్పత్రి, స్కిల్ వర్సిటీకి 23 ఎకరాలను సిఆర్‌డిఎ కేటాయించింది. రాష్ట్రంలో వైద్య సర్వీసులో లక్ష మంది సేవలు అందించే విధంగా తయారు చేయాలన్నారు. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒక్కరు అమరావతి నుంచే ఉండాలని అన్నారు. అలానే 1000 మంది ట్రైనీలను సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టి కలిసి పని మెదలుపెట్టారని తెలిపారు. డిసెంబర్ నాటికి భారత్‌కు క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాకు అమరావతి అవుతుందని రెండేళ్లలో ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు అమరావతి నుంచి సరఫరా చేస్తామని వెల్లడించారు. అలానే విదేశాలపై ఆధారపడకుండా అందరూ కరెంట్ ఉత్పత్తి తయారు చేసుకోవాలని అన్నారు. రూ.2.40కే యూనిట్ కరెంట్ ఉత్పత్తి చేస్తున్నామని కరెంట్ ఛార్జీలు తగ్గుస్తున్నామని సిఎం వివరించారు.సంపద సృష్టించడం చాలా సులభమని సిఎం అన్నారు. హైదరాబాద్ దేశానికి మెడికల్ హబ్‌గా తయారైందని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ >>2



## 'బల'వంతుడు విజయ్

### విశ్వాస పరీక్షలో అన్నాడిఎంకె రెబల్స్ సహా 144 మంది మద్దతు

### సభనుంచి డిఎంకె వాకౌట్

**చెన్నై, మే 13:** తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన సూపర్‌స్టార్ విజయ్, ముఖ్యమంత్రిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన నాటకీయ విశ్వాస పరీక్షలో దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కింది. ఈ బల పరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది శాసనసభ్యులు మద్దతు పలకగా, 22 మంది వ్యతిరేకంగా >>2



అమెరికాలో అటార్నీగా అర్హత పత్రంతో సాయి శ్రీనివాస రెడ్డి

## అమెరికాలో అటార్నీగా పులివెందుల యువకుడు

ఇండియానాలో నిర్వహించిన బార్ పరీక్షల్లో ఉత్తీర్ణత
భారత్‌తో పాటు అమెరికాలోనూ న్యాయవాదిగా సేవలు

2లో

## హత్య కేసులో వైఎస్సార్సీ ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు

2లో



## ప్రధాని కాన్వాయ్ కుదింపు

5లో

హోంమంత్రి అమిత్‌షా, రాజ్‌నాథ్ మరికొందరు మంత్రులకు కూడా ..





బుధవారం న్యూఢిల్లీలో మాజీ రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ జయంతి సందర్భంగా ఆయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

# అమెరికాలో అటార్నీగా పులివెందుల యువకుడు

**పులివెందుల, మే 13 ,ప్రభాత వార్త :** కడప జిల్లా పులివెందులకు చెందిన యువ న్యాయవాది భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి అమెరికాలో అరుదైన ఘనత సాధించి తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారు. టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కుమా రుడు, టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయిన సాయి శ్రీనివాస్ రెడ్డి అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో లైసెన్స్‌డ్ అటార్నీగా ప్రమాణ స్వీకారం చేశారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే తొలి ప్రయత్నంలో ఇండియానా నిర్వహించిన బార్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఈ ఘనత అందుకోవడం విశేషం. భారత్‌తో పాటు అమెరికాలో కూడా న్యాయవాదిగా సేవలందించేందుకు అర్హత సాధించిన అతి పిన్న వయస్కుల్లో ఒకరిగా ఆయన నిలిచారు. సాయి శ్రీనివాస్ రెడ్డి విద్యాభ్యాసం కూడా విశేషంగా సాగింది. ఆయన అలియన్స్ యూనివర్సిటీ నుంచి బిబిఎ, ఎల్‌ఎల్‌బి పట్టాలు పొందారు. అనంతరం అమెరికాలో మాస్టర్ ఆఫ్ లాస్ (ఎల్‌ఎల్‌ఎం) పూర్తి చేశారు. అలాగే ప్రతిష్ఠాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ నిర్వహించిన సమ్మర్ ప్రోగ్రామ్‌లలో కూడా పాల్గొన్నారు.ఇటీవల ఇండియానా బార్ పరీక్షలో విజయంతో భారత్, అమెరికా దేశాల్లో ఒకేసారి న్యాయ వృత్తి నిర్వహించే అర్హతను సొంతం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. "టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పులివెందుల యువకుడు సాయి శ్రీనివాస్ రెడ్డి తొలి ప్రయత్నంలోనే అమెరికాలో లైసెన్స్ పొందిన న్యాయవాదిగా ప్రమాణంచేయడం తెలుగుసమాజానికి గర్వకారణం" అని కొనియాడారు. సాయి శ్రీనివాస్ తండ్రి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి జర్నలిస్టుగా పనిచేసి అనంతరం రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. తండ్రి రాజకీయ రంగంలో రాణిస్తుండగా, కుమారుడు అంతర్జాతీయ న్యాయ రంగంలో రికార్డు సృష్టించడం పులివెందుల ప్రజల్లో ఆనందాన్ని నింపుతోంది.

# హత్య కేసులో వైఎస్సార్సీ ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే13,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళితుడు,డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక నిందితుడు ఎం.ఎల్.సి అనంతబాబు బెయిల్ ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం స్పెషల్ కోర్ట్ రద్దు చేయడం జరిగింది.డ్రైవర్ హత్య కేసులో అనంతబాబు కి గతంలో షరతుల తో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది.సుప్రీంకోర్టు ఇచ్చిన ఈబెయిల్ ను రద్దు చేస్తూ గురువారం ప్రత్యేక న్యాయస్థానం సంచలనమైన తీర్పు ఇచ్చింది.సాధారణంగా సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను కింది కోర్టులు రద్దు చేయవు. అనంతబాబు బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరించారంటూ తాజాగా కాకినాడ పోలీసులు నమోదు చేసిన కేసులో అనంతబాబుని అరెస్టు చేశారు. బెదిరింపులు తీవ్రంగా పరిగణించిన ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ రద్దు చేస్తూ న్యాయమూర్తి గంధం సునీత సంచలన తీర్పు ఇవ్వడం జరిగింది. బెదిరించిన వ్యవహారంలో ఏప్రిల్ 24న సర్పవరం పోలీసులు అనంతబాబును అరెస్ట్ చేయగా, ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ రద్దు కావడంతో, ఇకపై హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన జైలులోనే ఉండనున్నారు.పోలీసుల తరఫున స్పెషల్ పిపి ముప్పాళ్ల సుబ్బారావు సమర్థవంతంగా వాదనలు వినిపించి,సాక్షుల బెదిరింపులకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందు ఉంచారు.మరోవైపు, డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో ఈ నెల 20వ తేదీ నుంచి విచారణ ప్రారంభించనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. దాదాపు రెండేళ్ల క్రితం జరిగిన ఈ దారుణ హత్య కేసులో ఇకపై విచారణ వేగవంతం కానుంది.

# పోక్సో కేసులో మహిళకు ఐదేళ్ల జైలు

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల్లో ఓ పోక్సో కేసు సంచలనంగా మారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ క్రమంలో ఓ మహిళకు ఐదేళ్ల జైలు శిక్ష పడటం సంచలనంగా మారింది, వివరాల్లోకి వెళితే రాష్ట్రంలోని ఒంగోలులో కెజివిబి ప్రత్యేకాధికారిణి వికృతంగా ప్రవర్తించింది.ఒక బాలికను గదిలోకి తీసుకెళ్లి ఆమె చూడనని ఏడుస్తుంటే కొట్టి, పోర్న్ వీడియోలు చూపించి వేధించింది. ఈ వేధింపులు భరించలేక బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు మర్రిపూడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. దీంతో నేరం రుజువు కావడంతో కెజిబివి ప్రత్యేకాధికారిణికి ఐదేళ్ల జైలు శిక్ష , రూ.25 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# 'మద్దతు' పెంపు

>> ఖర్చుకు కనీసం 50 శాతం లాభం జోడించి ఎంఎస్‌పి ధరలు నిర్ణయించడం రైతులకు నిజమైన భరోసా కల్పించే చర్యగా అభివర్ణించారు. రైతు కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్న సంకల్పంతోనే పలు పంటల ఎంఎస్‌పిలను గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. వరి కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.72 పెంచి రూ.2441, గ్రేడ్‌ఏ వరికి రూ.2461 నిర్ణయించడం రైతులకు లాభదాయకమని తెలిపారు. జొన్నకు రూ.4073, రాగికి రూ.5205, సజ్జలకు రూ.2900, ఉలవలకు రూ.8200, మొక్క జొన్నకు రూ.2410, నువ్వులకు రూ.10,346, సన్‌ఫ్లవర్‌కు రూ.8343, పత్తికి రూ.8667, వేరుశనగకు రూ.7517 వరకు ఎంఎస్‌పి పెంపు ప్రకటించడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న వ్యయభారం, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రాష్ట్రంలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పిలను పూర్తిస్థాయిలో పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థ, మద్దతు ధర అమలు ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలకు రాష్ట్ర రైతుల తరఫున మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# 'బల'వంతుడు విజయ్

>> ఓటు వేశారు. మరో ఐదుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గత నెల జరిగిన ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి అధికార పీఠం దక్కించుకున్న విజయ్, ఈ విశ్వాస పరీక్షతో తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకున్నారు. ఈ ఓటింగ్‌కు ముందు ప్రధాన ప్రతిపక్షమైన డిఎంకే తన 59 మంది ఎమ్మెల్యేలతో సభ నుంచి వాకౌట్ చేసింది. మూడో అతిపెద్ద పార్టీ అయిన అన్నాడిఎంకే 47 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించినప్పటికీ, పార్టీలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అన్నాడిఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాలను ధిక్కరిస్తూ ఆ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయడం తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. దీంతో ద్రవిడ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన అన్నాడిఎంకే పార్టీలో చీలిక స్పష్టంగా కనిపించింది. డిఎంకే వాకౌట్, మరికొందరు తటస్థంగా ఉండటంతో, పళనిస్వామి వర్గానికి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ తిరుగుబాటుతో పళనిస్వామికి గట్టి రాజకీయ ఎదురుదెబ్బ తగిలినట్లయింది. విశ్వాస పరీక్షలో గెలిచిన అనంతరం విజయ్ మాట్లాడుతూ మా ఎన్నికల గుర్తు అయిన విజిల్ చరిత్రను మార్చింది. మాది మైనార్టీ ప్రభుత్వమే అయినా, మైనార్టీల హక్కులను కాపాడే ప్రభుత్వంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. విజయ్ ప్రభుత్వం ప్రస్తుతానికి గండం నుంచి బయటపడినప్పటికీ, అన్నాడిఎంకేలో ఏర్పడిన ఈ చీలిక భవిష్యత్తులో తమిళనాడు రాజకీయ సమీకరణాలను ఎలా మారుస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. బలపరీక్షపై రాజకీయ పార్టీల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నప్పటికీ విజయ్ ఆయన సీనియర్లు నడిపిన వ్యూహం మంచి ఫలితాలిచ్చింది. ముందురోజే తాము మద్దతిస్తామని ప్రకటించిన అన్నా డిఎంకె రెబెల్స్ ఇళ్లకువెళ్లి వారికి భరోసా కల్పించారు. అలాగే అందరు ప్రతిపక్ష నాయకుల ఇళ్లకు వెళ్లి మీ ఆశీస్సులు,సలహాలు అందించాలని కోరారు. అనుకున్నట్లుగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలు ఏకగ్రీవంచేసుకున్న టివికె ఇక బలపరీక్షపైనే పూర్తిస్థాయిలో ఫోకస్‌పెట్టింది. ప్రస్తుత మిత్రపక్షాలను కలుపుకునిపోవడంతోపాటు మద్దతిస్తామని వచ్చిన అన్నాడిఎంకె రెబెల్స్‌ను కూడా తమలో కలుపుకుని విశ్వాస పరీక్షలో సులువగా నెగ్గింది. ముందుగా ఊహించినట్లుగానే డిఎంకెకు చెందిన 59 మంది ఎమ్మెల్యేలు సభనుంచి వాకౌట్‌చేసారు.

**మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చట్టం చేయాలి: విసికె ఎమ్మెల్యే వన్ని అరసు డిమాండ్**

విశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో విసికె ఎమ్మెల్యే వన్ని అరసు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం చేపట్టాల్సిన పలు సంస్కరణలను ప్రస్తావించారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద ఆలోచనలను ప్రోత్సహించాలని, జ్యోతిష్యంతో సహా అన్ని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ సమీపంలో చేపలు పడుతూ శ్రీలంక నౌకాదళం చేతిలో అరెస్ట్ అవుతున్న తమిళ మత్స్యకారుల సమస్యను పరిష్కరించడానికి తక్షణమే దౌత్య, పరిపాలనాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గత డిఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం వంటి కీలక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.

# అనుమతులు రాగానే అమరావతిలో రీజనల్ పోస్టాఫీస్ వ్యవస్థ : కేంద్రమంత్రి పెమ్మసాని

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో రీజినల్ పోస్టాఫీస్ వ్యవస్థ నిర్మాణ అంచనా వ్యయం రూ.50 కోట్ల నుంచి రూ.103 కోట్లకు పెరిగినందున క్యాబినెట్ ఆమోదం కోసం పంపినట్లు కేంద్ర కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. అక్కడినుంచి అనుమతులు వచ్చిన వెంటనే అమరావతిలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లవుతున్న సందర్భంగా ఈ మధ్యకాలంలో పోస్టల్‌శాఖలో తీసుకువచ్చిన సంస్కరణల ఫలితాల గురించి మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ శాఖ ద్వారా 2024-26లో రూ.15,300 కోట్లకు పెంచాం. ఒక్క ఏడాదిలోనే రూ.2100 కోట్ల మేర ఆదాయం పెరిగింది. 2026-27లో రూ.20 వేలకోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సంప్రదాయ తపాలా బట్వాడాతోపాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, షిప్‌రాకెట్ లాంటి ఈ మార్కెటింగ్ సంస్థలతో జతకట్టి పార్సిల్ సర్వీసులను విస్తృతం చేయబోతున్నాం. పోస్టాఫీసుకు వెళ్లే అవసరం లేకుండానే పోస్టల్ బ్యాంక్ సేవలు, ఇన్సూరెన్స్ సేవలను ఆన్‌లైన్‌లోనే పొందే కొత్త వ్యవస్థను తీసుకొస్తున్నాం. నాలుగైదు నెలల్లో ఇవి అందుబాటులోకి వస్తాయి. బ్యాంకులకంటే మావద్దే వడ్డీరేట్లు ఎక్కువ ఉన్నందున ప్రజలను ఆకర్షించడానికి విస్తృత అవకాశాలున్నాయి. ఇప్పటివరకూ ఈ విభాగంలో యుపిఐ పేమెంట్ విధానం లేకపోవడం వల్ల ఖాతాదారులు ప్రత్యక్షంగా పోస్టాఫీసులకు వచ్చి లావాదేవీలు జరపాల్సి వస్తోంది. ఈ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేసి, యుపిఐ, ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తాం అని మంత్రి తెలిపారు

# కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు సిఎం చంద్రబాబు లేఖ

**విజయవాడమే 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ముడి పదార్థాల మంటతో రొయ్యల ఫీడ్ ధరలు పెరిగి ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు సిఎం చంద్రబాబు లేఖ రాశారు. ఫీడ్ ధరల పెరుగుదలతో రైతుల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందన్నారు. టన్ను ఫీడ్‌పై 25 వేల అదనపు భారం పడుతోందని వివరించారు. ముడి పదార్థాల ధరల నియంత్రించి ఫీడ్ ధరల భారం తగ్గించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. ధరలు తగ్గకపోతే రొయ్యల సాగుపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ అవసరాలకు సరిపడా ముడి పదార్థాల లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోయాబీన్ మీల్, సోయా ఆయిల్ దిగుమతులకు సడలింపులు ఇవ్వాలని లేఖలో ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ధరల పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించాలని చంద్రబాబు అన్నారు.

# ఆరోగ్య రాజధానిగా అమరావతి

>> సిబ్బంది ప్రతీ ముగ్గురి లో ఒకరికి అమరావతిలోనే శిక్షణ ఇచ్చేలా ఈ స్కిల్ ఇనిస్టిట్యూట్ తయారు కావాలి ఇదే తరహాలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని కూడా ఎపిలో ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబరు నాటికి దేశంలో మొదటి క్వాంటం కంప్యూటర్‌కు అమరావతి చిరునామాగా మారుతుంది. ఇప్పటికే ఓ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ అమరావతిలో ఏర్పాటు అయ్యింది. త్వరలో 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు అవుతుంది. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల పెట్రోలు, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. విదేశాలపై ఆధార పడకుండా గ్రీన్ ఎనర్జీని ఇక్కడే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ చేపట్టామని అన్నారు.

ప్రతీ పొలంలో, ప్రతీ ఇంటి పైనా సోలార్ రూఫ్ టాప్ లాంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. గత పాలకులు ప్రజలపై 32 వేల కోట్ల విద్యుత్ భారం వేశారు. ఇప్పుడు విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గించాం, కరెంటు ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తున్నామని అన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు అండగా ఉంటామని ఫేజ్2కు పిలుపునిస్తే రైతులు ముందుకొచ్చారని సిఎం అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచంలోనే గొప్పదైన నగరంగా అమరావతి నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని విశాఖను విశ్వనగరంగా చేస్తున్నామని వివరించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నామని అక్కడికి అనేక పరిశ్రమలు వస్తున్నాయని వెల్లడించారు. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం, టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ తయారవుతోందని అన్నారు. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ వస్తోందని తెలిపారు. అలానే శ్రీసిటీ ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని సిఎం తెలిపారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఉన్నాయని గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని చెప్పారు.ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకున్నాం. ప్రపంచంలో అనేక మార్పులు వస్తున్నాయి. వైద్యుల కంటే నర్సులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్రంలో ఆరోగ్యానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. యూరియా వేసి పంటలు పండిస్తున్నారు. అందరి ఆరోగ్యం కాపాడే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. భవిష్యత్తులో వర్క్ ఫ్రం హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. పది కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. ప్రతి ఇంటిపై సోలార్ పెట్టుకోండి విద్యుత్ ఛార్జీలు చెల్లించే అవసరం ఉండదు. సోలార్ ఏర్పాటు చేసుకునేవారికి సబ్సిడీ కూడా అందిస్తున్నామన్నారు.

**యువతకు లక్ష ఉద్యోగాల కల్పన..**

అమరావతి అభివృద్ధిలో భాగస్వామి అయ్యేందుకు ముందుకొచ్చిన బైసర్‌ను, కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావును అభినందిస్తున్నాను. విద్య, వైద్యంలో తిరుగులేని స్థాయిలో ఉండేలా 25 కిమ్స్ ఏర్పాటువుతోంది. మెడికల్ కాలేజీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి లక్ష మందికి నైపుణ్యం అందించేలా సంస్థ ఎదగనుంది. 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోంది. 250 మెడికల్ సీట్లు, 1,000 నాన్ మెడికల్ సీట్లు, మరో 1,000 మంది ట్రైనీలు తయారుకావాలి. డెంటల్, ఫిజియో థెరపీ వంటి సుమారు 5,000 మందిని నియమించుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వైద్యులతో పాటు నర్సులు, పారామెడికల్ సిబ్బంది టెక్నీషియన్లు చాలా అవసరం ఉంది. డాక్టర్లు కూడా ఏఐ నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అని సీఎం చంద్రబాబు అన్నారు.

**విశ్వ నగరంగా అమరావతి**

రాష్ట్రం కోసం రాజధాని కోసం భూములిచ్చిన రైతుల భవిష్యత్‌కు అండగా ఉంటాం. రెండో దశలో భూసమీకరణ ద్వారా అమరావతిని భవిష్యత్ నగరంగా నిర్మిస్తాం. 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వేస్తాం. వెస్ట్ బైపాస్ లాగే మరో 10 నుంచి 15 ఫ్లైఓవర్లు కృష్ణానదిపై రావాలి. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతి తయారవుతుంది. అమరావతితో పాటు విశాఖను కూడా విశ్వనగరంగా అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమలో ఈ నెల 15 తేదీన డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్నాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా, టెక్నాలజీ హబ్‌గా మారుతుంది. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం. వీటి ద్వారా 24 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. లక్షమంది ఉద్యోగులను మెడికల్ ఫీల్డ్‌లో తయారు చేయగలిగితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ గంటి హరీష్, పలువురు నేతలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఇలు కీలకం: మంత్రి లోకేష్

>> ఎంఎస్‌ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మరియు సిఐఐ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఎంఎస్‌ఎంఇలకు మూలధన మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..యువగళం పాదయాత్రే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి ప్రేరణ.. యువగళం పాదయాత్రలో తనకు ఎదురైన ఒక సంఘటన 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి ప్రేరణగా నిలిచిందని మంత్రి లోకేష్ తెలిపారు. 226 రోజులు, 3132 కిలోమీటర్లు నడిచిన యువగళం పాదయాత్రలో ఎన్నో కుటుంబాల కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను దగ్గరగా చూశాను. ఒకరోజు పెనుగొండలో కియా వద్ద సెల్ఫీలు దిగేందుకు దారుణమైన ఎండల్లో 23 కి.మీ నన్ను జాతీయ రహదారిపై నడిపించారు.

అక్కడే కియా అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న పద్మావతి అనే చెల్లి నాతో కలిసి నడిచింది. కియా, అనుబంధ పరిశ్రమలు రాకముందు ఆమె గృహిణి. బాగా చదువుకుంది కానీ ఉద్యోగం చేయలేదు. కియా అనుబంధ సంస్థలు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులను ఒప్పించి ఉద్యోగంలో చేరింది. నెలకు రూ.30 వేలు సంపాదిస్తోంది. అప్పటివరకు భర్త మీద ఆధారపడిన ఆమె, ఇప్పుడు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని కూడా చూసుకుంటోంది. ఆమె కథ విన్న తరువాత నాకు ఉద్యోగ కల్పన ఎంత ముఖ్యమో అర్థమైంది. ఆ ఆలోచనల నుంచే 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం పుట్టింది. మేము ఇచ్చిన మ్యానిఫెస్టో 'సూపర్ 6' హామీల్లో కూడా మొదటి హామీ 20 లక్షల ఉద్యోగాల కల్పనే. ఈ లక్ష్య సాధన కోసం అందరం పని చేస్తున్నాం." అని పేర్కొన్నారు.



బుధవారం గువాహతిలో అసోం మొదటి ముఖ్యమంత్రి గోపీనాథ్ బోర్డోలోయ్‌కు నివాళలర్పిస్తున్న సిఎం హిమంత బిశ్వ శర్మ

# గిరిపుత్రులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన డిసిఎం పవన్ విశ్రాంతి నుంచి విధుల్లో చురుగ్గా డిసిఎం

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదపాడులో పాఠశాల భవనం నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఉముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెరవేర్చారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 7న అరకు నియెజకవర్గం పరిధిలోని డుంబ్రిగూడ మండలం, పెదపాడు గ్రామంలో అడవితల్లి బాట కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. చాపరాయి నుంచి పెదపాడు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆ గ్రామంనలో మౌలిక వసతులపై ఆరా తీశారు. పెదపాడులో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. స్కూలు భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనం కావాలని ఉపాధ్యాయులు రంగయ్య, పవన్‌కు విన్నవించారు. పాఠశాలకు కొత్త భవనం నిర్మిస్తామని పవన్ సభావేదికపై హామీ ఇచ్చారు.ఆ హామీ మేరకు పాఠశాల భవనాన్ని నిర్మించారు. 2026 విద్యా సంవత్సరం నుంచి ఇది విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇచ్చిన హామీని నెరవేర్చటంపై పెదపాడు గ్రామస్థులు పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఇక కొద్దిరోజులుగా చిన్న శస్త్ర చికిత్స కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న పవన్ తన మంత్రిత్వశాఖలు. పార్టీ కార్యకలపాల్లో బుధవారం నుంచి క్రియాశీలకమయ్యారు.ఆయన హైదరాబాద్ నుంచి తన పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

# మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి చిహ్నాం : మంత్రి లోకేష్

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం దూసుకెళుతోందని, మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి చిహ్నాంగా మారుతోందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని తయారీ రంగం పురోగతిని వివరిస్తూ ఆయన బుధవారం సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. దీనికి సంబంధించిన ఓ ప్రత్యేక వీడియోను కూడా పంచుకున్నారు.మొబైల్ ఫోన్లు, స్క్రీన్ల నుంచి మొదలుకొని ఏసిలు, బైక్‌లు, కార్ల వరకు.. భారతీయులు విశ్వసించే ఎన్నో బ్రాండ్లు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయి" అని లోకేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పనుల వేగవంతమైన అమలు, బలమైన తయారీ వ్యవస్థ వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనేది వేగంగా నాణ్యతకు, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కండి. ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేయండి.. ప్రపంచం కోసం తయారు చేయండి" అని లోకేష్ పిలుపునిచ్చారు. ఆయన షేర్ చేసిన వీడియోలో ఎపిలో కార్యకలాపాలు సాగిస్తున్న పలు ప్రఖ్యాత కంపెనీల ఉత్పత్తులను, తయారీ యూనిట్లను ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు, పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది.

# ప్రతీ కుటుంబానికి సంక్షేమం అందాలి

## రోడ్ల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలి

## జలహారతి పనులను మ్యాపింగ్ చేయాలి: ఆర్టీజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ఉపయోగించుకుని పేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు తీసుకొస్తున్నామని సీఎం వెల్లడించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."అభివృద్ధిసంక్షేమం అనేది సమపాళ్లల్లో అందిస్తూ పాలన చేస్తున్నాం. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాల్సిందే. ఈ మేరకు ఫ్యామ్లీ బెనిఫిట్ కార్డులను రూపొందిస్తున్నాం. అన్న క్యాంటీన్లల్లో నిత్యం తనిఖీలు చేస్తూనే ఉండాలి. ఒక్క ఫిర్యాదు కూడా రాకుండా చూసుకోవాలి. పేదలు సంతృప్తిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేశాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు డబ్బు ఆదా అవుతోంది.. మూడు పూటలా కడుపు నిండా ఆహారాన్ని అందిస్తున్నాం. మహిళలపై నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. తప్పు చేయాలంటే నేరస్తులు భయపడేలా ఉండాలి. ఆ పరిస్థితి వచ్చేలా పోలీసింగ్ ఉండాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. దీన్ని తప్పకుండా ఆచరించేలా చూడాలి. ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలబించేలా రైతుల్లో మరింత అవగాహన కల్పించాలి. వ్యవసాయంలో రీసెర్చ్ వర్క్ మరింత పెంచాలి. ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించడంతోపాటు... ఉద్యాన పంటల వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలి. అలాగే ఏయే పంటలు వేసుకోవాలనే అంశం మీద రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలిఖి అని సీఎం స్పష్టం చేశారు.

**టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌కు అధికారులు ప్రాధాన్యమివ్వాలి..**

జలధారజలహారతి పనులను మరింత వేగవంతం చేయాలి. జరుగుతున్న పనులను మ్యాపింగ్ చేసుకోవాలి. జలధార పనులను కాస్ట్ ఎఫెక్టివ్ తరహాలో చేపట్టాలి. నీటి భద్రత అనేది ప్రభుత్వ ప్రాధాన్యాత అంశాల్లో ఒకటిగా ఉంది. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. నిధులు కూడా ఇస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఉండే రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. సమాచారం తెప్పించుకోవాలి. కొన్ని జిల్లాల్లో బస్సులకు సీసీ కెమెరాలు పెట్టి రోడ్ల పరిస్థితిని అంచనా వేస్తున్నారు. అదే తరహాలో వినూత్నంగా క్షేత్ర స్థాయి నుంచి ఆ సమాచారాన్ని ఎలా రప్పించుకోవాలనే ఆలోచన చేయాలి. పాత్ హోల్స్ సమస్య ఉండకూడదు. ప్రపంచంలోని ప్రతి లేటెస్ట్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలి. అమరావతికి ఈ టెక్నాలజీలను తీసుకువస్తే... ఇక్కడ యువతకు చాలా ఉపయోగంగా ఉంటుంది అన్నారు.

## వారం - వర్జ్యం

14-05-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
ద్వాదశి ఉ.11.16
రేవతి రా.10.29
వర్జ్యం : ఉ.11.21-మ.12.50
దు.ఉ.9.55-ఉ.10.47,
2)మ.3.04-మ.3.56
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. ఎవ్వరినీ ఎదిరించకుండా సర్దుకుపోతారు.

**వృషభం:**ఆశలు, ఆశయాలు అంటూ కలలో విహరించకుండా వాస్తవికతకు ప్రామాణికంగా నడుచుకుంటారు.

**మిథునం:** ఎంతో శ్రమ చేసి కొద్దిపాటి గుర్తింపు పొందుతారు. లాభనష్టాలు సరి సమానంగా ఉంటాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:**ఋణాలు చేయకపోవటమే పొదుపుగా భావిస్తారు. వ్యాపారంలో స్థబ్దత నెలకొంటుంది. నూతన విద్యావకాశాలు.

**సింహం:** నైతిక విలువలకు ప్రాధాన్యత నిచ్చి ధర్మబద్ధంగా నడచుకుంటారు, నూతన ప్రయత్నాలు నిదానంగా నెరవేరుతాయి.

**కన్య :**మిమ్ములను రెచ్చగొట్టాలని మీ శత్రువర్గం చేసే యత్నాలు ఫలించవు. ప్రముఖులను కలిసి ముఖ్యమైన విషయాలు చర్చిస్తారు.

**తుల :**అరుదైన ఆహ్వానాలు అందు కుంటారు. సోదరులకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు. ఆస్తి వివాదాలు తీరుతాయి.బంధువులకలయిక.

**వృశ్చికం:**దూరపు కొండలు నునుపు అనునట్లు చేతిలోని అవకాశాలు కన్నా స్థాయికి మించిన వాటి గురించి ప్రయత్నించి భంగపడతారు.

**ధనుస్సు:** తాత్కాలికంగా దూరమైన ఓ వర్గంతో తిరిగి సఖ్యతను ఏర్పరచు కుంటారు. విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:**ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు అధిగమిస్తారు.

**కుంభం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు కలిసి వస్తాయి.

**మీనం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఉద్యోగాలలో నూతన బాధ్యతలు చేపట్టవలసి వస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఉండాలి, చాకచక్యంగా నియంత్రించాలి: సిఎం చంద్రబాబు



సైబర్ నియంత్రణ వ్యవస్థపై సమీక్షిస్తున్న చంద్రబాబు

-సైబర్ నేరాల నియంత్రణా వ్యవస్థపై సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సిఎం
- గోల్డెన్ అవర్, ఎపి సైబర్ పాలసీ తదితర అంశాలపై సమాలోచనలు.
సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్..

విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి: సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేరాల ద్వారా బాధితుల సొమ్మును రాబట్టేందుకు గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని పోలీసు అధికారులు, బ్యాంకింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. సచివాలయంలో బుధవారం సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఏపీలో నియంత్రణా వ్యవస్థలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్థిక నేరాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లు ఇతరుల బ్యాంక్ ఖాతాలను వినియోగించకుండా చేపట్టే చర్యలు, గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ, ఏపీ సైబర్ పాలసీ తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఏపీలో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు జరగకుండా బ్యాంకులు తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై రిజర్వు బ్యాంకును సంప్రదించాలని సీఎం సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సీఎం కొన్ని సూచనలు చేశారు. ఆథార్ ఆథంటికేషన్, కేవైసీ లాంటివి లేకుండా షెల్ కంపెనీలను కొందరు ప్రారంభిస్తున్నారని... ఇలాంటి ఘటనలపై అధ్యయనం చేయా లన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీ టీఎస్, ఆర్థిక శాఖలు సమన్వ యంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విష యంలో ఓ నియామవళిని సిద్ధం చేయా లని సీఎం నిర్దేశిం చారు. అనుమా నిత మ్యూల్ బ్యాంకు ఖా తాలను ఫ్లాగ్ చేసే అం శాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సైబర్, ఆర్థిక నేరాల్లో ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. యూపీఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ అంశంపై మరిన్ని సాంకేతికపరమైన నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీటీఎస్ ముఖ్య భూమిక పోషిం చాలని... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలని అన్నారు. రిజర్వు బ్యాంకు తీసుకు వచ్చిన మ్యూల్ ఆ కౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ ను నకిలీ ఖాతాలను గుర్తించేందుకు వినియోగించాలన్నారు. సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడగలిగామని స్పష్టం చేశారు. పిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, ఆన్ లైన్ లోన్ ఫ్రాడ్స్ సహా డిజిటల్ అరెస్టుల్లో బాధితులు సొమ్మును కోల్పోతున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సీఐడీ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని.. విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్య మంత్రికి వివరించారు. మరోవైపు ఏపీలో సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా సైబర్ నేరాల్లో తక్షణ స్పందన ఉండాలి, చాకచక్యంగా నియంత్రించాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై అధికారులతో చర్చిండేటాకు రక్షణ కల్పిస్తున్నామని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కేపీసీ గాంధీ, బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో బ్యాక్‌లాగ్స్‌ను 16వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలి : మంత్రి నాదెండ్ల

విజయవాడ, మే 13,ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న బ్యాక్‌లాగ్స్‌ను ఈ నెల 16వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి జిల్లాల పౌర సరఫరాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నిరోధం, పెట్రోల్ బంకుల పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. కొన్ని జిల్లాల్లో గ్యాస్ బుకింగ్ చేసినా డెలివరీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ఏలూరు, అనకాపల్లి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో బ్యాక్‌లాగ్స్ అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల 5 వేలకు పైగా బుకింగ్స్ పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తూ, బాధ్యులైన డిస్ట్రిబ్యూటర్లపై అవసరమైతే సస్పెన్షన్ వేటు వేయాలని ఆదేశించారు. గ్యాస్ బుక్ చేసిన 4 నుంచి 5 రోజుల్లోనే వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేరేలా యంత్రాంగం పనిచేయాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.



## దేశవ్యాప్తంగా బిజెపికి అనుకూల వాతావరణం

### - రాష్ట్ర బిజెపి సంఘటన మంత్రి మధుకర్

తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి: భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్‌లో బలపడేందుకు ఆరు నెలలపాటు అక్కడే ఉండి పార్టీ విజయానికి విశేషంగా కృషి చేసిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ సంఘటన మంత్రి మధుకర్‌కు తిరుపతిలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించినట్లు మధుకర్ తెలిపారు. ప్రజల్లో బీజేపీపై విశ్వాసం పెరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రానున్న రోజుల్లో సంపూర్ణ మెజారిటీతో బీజేపీ జెండా ఎగరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఆయనకు పూలమాలలతో స్వాగతం తెలిపారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకలు వెంకట ముని, భాస్కర్, విశ్వనాథ్, లోక ప్రభాకర్ నాయుడు, తొండమ నాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవి ప్రసాద్ పాల్గొన్నారు.

## ఇంటెగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో భక్తులకు శీఘ్రంగా శ్రీవారి దర్శనం



తిరుమల,మే 13 ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వాడ గోవింద నామస్మరణతో తిరుమలకు వస్తున్న భక్తులకు వీలైనంత త్వరగా స్వామివారి దర్శనం చేయించేలా టిటిడి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సమన్వయ చర్యలతో మరింత సమర్థవంతంగా క్యూ లైన్ల నిర్వహణ, డిజిటల్ మానిటరింగ్‌తో రద్దీ భారీగా ఉన్నా భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి నిరంతరం పర్యవేక్షిస్తు న్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా నారాయణగిరి షెడ్ల నుండి క్యూలైన్లు బయటకు రాకుండా సమగ్ర చర్యలు వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరుగుతున్నప్పటికీ టిటిడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగి స్తూ భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పిం చేందుకు సమర్థ వంతమైన చర్యలు చేపడుతోంది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తోంది. తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లు, నారాయణ గిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసరాలు తదితర ప్రాంతాల్లో నెల కొన్న పరిస్థితులను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులు నిరంతరం పర్యవేక్షి స్తున్నారు. వందల సంఖ్యలో ఏర్పా టు చేసిన సిసి కెమెరాల ద్వారా భక్తుల కదలికలు, రద్దీ తీవ్రత, క్యూ లైన్ల ప్రవాహం వంటి అంశా లను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. భక్తులు ఏ ప్రాంతంలో ఎక్కువసేపు వేచి ఉండకుండా క్యూలైన్లను సమ తుల్యం చేయడం జరుగుతోంది. అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించడం, తాగునీరు, పాలు, అన్న ప్రసాదం, వైద్య సేవలు వేగంగా అందించడం వంటి చర్యలు సమన్వ యంతో కొనసాగుతున్నాయి. దీంతో దర్శన సమయ నియంత్రణలో గణనీయమైన మెరు గుదల కనిపిస్తోంది. ప్రత్యేకించి నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని డిజిటల్ మానిటరింగ్ ద్వారా అంచనా వేసి, దానికి అనుగుణంగా భక్తులను విడతల వారీగా ముందుకు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా సాఫీగా దర్శనానికి చేరు కుంటున్నారు. టిటిడి అమలు చేస్తున్న ఆధునిక రద్దీ నిర్వహణ విధానాల వల్లే క్యూలైన్లలో భక్తుల రద్దీ తక్కువగా కనిపిస్తోంది. గతంలో మాదిరిగా భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలిచిపోయే పరిస్థితులు లేకుండా, సాంకేతిక ఆధారంగా టిటిడి యంత్రాం గం సమన్వయంతో భక్తులను వేగంగా దర్శనానికి పంపిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు సౌకర్యవంతమైన,వేగవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలతో అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా

## ఉండి నియోజకవర్గంలో అక్రమ కూల్చివేతలు ఆపాలి : సిపిఎం

### - నీట్ పరీక్షల నిర్వహణ నుండి ఎన్.టి.ఎ.ను తప్పించాలి

విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను ఆపాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉనుదుర్రు గ్రామంలో పేదల ఇళ్ళను కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్న సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాస్ ని పోలీసులు గృహనిర్బంధం చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నదన్నారు. వెంటనే ఉండి నియోజకవర్గంలో కొనసాగుతున్న పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను ఆపాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. గత సంవత్సర కాలంలో ఉండి నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ఆక్రమణలు, కాలుష్యం పేరుతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అండదండలతో పేదల ఇళ్ల కూల్చివేతలు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఉనుదుర్రు గ్రామం 50 ఏళ్ళకు పైగా నివాసం ఉంటున్న వారికి కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా అక్రమంగా 60 ఇళ్లను నేలమట్టం చేయడం అన్యాయమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదల ఇళ్ల అక్రమ కూల్చివేతలను నిలిపివేయాలని కోరారు. ఇక మరో ప్రకటనలో నీట్ పరీక్షా పేపర్ లీకేజ్‌ను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పరీక్షల నిర్వహణ నుండి ఎన్.టి.ఎ.ను తప్పించాలని డిమాండ్ చేసింది.. లీకేజ్ దాదాపు 23 లక్షల మంది విద్యార్థులను తీవ్రమైన మానసిక ఒత్తిడిని గురిచేసిందన్నారు. ఎన్‌టిఎ నిర్వహిస్తున్న అనేక పరీక్షల్లో పెద్ద ఎత్తున అవినీతి, నిర్వహణ లోపాలు, లీకేజీలు మొదటిది కాదు అని, ప్రారంభం నుండీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షా వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తూనే ఉంది అని చెప్పారు.



## తిరుచిరాపల్లి ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్‌గా టి.విజయలక్ష్మి

ఒంగోలు, మే 13, ప్రభాతవార్త: తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి టి.విజయలక్ష్మి నియమితులయ్యారు. ఆమె మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సతీమణి. ఈ నెల 11వ తేదీన ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 33 సంవత్సరాలుగా ఆదాయపు పన్ను శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన విజయలక్ష్మి బెంగళూరు, రాయచూర్‌లలో జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం కర్నూలులో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే చెన్నైలో కమిషనర్‌గా, హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ కమిషనర్‌గా సేవలందించారు. విద్యార్హతల విషయానికి వస్తే.. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన ఆమె.. బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ చేశారు. అదనంగా సింగపూర్ యూనివర్సిటీ, అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలలో ప్రజా విధానాలపై ప్రత్యేక డిగ్రీలు పొందారు.

## జూలై 31లోపు పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తవ్వాలి :టిటిడి జెఇఒ శరత్



తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతిలో నిర్మాణంలో ఉన్న పద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను జూలై 31వ తేదీ లోపు పూర్తి చేయాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులకు ఆదేశించారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశాలతో టిటిడి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంతస్తులో ఏర్పాటు చేయనున్న విభాగాలు, గదులు, వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలను స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదిక సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి ఫ్లోర్‌లోని గదుల వారీగా ఎలక్ట్రికల్, ఎయిర్ కండిషనింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్, వైద్య పరికరాలు, వైద్యులు రోగుల అవసరాలకు అనుగుణంగా కల్పిస్తున్న సౌకర్యాలను లే అవుట్ ప్రణాళికలో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్ - రూ.53 లక్షల విలువైన బంగారం, వెండి, బైకులు స్వాధీనం

పులివెందుల, మే 13, ప్రభాతవార్త: మోటార్ సైకిళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, బంగారు దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పులివెందుల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.53,01,700 విలువైన 19 మోటార్ సైకిళ్ళు, బంగారం, వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కదిరి రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద మోటార్ సైకిల్ దొంగలను, కడప రింగ్ రోడ్డులో మరో ముఠాను, పార్నపల్లె బస్టాప్ వద్ద బంగారు షాపులో చోరీ చేసిన నిందితులను, ఉలిమెల్ల రింగ్ రోడ్డులో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 22 కేసులను ఛేదించినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.18.15 లక్షల విలువైన 19 మోటార్ సైకిళ్ళు, రూ.2.79 లక్షల విలువైన ఒక కిలో వెండి వస్తువులు, రూ.50 వేల విలువైన రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే చైన్ స్నాచింగ్ కేసుల్లో 91 గ్రాముల బంగారం (రూ.13.52 లక్షలు), బంగారు దుకాణాల్లో చోరీ చేసిన 103 గ్రాముల బంగారం (రూ.15.25 లక్షలు) స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగభాషా, పులివెందుల మంగళ కాలనీకి చెందిన బూసపాటి కుమార్, ఎల్లనూరు మండలానికి చెందిన గున్నోళ్ల గంగయ్య, నగిరిగుట్టకు చెందిన షేక్ హుస్సేన్, గొండగట్టుపల్లెకు చెందిన మలికి విజయ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే బీహార్ రాష్ట్రంలోని భగల్పూర్ జిల్లాకు చెందిన చోటు కుమార్, బంగారు దుకాణాల్లో చోరీలకు పాల్పడిన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పాత కందూరుకు చెందిన నారాయణమ్మ, ఉమాదేవిలను కూడా అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసులను ఛేదించి భారీ స్థాయిలో ఆస్తులను రికవరీ చేసిన పులివెందుల పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

# తిరుమల సమాచారం

## పారదర్శకత కోసమే ఆన్‌లైన్‌లో విడుదల

## శ్రీవాణి దర్శన టికెట్లపై అపోహలను నమ్మొద్దు: టిటిడి



తిరుమల,మే 13 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్‌కు సంబంధించి వస్తున్న వార్తల నేపథ్యంలో భక్తులు అపోహలకు గురికావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. టిటిడి శ్రీవాణి ట్రస్టు టికెట్ల బుకింగ్ విధానాన్ని 2019 మే నెలలో ప్రవేశపెట్టింది. అప్పటి నుండి భక్తులు మధ్యవర్తుల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవడం జరుగుతోంది. అందులోని లోటుపాట్లను , భక్తుల నుండి వచ్చిన సూచనలు, సలహాల మేరకు 2024 సంవత్సరం జూన్ నుండి భక్తులకు పారదర్శకంగా, సురక్షి తంగా సేవలు అందించేందుకు శ్రీవాణి టికెట్ బుకింగ్ విధానాన్ని అత్యంత పటిష్టంగా రూపొందించడం జరిగింది. శ్రీవాణి టికెట్ బుకింగ్ సైట్‌ను హ్యాక్ చేయడం,వ్యవస్థలో చొరబడటం ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యం కాదని పేర్కొంది. భక్తులు అపోహలకు గురి కావద్దని, అయితే కొందరు దళారులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఏఐ ఆధారిత ఆటో ఫిల్లింగ్, ఆటో కాపీయింగ్ వంటి పద్ధతుల ద్వారా వేగంగా వివరాలు నమోదు చేసి టికెట్లను బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని టిటిడి తెలిపింది. ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలను టిటిడి సాంకేతిక విభాగం ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత ఐడీలు , అక్రమ బుకింగ్ విధానాలను వెంటనే నిరోధించి తదనుగుణంగా సాఫ్ట్ వేర్ ను కూడా ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిరంతర నిఘా ఉంచడం జరుగుతోంది. అదేవిధంగా కొంతమంది దళారులు భక్తులను తప్పుదోవ పట్టించి నకిలీ టికెట్లను విక్రయిస్తున్న నిందితులపై కూడా టిటిడి కఠిన చర్యలు తీసుకోవడం జరిగింది. అడ్వాన్స్ బుకింగ్ సాఫ్ట్ వేర్ ను ముందు వచ్చిన వారికి ముందు బుక్ చేసుకునే విధానంలో అభివృద్ధి చేయడం జరిగింది. బుకింగ్ సమయంలో ఏదైనా కారణంగా టికెట్ బుక్ కాకపోయినా ,నగదు చెల్లింపులో లోపం తలెత్తితే వెంటనే ఆ టికెట్లు భక్తులకు అందుబాటులోకి వచ్చేలా ఈ అప్లికేషన్ పని చేస్తోంది. భక్తులు కేవలం అధికారిక టిటిడి వెబ్‌సైట్ ,అధికారిక మార్గాల ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## 18న ఆగస్టునెల ఆర్జితసేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో

తిరుమల, మే 13ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఆగస్టు నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఆగస్టు నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో ఈనెల 18వతేదీ సోమవారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ ఉదయం 10గంటలవరకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 22 మధ్యాహ్నం 12గంటల వరకు ఆన్‌లైన్‌లో సొమ్ముచెల్లించి లక్కీడిప్‌లో టిక్కెట్లు మంజూరవుతాయి. ఇక కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ టిక్కెట్లు వర్చువల్ కోటా తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉద యం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. 23వతేదీ శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్లకు సంబంధించి ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 23న మధ్యాహ్నం 3గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు,దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఉచిత టోకెన్లు జారీచేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు, 25న వసతి కల్పన విడుదల చేస్తారు.

## వేసవి సెలవులు.. భక్తులతో కొండ కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల, మే 13 ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవి సెలవులతో బుధవారం ఉదయానికి వైకుంఠమ్2లో 14కంపార్టుమెంట్లు నిండాయి. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరి గింది. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 14గంటలు సమయం పడుతోంది. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు....ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 37వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి.

## రిషికేశ్‌లో చంద్రమోళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



తిరుమల, మే 13 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలతిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని రిషికేష్‌లో చంద్రమోళీశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా ఆరంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 15న వైభవోపేతంగా కల్యాణోత్సవం హిమాలయ పర్వత శ్రేణుల నడుమ పవిత్ర గంగాతీరాన ఆంధ్రాశ్రమంలోని చంద్రమోళీశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మే 12న ప్రారంభమైన ఈ ఉత్సవాలు మే 16వ తేదీ వరకు ఘనంగా నిర్వహించబడనున్నాయి. 15న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మే 13న ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మికానందాన్ని పంచారు. నేటి ఉదయం శేషవాహనం, రాత్రి గజవాహన సేవలు నిర్వహించనున్నారు. మే 15న ఉదయం సింహవాహన సేవ అనంతరం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. అనంతరం వృషభవాహన సేవ నిర్వహిస్తారు. మే 16న ఉదయం త్రిశూలస్నానం, తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవం రేపు సాయంత్రం 4.30 గంటలకు జరుగనుంది. గృహస్తులు (ఇద్దరు) 501/రూపాయలు టికెట్ కొనుగోలు చేసి దివ్యోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవచ్చు.

## చరిత్రలో నిలిచిపోయేలా నెల్లూరు మహానాడు

### - కిసాన్ సెజ్ వేదికగా టిడిపి పండుగకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు: మంత్రి నారాయణ

కొడవలూరు (నెల్లూరు), మే 13, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక ఉత్సవం మహానాడుకు నెల్లూరు జిల్లా ముస్తాబవుతోంది. చరిత్రలో నిలిచిపోయేలా, పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం నింపేలా మే 27, 28, 29 తేదీల్లో కిసాన్ సెజ్ వేదికగా ఈ వేడుకలను నిర్వహించ నున్నారు. నెల్లూరు జిల్లాలో తొలిసారిగా జరుగుతున్న ఈ మహత్తర కార్యక్ర మాన్ని విజయ వంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శర వేగంగా అడుగులు వేస్తున్నాయి. బుధవారం కిసాన్ సెజ్ ప్రాంగణంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరి గింది. ఈ సందర్భంగా ఏర్పాట్లను మంత్రులు, అగ్ర నేతలు సమీక్షించారు. జిల్లాకు దక్కిన గౌరవం సమావేశం అనంతరం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నెల్లూరు జిల్లాలోని కిసాన్ సెజ్‌ను మహానాడు వేదికగా నిర్ణయించడం జిల్లాకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. టీడీపీ చరిత్రలోనే ఈ మహానాడు అ త్యంత ప్రతిష్టా త్మకంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడా చిన్న లోటుపాట్లు లేకుండా, పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నామని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామని వివరిం చారు. అందరినీ సమన్వయపరుచుకుంటూ ఈ వేడుకను దిగ్విజయం చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. కమిటీలకు దిశానిర్దేశం సన్నాహక సమా వేశంలో రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ప్రస్తుత అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కలిసి మహానాడు నిర్వహణకు సంబంధించిన వివిధ కమి టీల కన్వీనర్లు, కోకన్వీనర్లు, సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
Nit No.01/EE, PR(PRI), పాడేరు/2025-26 తేది: 07.05.2026
ASR జిల్లా, ముంచింగిపుట్టు మండలం యొక్క MPDO కార్యాలయానికి అదనపు వసతి భవనం 15వ ఆర్థిక సంఘ గ్రాంట్ క్రింద రూ.20.00 లక్షలతో నిర్మాణం చేపట్టడానికి పర్సంటేజ్ రేట్ టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డౌన్‌లోడ్ తర్వాత: 12.05.2026. తదుపరి వివరాలకు https://www.apeprocurement.gov.in వీక్షించండి. ఫోన్ నం: 8791914161.
సం/-, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, PRI- డివిజన్, పాడేరు.
DIPR.NO. 20355/CL/ADVT/1/1/2022-23 తేది: 13.05.2026

VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ
పత్రికా ప్రకటన
Eoffice No.11021/69/2026/L8 (c-3244870), తేది 13-05-2026
ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునదేమనగా M/s.Hanuman Real Tech LLP, Rep. by its Designated Partner శ్రీ హేమంగ్ చౌధరి, విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, మోదవలస గ్రామం నందలి సర్వే సంఖ్యలు 202/30, 31, 32, 33, 34, 35, 36, 37 & 38 లో ఎకరములు 2.2734 సెంట్లు గల లేఅవుట్ అనుమతి నిమిత్తం దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్లైన్ నెం.1167/0080/LP/VMRDA/2025 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.
కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగి యున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియచేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి, సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.
Sd/- Metropolitan Commissioner, VMRDA

14-5pg4.qxd:14-5pg4.qxd 1/1/02 6:09 AM Page 1



వార్త

నేరం చేసిన వాడిని శిక్షించడమే ప్రధానం కాదు. ఆ నేరం చేయడానికి ఏ పరిస్థితులు అతడ్ని పురికొల్పాయో వాటిని తొలగించడం ప్రధానం.

న- ఎమ్.ఎన్.రాయ్

# విజయ్ సర్కార్‌కు వణక్కం

తమిళనాడు శాసనసభలో మొట్టమొదటిసారిగా ద్రవిడేతర పార్టీ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గెలుపొందింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తమిళ వెట్రికళగం పార్టీ (టి.వి.కె)అధ్యక్షుడు సి.జోసెఫ్ విజయ్ ఎంతో అవలీలగా విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. బలపరీక్షలో విజయ్‌కు అనుకూలంగా 144 మంది సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేయగా వ్యతిరేకంగా 22మందిఓట్లేసారు. 61 మంది ఎమ్మెల్యేలు విజయ్ బలపరీక్షను నిరసిస్తూ సభను వాకౌట్ చేశారు. ఐదుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. బలపరీక్షకు ముందు ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ తాము సెక్యులర్ పాలనను అందిస్తామని, జన సర్కార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రజలు అవకాశం కల్పించారని విపక్షాలు ఆరోపించినట్లు విశ్వాస పరీక్ష నెగ్గేందుకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎలాంటి బేరసారాలు చేయలేదని విజయ్ స్పష్టం చేశారు. అందరూ మెచ్చే పాలనలో గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమపథకాలు కొనసాగిస్తామని ప్రకటించారు. సభలో విపక్ష డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ ప్రజామోదం పొందడంలో టి.వికె విఫలమైందని, తమ కూటమిలోని పార్టీలే విజయ్‌కు మద్దతునిస్తున్నాయని ఎమ్మెల్యేల బేరసారాలకు తెరతీసిందని విమర్శించారు. అటుపై డిఎంకె సభ్యులంతా వాకౌట్ చేశారు. ఆల్ ఇండియా అన్నాడిఎంకె పళనిస్వామి కూడా తమ ఎమ్మెల్యేలకు 'ఎర'వేసి తమ వైపునకు తప్పుకున్నారని ఆరోపించారు. సాధారణంగా విశ్వాస పరీక్ష సందర్భంగా జరుగుతున్న వ్యవహారశైలిని పార్టీలు తమ ఉపన్యాసంలో అధికార పక్షాన్ని ఎండకట్టడం సహజం. బేధాభిప్రాయాలు సహజంగా ఉండే రాజకీయ పార్టీలలో బేరసారాలతో చీలిక తీసుకురావడం తగదని టివికెకి హితవు చెప్పడం విశేషం. ఎవరికి అవకాశం వస్తే వారు తమ అవసరాల మేరకు ప్రభుత్వంపై పట్టుసాధించాల్సి వచ్చినప్పుడు టక్కుటమార గోకర్ణ విద్యలతో ప్రభావితం చేయడం తమిళ రాజకీయాల్లో సర్వసాధారణంగా జరిగేదే. కానీ ఈసారి ఓటమి ద్రవిడ రాజకీయ పార్టీలది అవడంలో హితోపదేశాలతో సరిపుచ్చారు. గతంలో జయలలిత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను స్టాలిన్ కొనసాగించినట్లుగానే డిఎంకె ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉనికిలో ఉంటాయని విజయ్ ప్రకటించడం ఆహ్వానించదగిన అంశం.ఏదిఏమైనా బలపరీక్ష సందర్భంగా ఎదుర్కొన్న ఆరోపణలు, సంక్షోభ సమయంలో ఇబ్బందులు, వివిధ పార్టీల ప్రవర్తన, వారి ఆకాంక్షలు నిలబెట్టుకోవాలన్న ప్రయత్నం.... ఇవన్నీ చూసి 'ఇళ్లలకంగానే పండుగ కాదు ముందుంది ముసళ్ల పండుగ అన్నది కొత్త ముఖ్యమంత్రికి తెలిసొచ్చినట్లుంది. తమిళనాడు శాసనసభలో మొత్తం సీట్లు 234 కాగా బలపరీక్ష సమయంలో డిఎంకె, అన్నాడిఎంకె పళని స్వామి వర్గం ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. పిఎంకె సభ్యులు గైర్హాజరైన వారిలో ఉన్నారు. బలపరీక్షలో విజయ్ గెలిచినట్లు స్పీకర్ జెసిడి ప్రభాకర్ ప్రకటించారు. ఈ పరీక్షలో ఎమ్మెల్యేలు తమ సీట్లోనే నిలబడి తాము విజయ్‌కు మద్దతునిస్తున్నట్లు తెలిపారు. విజయ్ నేతృత్వంలోని 10సీట్లకు ముందే ఆగిపోవడంతో నాలుగు సార్లు గవర్నర్‌ను కలిస్తే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏలిన వారి దయ కలుగలేదు. అంకెల ప్రమాణంతో విజయ్‌ను తొలుత ఆ రాష్ట్ర గవర్నర్ పదేపదే తిప్పించుకున్నారన్న అపప్రథ పొందారు. సంపూర్ణ మద్దతుతోనే స్వచ్ఛమైన పాలనను అందించే ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టాలనే భావనతోనే ఆయనలా వ్యవహరించారన్న విశ్లేషణలు మొదలయ్యాయి. ఏమైతేనేం ఇక విజయ్‌కు ఇప్పుడు అడ్డూఅదుపు లేదు. ప్రభుత్వాధినేతగా ఆయన తొలి సంతకాలు పెట్టిన నిర్ణయాలను బట్టి విజయ్ పాలనపై కొన్ని అంచనాలు మొదలయ్యాయి. తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ నిరూపణలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తనకున్న 107 సీట్లతో పాటు విసికె,ఐయుఎంఎల్ వామపక్షాలు,కాంగ్రెస్ పార్టీలతో కేవలం 120మంది మద్దతును కూడగట్టారు. తీరా అసెంబ్లీలో గెలుపుసాధించిన తర్వాత అనుకూల, వ్యతిరేక వర్గాల ఓట్లు గణిస్తే మేజిక్ ఫిగర్‌ను,విజయ్ చూపిన మద్దతుదారుల సంఖ్యనుదాటి మొత్తం అనుకూల ఓట్లు144కి చేరాయి.అయినా అనుకోని విజయాలు విజయ్ చెంత చేరాయి. అంతకు ముందే అనూహ్యంగా అన్నా డిఎంకెలో వేరు పడిన సీనియర్ నేతలు ఎస్.పి వేలుమణి, సి.వి షణ్ముగం వర్గం తాము వేరుగా విప్‌ను నియమించుకుంటామని కోరగా స్పీకరు అంగీకరించడంతో అసెంబ్లీలో అధికార పార్టీ ఎత్తుగడల మీద ఆరోపణలు వెల్లువెత్తాయి. చీలిక వర్గ స్థాయిని,హోదాని ప్రకటించకుండా 'విప్' నియామకానికి అనుమతినీయడం విమర్శలకు గురైంది. పనిలో పనిగా ప్రభుత్వం తొలి అడుగులు తప్పటడుగుతో మొదలెట్టిందనే యోచనలో ఎండిఎంకె అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ప్రేమలతా విజయకాంత్ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వ పొలిటికల్ అడ్వైజర్‌గా ఒక జ్యోతిష పండితుడు రాధా పండిట్‌ను నియామకం యూత్‌కు ఎలాంటి సంకేతాలు పంపిస్తున్నాయో ముఖ్యమంత్రి ఆలోచించుకోవాలని ఎదురుదాడి చేశారు. బేషరతుగా మద్దతునిచ్చినట్లు చెప్పుకున్న విదుతలై, చిరుతైగల్ కట్చి (విసికె)కి ఐదుగురు ఎమ్మెల్యేలున్నారు. సభలో ఈపార్టీ ఎమ్మెల్యే వన్నివరసు ప్రసంగంలో సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచాలని, హేతువాద ఆలోచనలను ప్రోత్సహించాలని జ్యోతిష్యం వంటి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా కఠిన చట్టం తీసుకురావాలనీ కోరారు. ఆనక విజయ్ రాధా పండిట్ నియమాకాన్ని పక్కన పెట్టారు. బహిరంగంగా వారి సూచనలు. ఇవన్నీ వింటుంటే జనానికి దడ పుట్టించక మానవు. తమిళనాట ఆలయాలు, విద్యాలయాల వద్ద ఉండే 717 దుకాణాల మూసివేతకు విజయ్ ఆదేశాలిచ్చారంటే ఆయన పాలన ఎలా ఉంటుందో రుచి చూపించారని అనుకోవాలి. ఈ ఐదేళ్లపాటు ద్రవిడేతర రాజకీయ పార్టీని ద్రవిడ పార్టీలు ఎంత బేషుగ్గా పాలించనిస్తాయో చూడాలి.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

మనకు ఉన్న సంపదతో సంతృప్తి పడటం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.



సర్వేపల్లి రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### నీటి కేంద్రాలను ఏర్పాటు చేయాలి

భారతదేశంలో ఈఏడాది సూర్యుడి ప్రతాపం మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ వేసవి కాలమంతా ఎండలు మండుతాయని వాతావరణ హెచ్చరికలు జారీ అయ్యాయి. ప్రస్తుత పరిస్థితి ఒక జాతీయ విపత్తును తలపిస్తోంది. ఈతీవ్రమైన వడగాల్పులనుండి ప్రజలను రక్షించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలతో కలిసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి.వడదెబ్బపై అవగాహన కల్పించడంతోపాటు చికిత్స సౌకర్యాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, వ్యవసాయ కూలీలు వంటి పేద వర్గాలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరికి సామాజిక భద్రతా చర్యలు కల్పించడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత. ప్రతి చోటా సురక్షితమైన తాగునీరు అందేలా చూడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం

పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో, ప్రత్యేక గుర్తింపు స్కూల్లో కాకుండా కేవలం ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చేర్పిద్దాం. ఉన్నత స్థాయిలోనిలబెడదాం. ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి లక్షలు ధారపోసేకన్నా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పదిమంది పిల్లలనుచేర్పిద్దాం.ఇద్దరిది ఒకే స్థాయి విద్యా అయినప్పుడు డబ్బులు ఎందుకు వృథా చేయాలి. అవకాశాలను ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదు అనేది తల్లిదండ్రులు ఆలోచించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు!

నేపాల్‌లో బంగ్లాలో శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈ జెన్ జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. కెపి శర్మ ఒలి భారత్‌వ్యతిరేక వాక్యాలుచేసిన అమెరికా వ్యతిరేక వాక్యాలు చేసిన దేశంలో నిరుద్యోగం వలసీకరణ అవినీతి పెచ్చరిల్లాయి అన్నది వాస్తవం. అయితే ప్రజా పోరాట విస్ఫోటనం తరవాత శ్రీలంక బంగ్లాదేశ్ లాంటి రాజ్యాలు లేక దేశాలు పాలసీలు రూపకల్పన, వాటి అమలులో వెనుకబడిపోయాయి అన్నది కాదనలేని వాస్తవం.

- కె.రామారావు,నల్గొండ

### ఉపాధి హామీ అవసరం

తెలంగాణకు ఉపాధి హామీ అవసరం ఏమిఉంది. ఒక్క తెలంగాణలోనే కాదు భూ పరివేష్టిత రాష్ట్రాలకు ఉపాధి హామీ అవసరం. గిరిజన ప్రాంతాలలో ఉపాధి హామీ ద్వారా వివిధ రకాలు అయినా ప్రాజెక్ట్స్ చేసేందుకు వీలు అవుతుంది. ముఖ్యంగా మట్టి రోడ్ల నిర్మాణం గురించిన ప్రాజెక్ట్స్ పెద్ద ఎత్తున చేపట్టాలి. ఒకరకంగా ఇదిఆహ్వానించదగిన మార్పు ఎందుకని వారి పొలాల దగ్గరికి బాటలు ఉంటే వారి భూమికి ఎక్కువ రేట్ వస్తుందనేది వారి కోరికగా ఉన్నది ఇది గొప్ప మార్పు మాత్రమే కాకుండా గొప్పఆస్తిగా కూడా నిలబడుతుంది. రెండవవిషయం నీటికుంటాల నిర్మాణం చేపట్టడానికి గిరిజన ప్రాంతాల ప్రజలుముందుకు వస్తున్నారు. ఎందుకు అంటే నీటి నిల్వపైన వారిపరిజ్ఞానం పెరిగింది. ఇందులో ఎంత మాత్రం సంశయం లేదు. నీటి నిల్వ పెంచడం మూలంగా పంటలకు నీటి కటకట రాకుండా ఉంటుంది.

- భారత అవినాష్, జనగామ

### మద్యాన్ని నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్నినగరాలలో జనవాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడువివిధ జంక్షన్‌లోకి వచ్చే జనం ఆ మార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై ఇతరులతో ఘర్షణలకు దిగుతున్నారు.కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా దుకాణదార్లు ఏమి చేయలేకపోతున్నారు. ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

- బి. మేఘానథం, విశాఖపట్నం

### జనరిక్ మందులపై అవగాహన అవసరం

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్ల పేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువ ధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ఇవి బ్రాండ్ మందులంతటితో సమానమైన ప్రభావం కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఔషధి కేంద్రాల ద్వారా వీటిని విస్తృతంగా అందుబాటులోకి తేవాలి.

- పి. రాజేష్‌కుమార్, వరంగల్‌జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అధికార భాషా సంఘం అలంకారమేనా!

**ప్రజల భాషలో పరిపాలన జరగడమన్నది ప్రజాస్వామ్య పటిష్టతకు, పరిణతికి అత్యంత ఆవశ్యకం. పరిపాలన ఎట్లా, ఏవిధంగా జరుగుతుందో, దాని ఫలితాలను అనుభవించే ప్రజలకు క్షుణ్ణంగా తెలియాలి. వారి ప్రమేయం లేని వారి శ్రద్ధాసక్తులతో మమేకం కాలేని ప్రభుత్వ పరిపాలన నిష్ప్రయోజనం. అధికార భాషా సంఘం పరిధి ప్రభుత్వ కార్యాలయాలలోని పాలనా వ్యవహారాలలో తెలుగు ఎంతవరకు అమలు అవుతోంది. అందుకు తీసుకోవలసిన చర్యలేమిటో ప్రభుత్వానికి సూచించడం వరకే. దానిపై ముందుకు వెళ్లడం ప్రభుత్వం చేయవలసిన పని, అక్కడ ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.**



ఆచార్య టి. గౌరీశంకర్

ఒక భాష బోధనాభాషగా,పాలనా భాషగా పత్రికాభాషగా కొనసాగినప్పుడే అది మనగలుగుతుంది. నేడు తెలుగుభాషకు సంబంధించి చూసినట్లయితే పత్రికా భాషగా మాత్రమే ముందంజలో ఉందనిపిస్తుంది.ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలోనే తెలుగు కనిపిస్తుంది, వినిపిస్తుంది. బోధనాభాషగా తెలుగు పరిస్థితి అనిశ్చితంగా ఉంది. ఇక పాలనా భాషగా తెలుగు గురించి మాత్రం చర్చించుకోవలసి ఉంది. ప్రపంచంలోని 7,164 భాషలలో ప్రజలచేత విరివిగా మాట్లాడబడే భాషలలో తెలుగు 14వ స్థానంలో ఉందంటారు. ఇక భారతదేశంలో అత్యధికులు మాట్లాడే హిందీ భాష తరువాత ఒకప్పుడు రెండవస్థానంలో ఉన్న తెలుగుభాష ఇప్పుడు నాల్గవస్థానంలోకి దిగిపోయింది. రెండవ స్థానంలో బెంగాలీ, మూడవస్థానంలో మరాఠీ భాషలు ఉన్నాయి. బ్రిటిష్ పాలనాకాలంలో 1943 నాటి నాణేల మీద ముద్రించిన నాలుగు భాషలలో తెలుగు ఒక భాషగా ఉండేది.2008లో అక్టోబర్ 31వ తేదీనభారత ప్రభుత్వం తెలుగుభాషకు ప్రాచీన హోదాను ప్రకటించింది. 2012లో ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ తెలుగు లిపిని ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపిగా గుర్తించింది. మొదటిస్థానంలో కొరియా లిపి నిలిచింది. సమస్త వైజ్ఞానిక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగే పద సంపద, సామర్థ్యం తెలుగుభాషకు ఉందని జె.బి.ఎస్. హాల్డెన్ అనే విదేశీ పండితుడు ఏనాడో పేర్కొన్నాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆనాడు వైద్య, ఇంజినీరింగ్ కోర్సులు నిజాం పాలనాకాలంలో ఉర్దూ మాధ్యమంలో బోధించబడ్డాయి. 1948లో పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడ ఉర్దూను అధికార భాషగా ప్రకటిస్తే, అత్యధిక ప్రజల మాతృభాష బెంగాలీ అయినందువల్ల, వారంతా ఉర్దూను అధికారభాష గా వ్యతిరేకిస్తూ, బెంగాలీ అధికారభాషగా ప్రకటించాలని పెద్ద ఎత్తున ఉద్యమించి, అందులో నలుగురు విద్యార్థులు ప్రాణాలను కూడా పోగొట్టుకున్నారు. దాంతో ప్రభుత్వం దిగివచ్చి బెంగాలీని అధికార భాషగా ప్రకటించింది. ఒక భాష కోసం ఉద్యమించడం, ఆ భాష ద్వారా ఒక ప్రత్యేక దేశాన్నే సాధించుకోవడం ప్రపంచ చరిత్రలో బంగ్లాదేశానికే సాధ్యమయింది. దాని మేరకే కదా యునెస్కో ఫిబ్రవరి 21వ తేదీని ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం'గా ప్రకటించింది. 1920లో సథామస్ మన్రో మద్రాసు గవర్నర్గా వచ్చినప్పుడు కంపెనీ ఉద్యోగులందరూ దేశభాషలలోనే ప్రావీణ్యం సంపాదించాలనీ, ప్రజల భాషలతోనే ప్రభుత్వ వ్యవహారాలు కొనసాగించాలనీ ఆదేశించారు.ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం ఇచ్చారు.వాస్తవానికి తెలుగునాట 19వ శతాబ్దం మధ్య భాగం వరకు తెలుగునే అధికారభాషగా వాడుతుండేవారు. పరిపాలనకు ముందు తెలుగునేలపై తెలుగే అధికారభాషగా ఉండేది. చరిత్రలోకి వెళితే వేంగి చాళుక్యులు, రేనాటి చోళులు, కాకతీయులు, వెలనాటి చోళులు, రెడ్డిరాజులు, రేచర్ల వెలమలు, విజయనగర రాజులు, గజపతులు, కుతుబ్షాహీసుల్తానులు, తమ పాలనా కాలాలలో ఈ తెలుగు గడ్డపైన తెలుగును ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆంగ్లేయులు ఆంధ్ర ప్రాంతంలో, నిజాం రాజులు తెలంగాణలో తెలుగుకు తగు ప్రాధాన్యం కల్పించారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగు అధికారభాష అయింది. తెలంగాణ విలీనం అనం



తరం 1956లో ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించింది. అప్పుడు తెలుగును అధికార భాషగా అమలు జరపాలని వావిలాల గోపాలకృష్ణయ్య ఇచ్చిన పిలుపు మేరకు 1956 సెప్టెంబర్ 29వ తేదీన కర్నూలులో శాసనసభ ఇందుకు అమోదించింది. తెలుగును అధికారభాషగా నిర్ణయిస్తూ ప్రభుత్వం 1966మే 14న అధికార భాషాచట్టాన్ని తీసుకొని వచ్చింది. అంటే అధికారభాషా చట్టం వచ్చి సరిగ్గా నేటికి అరవయ్యేళ్ళు అన్నమాట.అంతకు పూర్వమే 1946-47లో అంటే స్వాతంత్ర్యం రాకమునుపే తూర్పుగోదావరి జిల్లాలో, 1950-52లో తెలంగాణలోని తూర్పు ప్రాంతాలలో తెలుగును తాలూకా స్థాయిలో అధికారభాషగా అమలు చేయడానికి కొంత ప్రయత్నం జరిగింది. అప్పటికే దేశంలోని బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, మద్రాసు, హిమాచల్ ప్రదేశ్,గుజరాత్, మహారాష్ట్ర,సౌరాష్ట్ర, పంజాబ్, అస్సాం తదితర రాష్ట్రాలలో వారు తమ భాషలను అధికార భాషలుగా ప్రకటించుకొని శాసనాలు చేశారు. అధికారభాష అమలుపై కేరళ ప్రభుత్వం ఒక సంఘాన్ని కూడా నియమించింది. ఆంధ్రప్రదేశ్ 1964లో వావిలాల గోపాల కృష్ణయ్య ప్రతిపాదించిన అనధికార బిల్లును తొలుత ప్రజాభిప్రాయానికి, ఆ పైన సెలెక్ట్ కమిటీకి పంపారు.అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి, విద్యామంత్రి పి.వి.నరసింహారావు దానికి బదులుగా ప్రభుత్వ బిల్లు తీసుకొని వచ్చారు. దాన్ని శాసనసభ1966 మే 14న ఆమోదించింది. ఆనాటి నుంచి శాసనరీత్యా తెలుగు రాష్ట్రంలో తెలుగు అధికారభాష అయింది. 1973లో జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖలో ఒక ప్రత్యేకాధికారిని నియమించి, అధికారభాషగా తెలుగు అమలు కోసం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. అధికారభాషా శాఖను అప్పటి విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావుకు అప్పగించింది. 1967లో పి.వి. నరసింహారావు అధ్యక్షతన ఏర్పడిన సమీక్షా సంఘం 1971లో నివేదికను సమర్పిస్తే, 1974 మార్చి5వ తేదీన పైన తెలిపిన అధికారభాషా విభాగం ఏర్పడింది. 1974 మార్చి 19న ప్రభుత్వ ఉత్తర్వు నెం. 199 చట్టం 9వ విభాగం ద్వారా అధికార భాషా కమీషన్ ఏర్పడింది. వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షులుగా, మరో నలుగురు సభ్యులుగా ఈ కమీషన్ పని చేయడం ప్రారంభించింది. అన్ని శాఖలకు చెందిన తాలూకా, అంతకు కిందిస్థాయి కార్యాలయాల్లో శాసనేతరమైన అంశాలకు తెలుగువాడాలని, ఆంగ్లంవాడరాదని ప్రభుత్వం కచ్చితంగా చెప్పింది.1976లో ఒక అడుగు ముందుకు వేసి జిల్లాస్థాయి కార్యాలయాలకు దీన్ని విస్తరింపజేసింది. 1979లో శాఖాధిపతుల స్థాయి వరకు శాసనేతరమైన అంశాలకు తెలుగును వాడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 1983 నుంచి దీన్ని సచివాలయ స్థాయిలో ప్రవేశపెట్టారు. 1988 అక్టోబర్ 28న ప్రభుత్వం చట్టపరమైన ఒక ప్రకటనను వెలువరించింది. దాని ప్రకారం శాసనపరమైన అంశాలకూ తెలుగును వాడవలసిఉంటుంది. అదొక విప్లవాత్మకమైన నిర్ణయం. ప్రజల భాషలో పరిపాలన జరగడమన్నది ప్రజాస్వామ్య పటిష్టతకు, పరిణతికి అత్యంత ఆవశ్యకం. పరిపాలన ఎట్లా, ఏవిధంగా జరుగుతుందో, దాని ఫలితాలను అనుభవించే ప్రజలకు క్షుణ్ణంగా తెలియాలి. వారి ప్రమేయం లేని వారి శ్రద్ధాసక్తులతో మమేకం కాలేని ప్రభుత్వ పరిపాలన నిష్ప్రయోజనం. అధికార భాషా సంఘం పరిధి ప్రభుత్వ కార్యాలయాలలోని పాలనా వ్యవహారాలలో తెలుగు ఎంతవరకు అమలు అవుతోంది. అందుకు తీసుకోవలసిన చర్యలేమిటో ప్రభుత్వానికి సూచించడం వరకే. దానిపై ముందుకు వెళ్లడం ప్రభుత్వం చేయవలసిన పని, అక్కడ ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. అధికారభాషా సంఘం, తెలంగాణ సాహిత్య అకాడమీలకు కొత్త ప్రభుత్వం అధ్యక్షులను నియమించవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉదాసీనవైఖరి వల్ల తెలుగు భాషా సాహిత్యాల ఉనికి అడుగంటిపోయే ప్రమాదం ఉంది. ప్రజల మనోభావాలు గమనించినప్పుడే ప్రభుత్వాలు మనగలుగుతాయి. ప్రతీది ప్రజా ఉద్యమాలు భుజాన వేసుకోవు. భాషాసాంస్కృతిక సంపదను కాపాడుకోవలసిన కర్తవ్యం ప్రజలతోపాటు ప్రభుత్వానిది

# పేపర్ లీక్‌తో గందరగోళంలో విద్యార్థులు

బుగ్గన మధుసూదనరెడ్డి

పేపర్ లీక్ జరిగే అవకాశం లేకుండా సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి కూడా ఏదో రూపేణా ఈ లాలూచీలు సంభవిస్తూనే ఉండటం అత్యంత దురదృష్టకరం! ఈ పేపర్ లీక్ వ్యవహారం అనేది ఈ రోజుది కాదు. గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్‌తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న విషయం మనందరికీ విదితమే. ముఖ్యంగా పేపర్ లీక్ జరిగే అవకాశం ఏ మాత్రం జరుగని రీతిలో సాంకేతికంగా మనం ఎంతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నప్పటికి ఈ సమాజంలో లాలూచి పడే వ్యక్తులు ఏదో ఒక మూలాన ఉండటం వలన ఇప్పటికి ఏదో ఒక సందర్భంలో పబ్లిక్ పరీక్షల సమయాన ఏదేని సబ్జెక్టుకు సంబంధించి ఈ పేపర్ లీక్ ఉదంతం సంభవిస్తూ బాగా కష్టపడి చదివే విద్యార్థులు నోట్లో మట్టి కొట్టేలా ఈఅనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. ఇందుకు ప్రధాన కారణం ఈ సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్నవ్యక్తుల అండదండలతో దానికి సంబంధించిన శాఖలో పనిచేసే వ్యక్తులు డబ్బుకు ఆశపడి తిన్నింటి వాసాలు లెక్కబెట్టే రీతిలో వ్యవహరిస్తూ మన భారతదేశ విద్యా వ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టు పట్టించేలా వ్యవహరించే వారి తీరుతెన్నులు ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి ఓ సిగ్గుచేటైన,హేయమైన విషయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో సైతం నీట్ పరీక్షా పేపర్ లీక్ వ్యవహారం ఒకటి బయటకు రావడం ఒక పెను సంచలనానికి కారణభూతమైంది. కనీసం తరచుగా సంభవిస్తున్న ఈ చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అయిన విద్యాశాఖకు చెందినవారు గాని పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు వారిలో ఎవరైనా గాని లేక ఆయా శాఖకుచెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఇలాంటి అనారోగ్య,అనాగరిక రీతిలో ఒకవేళ కాసులకు కక్కుర్తి పడి మరీ ఈ పేపర్ లీక్ వ్యవహారంలో




పాలుపంచుకుంటే మాత్రం అంతకు మించిన పాపంవారికి మరొకటి ఉండదు.ఎందుకంటే పబ్లిక్ పరీక్షల సమయాన ఈ పేపర్ లీక్ ఉదంతాలు బయటకు పొక్కితే మాత్రం అనవసరంగా బాగా చదువుకునే విద్యార్థుల, సరస్వతి పుత్రుల ప్రిపరేషన్ పై అది తీవ్ర ప్రభావం చూపి వారి చదువు ఆటకెక్కే ప్రమాదం సైతం బాగా పొంచి ఉంటుంది.ఎలాగంటే బాగా డబ్బు, పలుకుబడి ఉండి విద్య సరిగా అబ్బని విద్యార్థుల కోసం ఇలాంటి చట్టవిరుద్ధమైన పేపర్ లీక్‌కు ఎవరైనా ఉపక్రమిస్తే ఎంతైనా అది బాగా చదువులో ముందుండే వేలాది మంది విద్యార్థుల మెడకు ఖచ్చితంగా ఒక ఉరికంభం,ఒక ఉరికొయ్యను బిగించడం క్రిందకు వస్తుంది తప్ప మరొకటి కాదు. ఏదిఏమైనా మన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆయా విద్యాశాఖమాత్యులు, ఆయా రంగానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే బోర్డు పెద్దలు ఈ పేపర్ లీక్ వ్యవహారం విషయంలో మరోసారి ఎంతమాత్రం తప్పు దొర్లకుండా చట్టరీత్యా అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన గురుతర బాధ్యత వారందరిపై ఎంతైనా వుంది.ఏమైనా తరచుగా సంభవిస్తున్న ఈ పేపర్ లీక్ వ్యవహారం మన భారతదేశ విద్యా వ్యవస్థకే ఒక మాయని మచ్చ వంటిది. ఒక విధంగా ఈ అనారోగ్య వాతావరణం పొడచూపడం అనేది మన విద్యావ్యవస్థ కీర్తి, ప్రతిష్టలకే ఖచ్చితంగామసక బార్చే వ్యవహారం ఈపేపర్ లీక్ ఉదంతం.ఇందులో ఎలాంటి సందేహానికి తావులేదు.అన్నింటికి మించి ముమ్ముందు రాబోయే అకాడమిక్ సంవత్సరం లోనైనా ఈ పదవ తరగతి,ఇంటర్మీడియట్, డిగ్రీపరీక్షలలో విద్యావ్యవస్థకు ఇలాంటి అప్రతిష్ట తెచ్చే ఈ పేపర్ లీక్ వ్యవహారం తలెత్తకుండా విద్యార్థుల భవిత అధోగతిపాలు కాకుండా చట్టరీత్యాచాలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర విద్యాశాఖ వారిపై,పబ్లిక్‌పరీక్షలు నిర్వహించే బోర్డు అధికారులపై ఎంతైనావుంది. రేపటి మన భారతదేశ అభివృద్ధిలో పాలు పంచుకోబోయేమన సరస్వతి పుత్రుల,జీవితాలు ఉజ్వలంగా మరో పదికాలాలపాటు దిగ్విజయంగా వర్ధిల్లాలి!

# రాబోయే కాలం విద్యుత్ వాహనాలదే!

డా. చిట్యాల రవీందర్

ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో వినిపిస్తున్న ఒకే ఒక నినాదం.. 'గో గ్రీన్' పెట్రోల్ బంకుల వద్ద పెరుగుతున్న క్యూలైన్లు, ఆకాశాన్ని తాకుతున్న చమురు ధరలు, వీటికి తోడు పర్యావరణ స్పృహ వెరసి సామాన్యుడి చూపు ఇప్పుడు 'ఎలక్ట్రిక్ వాహనం' వైపు మళ్లింది. నిన్నటి వరకు విలాసంగా చూసిన ఈవీలు, నేడు అవసరంగా మారి రోడ్లపై రయ్ రయ్ మంటూ దూసుకెళ్తున్నాయి. భారత ఈవీ మార్కెట్ ప్రస్తుత గణాంకాలు చూస్తే , భవిష్యత్తులో ప్రగతి పథంలో పయనం ఖాయం అనిపిస్తుంది. భారత దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం ఒక 'నిశ్శబ్ద విప్లవం'లా మొదలై, ఇప్పుడు సునామీలా మారుతోంది. 2025 నాటికి భారత్‌లో ఈవీ అమ్మకాలు 23 లక్షల మార్కును దాటడం ఒక చారిత్రాత్మక మైలురాయి. ద్విచక్ర వాహనాల హవా నడుస్తుంది. ఈవీ విప్లవంలోసింహభాగం టూవీలర్లదే. 2030 నాటికి దేశంలో అమ్ముడయ్యే ద్విచక్ర వాహనాల్లో 80 శాతం వాటా ఈవీలదే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే నిర్వహణ ఖర్చు కిలోమీటరుకు కేవలం 20నుండి 30 పైసలకే పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. 2023తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈవీ రిజిస్ట్రేషన్లు దాదాపు 40-50 శాతం వార్షిక వృద్ధిని కనబరిచాయి. కేవలం నగరాలకే పరిమితం కాకుండా, టైర్2, టైర్3 పట్టణాల్లో కూడా ఛార్జింగ్ పాయింట్లు వెలుస్తుండటంతో అమ్మకాలు పుంజుకున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కొత్తగా వస్తున్న పీఎం వంటి పథకాలు తయారీదారులకు, కొనుగోలుదారులకు భారీ సబ్సిడీలను అందిస్తున్నాయి. దీనివల్ల పెట్రోల్ వాహనాలకు, ఈవీలకు మధ్యఉన్న ధర వ్యత్యాసం క్రమంగా తగ్గుతోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఈవీ రంగం వైపు దేశాలు పరుగులు పెట్టేలా చేస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్ వివాదం, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలుఅస్థిరంగా మారుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద దెబ్బ. ఈ 'ఎనర్జీ సెక్యూరిటీ' ముప్పు నుంచి బయటపడాలంటే విద్యుత్ వాహనాలే ఏకైక ప్రత్యామ్నాయం. 2070 నాటికి కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించాలన్న భారత్ లక్ష్యానికి ఈవీలు వెన్నెముకగా నిలుస్తున్నాయి. యూరప్, చైనా దేశాలు ఇప్పటికే పెట్రోల్/డీజిల్ వాహనాల అమ్మకాలను నిలిపివేసే గడువులను ప్రకటించాయి. ప్రపంచవ్యాప్తంగా లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి పెరగడంతో, గత దశాబ్ద కాలంలో బ్యాటరీ ధరలు దాదాపు 85 తగ్గాయి. ఇది వాహన ధరలను తగ్గించడంలో కీలక పాత్ర



పోషిస్తోంది. అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పటికీ, ఈ రంగాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్య 'ఛార్జింగ్ స్టేషన్ల కొరత'. బ్యాటరీ ఎక్కడ అయిపోతుందో అన్న భయం వినియోగదారులను ఇంకా వెంటాడుతోంది. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం, ప్రతి 2030 వాహనాలకు ఒక పబ్లిక్ ఛార్జింగ్ పాయింట్ కూడా అందుబాటులో లేదు. పెట్రోల్ కొట్టించడానికి పట్టే 2 నిమిషాలతో పోలిస్తే, ఈవీ ఛార్జింగ్‌కు పట్టే సమయం (30 నిమిషాల నుండి 4 గంటల వరకు)ఇంకా ఎక్కువే. దీనిని అధిగమించడానికి 'బ్యాటరీ స్వాపింగ్' విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. లక్షలాది వాహనాలు ఒకేసారి ఛార్జింగ్ పెట్టినప్పుడు విద్యుత్ గ్రిడ్‌పై పడే భారాన్ని తట్టుకునేలా మన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సి ఉంది. భవిష్యత్తు ఎలా ఉండబోతోంది అనే ప్రశ్నకు సమాధానంగా రాబోయే ఐదేళ్లలో ఈవీ రంగం ఊహించని మార్పులకు లోనవుతుంది. కొన్ని దిగ్గజాలు బ్యాటరీ తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తే, రూ. 5లక్షల నుండి 8లక్షల లోపే నాణ్యమైన ఈవీ కార్లు వచ్చేఅవకాశం ఉంది. కేవలం ఎలక్ట్రిక్ మాత్రమే కాకుండా, భారీ ట్రక్కులు మరియు బస్సుల కోసం 'గ్రీన్ హైడ్రోజన్' ఇంధనం కూడా తోడవుతుంది. కిరాణా షాపుల వద్ద, పెట్రోల్ బంకుల్లో, అపార్ట్‌మెంట్ పార్కింగ్‌లలో విరివిగా 'ఫాస్ట్ ఛార్జర్లు' అందుబాటులోకి వస్తాయి. పెట్రోల్ ధరల సెగ నుంచి తప్పించుకోవాలన్నా, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నా మనం ఈవీ బాట పట్టక తప్పదు. సవాళ్లను అధిగమిస్తూ, సాంకేతికతను అందిపుచ్చుకుంటే.. 2030 నాటికి భారత వీధులన్నీ శబ్దం లేని, కాలుష్యం లేని 'విద్యుత్ వాహనాల'తో కళకళలాడటం ఖాయం! బ్యాటరీ రీసైక్లింగ్ స్టార్టప్‌లు మన దేశంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి. ఒక ఈవీ వాహనం తన జీవిత కాలంలో సాధారణ పెట్రోల్ వాహనం కంటే 50 శాతం తక్కువ కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. ప్రస్తుత తరుణంలో ఈవీ (ఎలక్ట్రిక్ వాహనం) కేవలం ఒక ప్రత్యామ్నాయం మాత్రమే కాదు, అది కాలం తెచ్చిన అనివార్యమైన ఆవశ్యకత. అస్థిరమైన అంతర్జాతీయ రాజకీయాలు, నిరంతరం మండుతున్న ఇంధన ధరల మధ్య సామాన్యుడి జేబుకు చిల్లు పడకుండా ఉండాలంటే విద్యుత్ వాహనమే శరణ్యం. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచిచూసే అవసరం లేకుండా, ఇంట్లోనే స్మార్ట్‌ఫోన్ లాగా వాహనాన్ని ఛార్జ్ చేసుకునే సౌలభ్యం ఒక గొప్ప విముక్తిని ఇస్తుంది. భావోద్వేగ పరంగా చూస్తే, మనం మన తరువాతి తరానికి స్వచ్ఛమైన గాలిని, కాలుష్య రహిత వాతావరణాన్ని కానుకగా ఇవ్వాలి. ఈవీ వాహనం నడుపుతున్నప్పుడు వచ్చే ఆ నిశ్శబ్దం, మనం పర్యావరణానికి చేస్తున్న మేలును గుర్తు చేస్తూ ఒక రకమైన మానసిక తృప్తిని ఇస్తుంది. సాంకేతికంగా చూసినా, తక్కువ కదిలే భాగాలు ఉండటంవల్ల మెయింటెనెన్స్ ఖర్చు దాదాపు శూన్యం. మౌలిక సదుపాయాలు ఛార్జింగ్ స్టేషన్లు వేగంగా విస్తరిస్తున్న నేటి పరిస్థితుల్లో, తెలివైన బాధ్యతాయుతమైన పౌరుడిగా ఈవీని ఎంచుకోవడమే అన్ని విధాలా మేలైన నిర్ణయం. రాబోయే కాలం విద్యుత్ వాహనాలదే, అందుకే ఈవీయే మేటి!

# పొదుపు ఎఫెక్ట్: ప్రధాని కాన్వాయ్ కుదింపు

## హోంమంత్రి అమిత్‌షా, రాజ్‌నాథ్ మరికొందరు మంత్రులకు కూడా తగ్గింపు

## కాన్వాయ్‌లు తగ్గించిన బిజెపి రాష్ట్రాల సిఎంలు



**న్యూఢిల్లీ, మే 13:** ప్రధాని నరేంద్ర మోడీ పొదుపు, ఇంధన పరిరక్షణ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టారు. తన భద్రతా బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)ను ఉద్దేశించి, కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యను పెంచాలని, దీనికోసం కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని స్పష్టంగా సూచించారు. భద్రతా ప్రమాణాలైన బ్లూ బుక్ మార్గదర్శకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఎస్పీజీ ఈ ఆదేశాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రధాని నిర్ణయంతో పలువురు కీలక శాఖల కేంద్ర మంత్రుల వాహన కాన్వాయ్‌ను కూడా తగ్గించారు. హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్, హర్‌దీప్‌సింగ్‌పూరీ వంటి మంత్రులు తమతమ కాన్వాయ్‌లను తగ్గించుకుఉంటున్నట్లు ప్రకటించారు.

ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం స్ఫూర్తితో బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వంటి వారు కూడా తమ అధికారిక కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని నిర్ణయించారు. ఇది దేశవ్యాప్తంగా పరిపాలనలో పొదుపును ప్రోత్సహించే విస్తృత ప్రయత్నాలలో భాగంగా కనిపిస్తోంది. ప్రభుత్వ స్థాయిలో పొదుపు చర్యలు చేపడుతూనే, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. అమెరికాఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన ముడి చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రతిదానికీ దిగుమతులపై ఆధారపడితే దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నిస్తూ, స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు తమ జీవనశైలిలో బాధ్యతాయుతమైన మార్పులు చేసుకోవాలని ప్రధాని సూచించారు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం కూడా దేశభక్తితో సమానమని చెబుతూ, ప్రజలు ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లు, విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వంటివి వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను దేశంలోనే జరుపుకోవాలని ఆయన కోరారు.

## సైకిల్‌పై వచ్చిన జిఎస్టీ అధికారి



**న్యూఢిల్లీ, మే 13:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి దేశానికి సహకరించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో సానుకూల ప్రభావం చూపుతోంది. ఈ పిలుపుతో స్ఫూర్తిపొందిన జిఎస్టీశాఖ డిప్యూటీకమిషనర్ నరేంద్ర యాదవ్, తన విలాసవంతమైన కారును పక్కనపెట్టి ఆఫీసుకు సైకిల్‌పై వెళ్లడంప్రారంభించారు. ప్రస్తుతం దేశం అంతర్జాతీయంగా పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో ప్రతి పౌరుడూ దేశ హితం కోసం ప్రయత్నంచేయడం బాధ్యత అని నరేంద్రయాదవ్ పేర్కొన్నారు. సైకిల్ కేవలం పర్యావరణహితమైన ప్రయాణ సాధనం మాత్రమేకాదు, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ఉత్తమమైనది. ఇంధనాన్ని పొదుపు చేయాలన్న ప్రధాని పిలుపును దృష్టిలో ఉంచుకుని, నాకు సైకిల్ ఉత్తమమైన మార్గంగా అనిపించిందని ఆయన అన్నారు.

# నందిగ్రామ్ సీటుకు సిఎం సువేందు గుడ్‌బై

## భవానీపూర్‌లో కొనసాగనున్న ముఖ్యమంత్రి



**కోల్‌కతా, మే 13:** పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారి, భవానీపూర్ సీటును నిలుపుకున్నారు. నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. బుధవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో భవానీపూర్ ఎమ్మెల్యేగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నందిగ్రామ్ సీటును వదులుకున్నట్లు చెప్పారు. నందిగ్రామ్ నుంచి (ఉప ఎన్నిక ద్వారా) మరొకరు ఎమ్మెల్యేగా ఎన్నికవుతారు. అయితే రాబోయే ఐదేళ్లలో అక్కడి ప్రజలు నా లేమిని ఏమాత్రం అనుభవించనివ్వను. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో పాటు, నందిగ్రామ్ ప్రజలకు నేను ఇచ్చిన అభివృద్ధి వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తా అని అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి రెండు స్థానాల్లో పోటీ చేశారు. భవానీపూర్, నందిగ్రామ్ నియోజక వర్గాల్లో ఆయన గెలిచారు. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకి కంచుకోట అయిన భవానీపూర్ స్థానంలో 15,105 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు సొంత నియోజకవర్గమైన నందిగ్రామ్‌లో ప్రత్యర్థి టిఎంసి అభ్యర్థిని పవిత్ర కర్‌పై 9,665 ఓట్ల ఆధిక్యంతో సువేందు అధికారి గెలిచారు. తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు. అయితే భవానీపూర్ స్థానాన్ని నిలుపుకున్న సిఎం సువేందు అధికారి, సొంత నియోజకవర్గమైన నందిగ్రామ్‌కు రాజీనామా చేశారు.




## అమెరికా 51వ రాష్ట్రంగా వెనిజులా

## ట్రంప్ వివాదాస్పద ట్రూత్‌పోస్ట్

**వాషింగ్టన్, మే 13:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్ ట్రుత్ సోషల్‌లో వివాదాస్పద పోస్టు చేశారు. వెనిజులా దేశాన్ని 51వ అమెరికా రాష్ట్రంగా చూపిస్తూ ఓ పోస్టు చేశారు. ఇక విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో ఈ ఫోటోను కూడా షేర్ చేశారు. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మాదురోను నిర్బంధించిన సమయంలో ఆయన నైక్ ట్రాక్ సూట్ వేసుకున్నారు. అయితే అలాంటి ట్రాక్ సూట్ వేసుకున్న మార్కో రూబియో ఫోటోను కూడా ట్రంప్ షేర్ చేశారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో రూబియో ప్రయాణిస్తున్నట్లు పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యేందుకు ట్రంప్ చైనా టూరు వెళ్తున్నారు. అయితే వెళ్లేముందు ఆయన ఈ పోస్టు చేశారు. వైట్‌హౌజ్ కూడా ఈ ఫోటోలను తన ఎక్స్ అకౌంట్‌లో రిలీజ్ చేసింది.

వెనిజులాను కొత్త రాష్ట్రంగా పరిగణించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఫాక్స్ న్యూస్‌తో ట్రంప్ పేర్కొన్నారు. మిలిటరీ ఆపరేషన్ ద్వారా కారకాస్ నుంచి మాదురోను అమెరికా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. వెనిజులాపై ట్రంప్ చేసిన పోస్టును ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తప్పుపట్టారు. ఆ ఐడియాను తీవ్రంగా వ్యతిరేకించారు. అమెరికాకు 51వ రాష్ట్రంగా వెనిజులా ఉండబోదన్నారు.

# జ్యోతిష్కుడు రాధన్ నియామకం రద్దుచేసిన సిఎం విజయ్

**చెన్నై, మే 13:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తొలిరోజే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. బుధవారం ఉదయం విశ్వాస పరీక్షలోనెగ్గిన వెంటనే, రాధన్ పండిట్ వెట్రివేల్ అనే జ్యోతిష్కుడిని ముఖ్యమంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (పొలిటికల్)గా నియమించడం పెను దుమారం రేపింది. మిత్రపక్షాలు, ప్రతిపక్షాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో ప్రభుత్వం కొన్ని గంటల్లోనే ఆ నియామకాన్ని వెనక్కి తీసుకుంది. విశ్వాస పరీక్ష సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడిన డీఎండీకే చీఫ్ ప్రేమలత విజయకాంత్, ఈ నియామకాన్ని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి ఓఎస్డీగా ఒక జ్యోతిష్కుడిని నియమించడాన్ని నేను ఖండిస్తున్నాను. దీని ద్వారా యువతకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ఆయన మీ వ్యక్తిగత జ్యోతిష్కుడైతే, వ్యక్తిగతంగానే ఉంచుకోవాలి అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మద్దతిస్తున్న కీలక మిత్రపక్షాలైన విడుతలై చిరుతైగల్ కట్చి (విసికె), కాంగ్రెస్ కూడా ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది ఒక లౌకిక ప్రభుత్వంలో ఆమోదయోగ్యం కాదు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రభుత్వ కర్తవ్యమని విసికె ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్ పేర్కొంటూ, వెంటనే అతడిని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ కూడా ఒక జ్యోతిష్కుడికి ఓఎస్డీ పదవి ఎందుకు అవసరమని ప్రశ్నించారు. విమర్శలు వెల్లువెత్తడంతో టివికె నేత సిటి నిర్మల్ కుమార్ తొలుత ఈ నియామకాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. వెట్రివేల్‌ను మీడియా ప్రతినిధిగా నియమించామని, ఆయన వృత్తితో సంబంధం లేదని తెలిపారు. ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆసక్తికరంగా ఈ విషయంలో బిజెపి విజయ్‌కు అనుకూలంగా స్పందించింది. రాధన్ పండిట్ వెట్రివేల్‌కు గతంలోనూ రాజకీయ ప్రముఖులతో సంబంధాలున్నాయి.

దివంగత ముఖ్యమంత్రి జయలలితకు కూడా ఆయన సలహాదారుగా వ్యవహరించినట్లు సమాచారం. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు వెళ్లరని వెట్రివేల్ చెప్పిన జోస్యం విఫలం కావడంతో వారి మధ్య విభేదాలు వచ్చినట్లు కథనాలొచ్చాయి. ఏదేమైనా, మిత్రపక్షాల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి కారణంగా, విజయ్ సర్కార్ వివాదాస్పద నియామకాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది.



## మా ఎమ్మెల్యేలకు విజయ్ సొమ్ములు ఆఫర్‌చేసారు పళనిసామి ధ్వజం

**చెన్నై, మే 13:** తమిళనాడు శాసనసభలో బుధవారం జరిగిన విశ్వాస పరీక్షలో విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. కేవలం 22 మంది మాత్రమే వ్యతిరేకించారు. టివికె ప్రభుత్వానికి కాంగ్రెస్, విసికె, ఐయూఎంఎల్ వంటి పార్టీలు తమ మద్దతును ప్రకటించాయి. అన్నాడీఎంకే నుంచి తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలు విజయ్‌కు అండగా నిలవడంతో ప్రభుత్వం సుస్థిరమైంది. బలపరీక్షకు ముందు డిఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. మరోవైపు, బలపరీక్షకు ముందు సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి మాట్లాడుతూ విజయ్ తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టారని, డబ్బు ఆఫర్ చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను విజయ్ కలవడాన్ని ఆయన తప్పుబట్టారు. తమ పార్టీ ఐక్యంగానే ఉందని ఆయన నమ్మబలికే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం మరోలా వచ్చింది. పళనిస్వామి వ్యాఖ్యలను రెబల్ నేత వేలుమణి తీవ్రంగా ఖండించారు. తామంతా స్వచ్ఛందంగానే విజయ్‌కు మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేస్తూ, పళనిస్వామి నాయకత్వంపై తమకు నమ్మకం లేదని పరోక్షంగా తేల్చిచెప్పారు. తమకు మంత్రి పదవులు అవసరం లేదని స్పష్టంచేశారు.

## ఐఆర్జీసి ఆర్థికమూలాలు చెపితే రూ.145 కోట్లు బహుమతి

**వాషింగ్టన్, మే 13:** ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆర్థిక మూలాల గురించి సమాచారం ఇచ్చిన వారికి 15 మిలియన్ డాలర్ల బహుమతిని ఇస్తామని అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఇది మన కరెన్సీలో సుమారు రూ.145 కోట్లు ఉంటుంది. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా, ఇరాన్ తీసుకుంటున్న చర్యల్లో పురోగతి కనిపించడంలేదు. యుద్ధాన్ని ముగించడానికి వాషింగ్టన్ చేసిన ప్రతిపాదనలను టెహ్రాన్ అంగీకరించలేదు. దీంతో ఒప్పందం ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ భారీ ఆఫర్ ఇచ్చింది. ఐఆర్‌జిసి, దాని సంబంధిత శాఖలకు కీలక ఆర్థిక వనరులను అందించే బినామీ కంపెనీలు, వ్యక్తులు, ఆర్థిక సంస్థల సమాచారాన్ని తమకు తెలియజేయాలని కోరింది. గల్ఫ్ దేశాలపై దాడులు చేయకుండా, అణు కార్యక్రమాలు చేపట్టకుండా ఇరాన్‌ను దెబ్బతీయడమే లక్ష్యమని స్పష్టం చేసింది. మరోవైపు, యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైన ప్రతి అవకాశాన్ని తాము వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఏ విధమైన దురాక్రమణకైనా తగిన గుణపాఠం చెప్పేందుకు తమ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

# తమిళనాడుకు రీల్ సర్కార్‌కాదు రియల్ సర్కార్ కావాలి

## బలపరీక్ష తర్వాత అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ధ్వజం



**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంగా అధికార టివికె, ప్రతిపక్ష డిఎంకె మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఉదయనిధి స్టాలిన్‌చేసిన రీల్ వర్సెస్ రియల్ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని డిఎంకె శాసన సభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ విమర్శనాస్త్రాలు సంధించారు. తమిళనాడుకు కావాల్సింది రియల్ ప్రభుత్వమే కాని, సినిమాల్లో కనిపించే రీల్ ప్రభుత్వం కాదని, విజయ్ పార్టీని రాష్ట్రంలోని 65 శాతం మంది ఓటర్లు తిరస్కరించారని, టివికెపై ప్రజలకు విశ్వాసం లేదనే విషయం ఎన్నికల్లోనే తేలిపోయిందని అన్నారు. టివికెకు మ్యాజిక్ ఫిగర్ కూడా రాలేదని గుర్తుచేశారు. తప్పుడు హామీలతో విజయ్ ఎన్నికల్లో గెలిచారని, ఆయన ఇచ్చిన ఎన్నికల హామీలపై ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. విజయ్‌కు ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు. పుష్ప సినిమా స్టైల్లో విజయ్ పాలన సాగుతోందని విమర్శించారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడి రాష్ట్రప్రతిష్టను విజయ్ దిగజార్చారని తీవ్రవ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను టివికె ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. విజయ్ ప్రభుత్వం అనైతికమార్గాల్లో మద్దతు కూడగట్టుకుందని ఆరోపిస్తూ, బలపరీక్ష ఓటింగ్‌ను డిఎంకె బహిష్కరించింది. ఉదయనిధి నేతృత్వంలో డిఎంకె ఎమ్మెల్యేలందరూ సభనుంచి వాకౌట్ చేశారు. అయితే, డీఎంకె వాకౌట్ చేసినప్పటికీ, 144 మంది ఎమ్మెల్యేల మద్దతుతో విజయ్ తన బలాన్ని నిరూపించుకోవడంలో విజయం సాధించారు.

## షణ్ముగం వర్గాన్ని పార్టీ పదవులనుంచి తొలగించిన పళనిసామి

### రెబెల్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ ఇపిఎస్ వర్గం ఫిర్యాదు!



**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో టివికె విజయ్ బలపరీక్షకు ముందురోజు జారీచేసిన పార్టీ విప్‌ను ధిక్కరించి టివికె విజయ్ సర్కారుకు మద్దతుపలికిన 24 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా వేటు వేయాలనికోరుతూ పళనిస్వామి వర్గం పట్టుబడుతోంది. పార్టీ ఫిరాయింపులనిరోధక చట్టం అనుసరించి వీరిపైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. అంతేకాకుండా వీరి అనర్హతవేటు వర్తింప చేయాలని స్పీకర్‌కు దరఖాస్తుకూడా చేసింది. విజయ్‌పార్టీకి 105 మంది ఎమ్మెల్యేల మద్దతు రాగా కాంగ్రెస్; సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ వంటి వాటితో 119 వరకూ చేరింది. అంతేకాకుండా పళనిస్వామిని వ్యతిరేకించిన షణ్ముగం నేతృత్వంలో 24మంది ఎమ్మెల్యేలు టివికెకు బాహాటంగానే మద్దతు పలికిన సంగతి తెలిసిందే. విప్‌ను 25మంది సభ్యులు ధిక్కరించారు. అందువల్లనే వారిని అనర్హులుగా ప్రకటించాలని తాము కోరుతున్నట్లు ఎఐఎడిఎంకెప్రకటించింది. పార్టీతరపున ఒక ఫిర్యాదును కూడా దాఖలుచేసారు. సివి షణ్ముగం, ఎస్పీ వేలుమణి, సి విజయ్‌భాస్కర్ ఇతరులను పార్టీ పదవులనుంచి కూడా తొలగించింది. ఎలాంటి విప్‌ను నియమించలేదని, అందువల్ల విప్‌ను ధిక్కరించారన్న వాదన ఉత్పన్నం కాదని రెబెల్ వర్గం చెపుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి విప్‌ను నియమించలేరని కొత్తగా ఎన్నికైన సభ్యులతో సమావేశం ఏర్పాటుచేయాలని, పార్టీ లెజిస్లేచర్ నాయకుడు, డిప్యూటీలను,విప్‌లను ఎన్నుకుంటారని అన్నారు. అయితే ఇపిఎస్ విప్‌ను నియమించినట్లు చెప్పడం వాస్తవంకాదని ఆయన నియమించే అధికారంలేదన్నారు. పళనిస్వామి అగ్రి కృష్ణమూర్తిని విప్‌గా నియమించారు. ఆయన్ను స్పీకర్ కూడా గుర్తించారని ఇపిఎస్ వర్గం చెపుతోంది. ప్రస్తుతంపార్టీ లెజిస్లేచర్ నేత నియామకంపై రెండు వర్గాలు కూడా స్పీకర్‌కు లేఖలు రాసుకున్నాయి. వీటిని పరిశీలించి స్పీకర్ చర్యలుచేపట్టాల్సి ఉంది.

## బలపరీక్ష వేళ రెండుగా చీలిన అన్నాడిఎంకె

**చెన్నై, మే 13:** తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ విశ్వాస పరీక్ష వేళ అన్నాడీఎంకే పార్టీ రెండుగా చీలింది. తన మెజారిటీ నిరూపించుకునేందుకు ఇవాళ సిఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా అన్ని పార్టీలు ప్రసంగం చేశాయి. అయితే అన్నాడీఎంకే తన నిర్ణయాన్ని ప్రకటిస్తున్న సమయంలో సభలో గందరగోళం నెలకొన్నది. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎడప్పాడి కే పళనిస్వామి విశ్వాస పరీక్షను వ్యతిరేకించారు. సిఎం విజయ్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ ఉందని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 47మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పళనిస్వామి చెప్పారు. రెబల్ వర్గానికి చెందిన అన్నాడిఎంకె ఎమ్మెల్యేలను సీఎం కలవడం ఎంత వరకు న్యాయమైందని ఆయన ప్రశ్నించారు. పళనిస్వామి స్టేట్మెంట్‌తో సభలో అరుపులు మొదలయ్యాయి. ఈ దశలో స్పీకర్ ప్రభాకర్ జోక్యం చేసుకున్నారు. బలపరీక్షపై అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఎస్పీ వేలుమణిని మాట్లాడమని కోరారు. కొందరు అన్నాడీఎంకే అభ్యర్థులు దీన్ని వ్యతిరేకించారు. అయితే ఏ సభ్యుడితోనైనా మాట్లాడించే అధికారం తనకు ఉందని స్పీకర్ తెలిపారు. తీవ్ర వ్యతిరేకత మధ్య వేలుమణి ప్రసంగించారు. ఆయన టివికెకు తన మద్దతును ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు విజయ్‌కు ఓటు వేశారని, అందుకే అన్నాడీఎంకే బలపరీక్షకు మద్దతు ప్రకటిస్తోందని వేలుమణి అన్నారు. ఇక డీఎంకే పార్టీ వాకౌట్ చేసింది. తీర్మానంపై ప్రతిపక్ష నేత , డీఎంకే పార్టీ ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను సీఎం విజయ్ కలవడాన్ని ఆయన తప్పుపట్టారు. ఛేంజ్ జరుగుతోందా, ఎక్స్‌చేంజ్ జరుగుతోందా అని ఉదయనిధి ప్రశ్నించారు.

# సంక్షిప్తంగా..

## నిదాఖాన్‌కు ఆశ్రయమిచ్చిన కార్పొరేటర్ ఇల్లు కూల్చివేత

**నాసిక్, మే 13:** మహారాష్ట్రలోని నాసిక్ టిసిఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, బలవంతపు మతమార్పిళ్ల కేసులో ప్రధాన నిందితురాలు నిదాఖాన్‌కు ఆశ్రయమిచ్చిన మజ్లిస్ కార్పొరేటర్ మతిన్ పటేల్ ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేశారు. కార్పొరేటర్ తన ఇంటిని, కార్యాలయాన్ని అక్రమంగా నిర్మించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వివరణ కావాలని మున్సిపల్ కార్పొరేషన్ నోటీసు ఇచ్చింది. అయితే ఈ నిర్మాణాలపై తాను సమాధానం ఇవ్వడానికి కొంత సమయం కావాలని కోరుతూ మతిన్ పటేల్ పిటిషన్ దాఖలు చేయగా, స్థానిక కోర్టు తిరస్కరించింది. దీంతో ఛత్రపతి శంభాజీ నగర్ (ఔరంగాబాద్) మున్సిపల్ కార్పొరేషన్ బుధవారం ఆయన ఇంటిని, కార్యాలయాన్ని కూల్చివేసింది. తన ఇంట్లో నిదాఖాన్‌కు ఆశ్రయమివ్వడంతో మతిన్ పటేల్ అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వచ్చాయి.

## బెంగాల్ సిఎం సువేందు పిఎ హత్యకు రూ.కోటి సుపారీ!



**కోల్‌కత్తా, మే 13:** పశ్చిమ బెంగాల్ సిఎం సువేందు అధికారి సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్యకేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది సాధారణ హత్య కాదని, రూ. కోటికి పైగా ఖర్చు చేసి పక్కా ప్రణాళికతో అమలు చేసిన సుపారీహత్య అని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అనుమానిస్తోంది. ఈహత్యలో అంతర్రాష్ట్ర ముఠాలు, నకిలీ వాహ నాలు, అత్యాధునిక ఆయుధాలు వాడినట్లు దర్యాప్తులో తేలింది. సిబిఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి నార్త్ 24 పరగణాల జిల్లాలోని మధ్యమ్‌గ్రామ్‌లో హత్య జరిగిన ప్రదేశాన్ని మరోసారి పరిశీలించింది. సిబిఐ డిఐజి పంకజ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని బృందం, హత్య జరిగిన తీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. మే 6వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలువచ్చిన రెండురోజులకే చంద్రనాథ్ రథ్‌ను ఆయన ఎస్‌యూవీలోనే కాల్చి చంపారు. ఈ ఆపరేషన్‌కు రూ.కోటికి పైగా ఖర్చయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## దురంధర్‌కు దీటుగా వచ్చిన మేరా ల్యారీ ఘోరంగా విఫలం




**కరాచి, మే 13:** భారత సినిమాకు దీటుగా సమాధానం చెప్పాలనే లక్ష్యంతో పాకిస్థాన్‌లో రూపొందించిన ఓ చిత్రం బాక్సాఫీస్‌వద్ద ఘోరంగా విఫలమైంది. ఆదిత్యధర్ దర్శకత్వం లోని భారతచిత్రం దురంధర్‌కు ప్రతిస్పందనగా వచ్చిన మేరా ల్యారీ అనే ఈసినిమాకు ప్రేక్షకులనుంచి కనీస ఆదరణ కూడా లభించలేదు. కొన్నిథియేటర్లలో కేవలం 22 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయని, దీంతో షోలను రద్దు చేసి సినిమాను ప్రదర్శనల నుంచి తొలగించారని పాక్ నుంచే కథనాలు వస్తున్నాయి. కరాచీలోని ల్యారీ ప్రాంతాన్ని ఉగ్రవాద కార్యకలాపాలతో ముడిపెట్టి భారత చిత్రం దురంధర్‌లో చూపించారని, దానికి భిన్నంగా ఆ ప్రాంత సానుకూల కోణాన్ని, ముఖ్యంగా మహిళల ఫుట్‌బాల్ క్రీడను ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో మేరా ల్యారీని తెరకెక్కించారు. ఈ నెల 8న విడుదలైన ఈ సినిమా మొదటిరోజే తేలిపోయింది.

## గురుగ్రామ్ ఆసుపత్రిలో సోనియాకు రొటీన్ చెకప్

**న్యూఢిల్లీ, మే 13:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఇవాళ అస్వస్థతకు గురయ్యారంటూ వచ్చినవార్తలపై ఆ పార్టీ స్పష్టతఇచ్చింది. ఆమె గురుగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ వైద్య పరీక్షలు (రొటీన్ చెకప్) చేయించుకున్నారని, అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారని తెలిపింది. ఆమెకు చిన్నపాటి శస్త్రచికిత్స జరిగిందంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సోనియా రొటీన్ మెడికల్ చెకప్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆమె ఇంటికి తిరిగి వచ్చారని క్లుప్తంగా తెలిపారు.

## కన్నడ నటుడు, నిర్మాత దిలీప్‌రాజ్ హఠాన్మరణం



**బెంగళూరు, మే 13:** కన్నడ చిత్ర పరిశ్రమలో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన ఆకస్మిక మృతితో శాండల్‌వుడ్ శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం దిలీప్ రాజ్‌కు తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయనను బతికించలేకపోయామని వైద్యులు ప్రకటించారు. పునీత్ రాజ్‌కుమార్‌తో కలిసి నటించిన మిలనా(2007) చిత్రంతో దిలీప్ రాజ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

14-5Pg6exHMNWJQE.qxd:14-5Pg6exHMNWJQE.qxd 1/1/02 7:04 AM Page 1



# సిఎఫ్ఎంఎస్‌లో సాంకేతిక లోపం.. నిలిచిన ఆర్థిక సేవలు

## రిజిస్ట్రేషన్లకు తీవ్ర అంతరాయం.. ఇబ్బంది పడిన కక్షిదారులు

**విజయవాడ, మే 13 (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సి.ఎఫ్.ఎం.ఎస్.) వెబ్ సైట్ లో బుధవారం ఉదయం ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. ఉదయం 10 గంటల నుంచే సి.ఎఫ్.ఎం.ఎస్. సర్వర్ లో లోపం ఏర్పడింది. ఫలితంగా వెబ్ సైట్ పని చేయడం ఆగిపోయింది.సాయంత్రం వరకూ కూడా పునరుద్ధరణ జరగలేదు. దీంతోఅన్ని రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోనూ ఆర్థిక సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చలానాలు, వాణిజ్యశాఖ, రవాణా శాఖ చలానాలు నిలిచి పోవడంతో ఆయా శాఖల సేవలు నిలిచిపోయాయి. ఆన్ లైన్ చలానా వ్యవస్థ పని చేయక, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో కక్షి దారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. రవాణా శాఖలోనూ చలానాలు చెల్లించడానికి వీలు కాకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్ళే ప్రయా ణీకుల వాహనాలు నిలిచిపోయాయి. గతంలో మాన్యువల్‌లో ఉన్న చలానాల చెల్లింపు ప్రక్రియను పూర్తిగా ఆన్ లైన్ చేయడంతో నిత్యం దాదాపు 600 కోట్ల రూపాయల మేర దాదాపు 8 నుంచి 10 వేల లావాదేవీలు ఈ సి.ఎఫ్. ఎం.ఎస్ ద్వారా జరుగుతున్నాయి. బుధవారం ఏర్పడిన ఈ అంతరాయం మధ్యాహ్నం వేళ కొద్ది సేపు పని చేసినా తర్వాత మళ్ళీ పూర్తిగా నిలిచి పోయింది. ప్రభుత్వ నిధుల నిర్వహణ కోసం రియల్ టైమ్ సిస్టమ్, ప్రక్రియలను ఆటోమేట్ చేసి సి.ఎఫ్.ఎం.ఎస్. నిధుల నిర్వహణను చేపడుతుంది. బడ్జెట్ తయారీ, నిధుల విడుదల, డి.డి.ఒ.లకు పంపిణీ, డి.డి.ఒ.ల ద్వారా బిల్లుల తయారీ, సమర్పణ, ట్రెజరీల ద్వారా బిల్లుల ప్రాసెసింగ్, చెల్లింపు ప్రక్రియలు, ఖాతాల తయారీ, ప్రజలు వివిధ పద్దుల కింద నేరుగా ప్రభుత్వశాఖలకు చెల్లించే చలానాలు, ఎలక్ట్రానిక్ డేటా నిర్వహణ మొదలైనవి సి.ఎఫ్.ఎం.ఎస్. చేస్తుంది. రాష్ట్రంలో 249 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన లావాదేవీలు, చలానాలు సి.ఎఫ్.ఎం.ఎస్. ద్వారానే నిర్వహిస్తుండగా వీటిలో ప్రధానమైనవి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లించే చలానాలు, వాణిజ్య పన్నుల శాఖ, రవాణా శాఖలకు చెల్లించే చలానాలు. ఇవిఇప్పుడు పూర్తిగా సి.ఎఫ్.ఎం.ఎస్ ద్వారానే నిర్వహిస్తున్నారు. గతంలో బ్యాంకులలో చెల్లించే సాధారణ వసూళ్ళ పద్ధతిని పూర్తిగా నిలిపివేశారు. చలానా జనరేట్ చేయడం, బ్యాంకులలో నగదు చెల్లించడం లేదా ఆన్ లైన్ చెల్లింపులు అంతా సి.ఎఫ్.ఎం.ఎస్ ద్వారానే జరుగుతుంది. సి.ఎఫ్.ఎం.ఎస్ వెబ్ సైట్ నిలిచిపోవడం ఇటీవలి కాలంలో తరచూ జరుగుతోంది. గతంలో ఉన్న ఇబ్బందులను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చాలా వరకు పరిష్కరించినప్పటికీ వెబ్ సైట్ తరచూ నిలిచిపోతూ ఉండటంతో ప్రజానీకం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సి.ఎఫ్.ఎం.ఎస్ హెల్ప్ డెస్క్ కు సంప్రదిం చేందుకు ప్రయత్నించినా ఎవరూ ఫోన్లకు స్పందించడం లేదని వాపోతున్నారు.

## విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో యువకుడి దారుణ హత్య

**విజయవాడ, మే 13, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో దారు ణం జరిగింది. నగరంలోని రాణిగారి తోటకు చెందిన మీసాల కుమార్ అలియాస్ కృపా రావు(30)ని గుర్తు తెలియని వ్యక్తులు నాప రాయి, బీరు సీసాలతో కొట్టి హత్య చేశారు. పెయింటింగ్ పనిచేస్తూ రాణిగారితోటలో ఉంటున్న కుమార్‌కు ఐదేళ్ల క్రితం మోనికతో వివాహం జరిగింది. న్యూరాజరాజేశ్వరిపేటలోని కేజీఎఫ్ అపార్టుమెంట్స్ వద్ద రాత్రి కుమార్‌పై దాడి జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కుమార్‌ని ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతి చెందాడు. హత్య కేసులో ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పాత గొడవలే హత్యకు కారణమని ప్రాథమికంగా పోలీసుల నిర్ధారించారు.

## తమిళనాడు సిఎం విజయ్ 15 యేళ్ల కష్టం ఇది : సినీనటుడు చరణ్‌రాజ్

**తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల్లోని, తమిళనాడులోని ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ స్వామివారిని ప్రార్థించినట్లు సినీనటుడు చరణ్‌రాజ్ తెలి పారు. తమిళనాడు సిఎం విజయ్ ఈ స్థానంలో చేరడానికి గత 15ఏళ్ళుగా పడిన కష్టానికి నిదర్శనమన్నారు.పోటీచేసిన తొలి ఎన్నికల్లోనే భారీ స్థాయిలో అసెంబ్లీ స్థానాల్లో గెలవడం గొప్ప విషయమని అన్నారు. దర్శకుడు చంద్రశేఖర్ తన గురువని, విజయ్ సిఎంగా రావడంతో తనకెంతో గర్వంగా ఉందన్నారు. బుదవారం ఉదయం ఆయన అనుచరులతో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సామర్థ్యం పెంపుతోనే పటిష్ట ఆర్థిక వ్యవస్థ : సిఎం చంద్రబాబు

- ప్రతి నెలా గణాంకాల సేకరణ, పక్కాగా అంచనాలు
- మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు
- ప్రణాళిక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ మే 13,ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 15 శాతం వృద్ధి సాధించడం ద్వారా స్వర్ణాంధ్ర2047 లక్ష్యాలను చేరుకోగలమని, ఇందుకు వేగంగా గణాంకాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. జీఎస్డీపీ అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్‌టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా శిక్షణ అందించాలన్నారు. సచివాలయంలో బుధవారం ప్రణాళిక శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... త్వరలోనే పూర్తి స్థాయిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతామన్నారు. సమీక్షలో జీఎస్డీపీ కెపాసిటీ బిల్డింగ్, ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రధాన సర్వేలు, జిల్లామండల స్థాయి అధికారులకు శిక్షణ, కేపీఐల ఆడిటింగ్ అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. ప్రస్తుతం రాష్ట్ర జీఎస్డీపీ అంచ నాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఎక్కువ ఆధారపడటం వల్ల విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిని ప్రతీ నెలా... ప్రతీ జిల్లాలో, ప్రతీ మండలంలో ట్రాక్ చేయగలిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, అంచనాలు వేగంగా రూపొందించేలా అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు.

## పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య డిసిఎం పవన్ కల్యాణ్ గొప్ప మనసు

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవకర్గాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాయి. తల్లిదండ్రులు లేని భగవంతుని పిల్లలకు నెలనెలా తన జీతాన్ని రూ.5000 చొప్పున నెలవారీ సాయం కింది అందిస్తున్న పవన్‌కల్యాణ్, ఇప్పుడు 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారి అభిరుచికి అనుగుణంగా ఉచితంగా ఉన్నత విద్యాభ్యాసం చేసే వెసులుబాటు కల్పిస్తున్నారు. పవన్ కల్యాణ్ నుంచి రూ.5 వేల సాయం అందుకుంటున్న వారిలో ఏడుగురు విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించారు. వీరితోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 31 మంది 580 మార్కును దాటారు. ఈ విద్యార్థులలో 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిన ఒక విద్యార్థి కూడా ఉన్నారు. వీరందరి ప్రతిభకు తనవంతు ప్రోత్సాహకంగా పై చదువులకు సాయం చేయాలని ఉపముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ మేరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి, వారి ఆసక్తికి అనుగుణంగా కోర్సులు, కళాశాలలు ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి 31 మందికి ఉచిత విద్య ఏర్పాటు చేశారు. తన నిర్ణయాన్ని గౌరవించి, అడిగిన వెంటనే పిఠాపురం విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన విద్యాసంస్థలకు పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమంగా రాణించాలని విద్యార్థులకు శుభాశీస్సులు అందించారు.

## తలైవా సింప్లిసిటీకి హ్యాట్సాప్ .. రజనీకాంత్ వ్యాఖ్యలపై మంత్రి లోకేశ్ ప్రశంసలు!

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళ సూపర్ స్టార్ ప్రముఖ నటుడు రజనీకాంత్ చేసిన తాజా వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ కార్యక్రమంలో రజనీకాంత్ చేసిన ప్రసంగానికి ముగ్ధుడైన లోకేశ్ తలైవా సింప్లిసిటీ, ఆయనలోని వినయ విధేయతలను కొనియాడుతూ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. రజినీకాంత్ సార్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆశ్రమంలో మీరు చేసిన సరళమైన సరదా అయిన ,ఎంతో లోతైన ప్రసంగాన్ని వింటూ ఈ రోజు ఉదయం నిద్రలేచాను. ఆ ప్రసంగంలోని ప్రతి మాట నాకు ఎంతో నచ్చింది. మీ స్థాయిలో ఉన్న ఒక వ్యక్తి అంతటి సూపర్ స్టార్‌డమ్ ఉన్నప్పటికీ దానిని ఏ మాత్రం తలకు ఎక్కించుకోకుండా అంత వినయంగా, హుందాగా ఉండటం నన్ను ఎంతగానో ఆశ్చర్యపరిచింది. కేవలం విజయం సాధించడం గురించే కాకుండా ఈ విజయంలో కూడా ఎలా ఒదిగి ఉండాలనే విషయం గురించి నేటి యువత మీ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఒక అభిమానిగా మీకు నా ప్రేమ, ప్రశంసలు అని నారా లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మంగళవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవం, అలాగే రవిశంకర్ 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ప్రత్యేక కార్యక్రమానికి రజనీకాంత్, బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను గతంలో తాను సందర్శించినప్పటి జ్ఞాపకాలను అందరితో పంచుకున్నారు. ఆ ఆశ్రమంలో తన ఇగో ఎలా దెబ్బతిన్నదో వివరిస్తూ సభికుల్లో నవ్వులు పూయించారు. ఆశ్రమంలో జరిగిన సంఘటనను గుర్తుచేసుకుంటూ రజనీకాంత్ ఇలా అన్నారు. ఒకసారి గురుదేవులు నన్ను తనతో పాటు ఆశ్రమం చూడటానికి రమ్మని పిలిచారు. నేను వస్తే జనాలు గుమిగూడతారని అది మీకు ఇబ్బందికరం అవుతుందని నేను ఆయనతో చెప్పాను .దానికి ఆయన ఏం పర్వాలేదు. ఎలాంటి డిస్టర్బెన్స్ ఉండదు రండి అని అన్నారు.

## తిరుపతి ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికపై సమీక్షించిన పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

**తిరుపతి కలెక్టరేట్, మే 13 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా ప్రాజెక్టులు, పరిశ్రమలలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే తిరుపతి జిల్లా చాలా ఉన్నత స్థాయిలో ఉందనీ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు..బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు తిరుపతి ఎకానమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక పై జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, డిఆర్ఓ నరసింహులు జిల్లా శాఖ అధికారులతో కలిసి సమీక్షి ంచారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా తయారీ రంగంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే చాలా ఉన్నత స్థాయిలో ఉందనీ అన్నారు. ఇది మంచి సంకేతమని భవిష్యత్తులో మనం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం నుండి పరిశ్రమలు సేవా రంగానికి మారాలని అన్నారు. సేవా రంగాల వాటా ఎక్కువగా ఉండాలని అప్పుడే పెట్టుబడులు ఉపాధిగా మారి ఆర్థిక వృత్తిగా మారుతాయి అని ఆ సామర్థం తిరుపతి జిల్లాకు ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో తయారీ మోలిక సదుపాయాలతో పాటు ఓడరేవు జాతీయ రహదారుల మరియు రాష్ట్ర రహదారులతో బలమైన నెట్వర్క్ అందుబాటులో ఉందన్నారు. పారిశ్రామిక హబ్ దిశగా జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమలు వచ్చినప్పుడు అవి కేవలం పారిశ్రామిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మాత్రమే కాకుండా వాటికి సంబంధించిన నివాస, పట్టణ ప్రణాళిక మరియు సేవా రంగా ప్రణాళికలు కూడా ఇందులో అంతర్భాగం కావాలన్నారు. నిత్యం తిరుపతి, తిరుమల దర్శనానికి వేల సంఖ్యలో ప్రజలు నగరానికి వస్తుంటారని వారు కాసేపు సేద తీరేలా సమయం చేకూర్చే దిశగా ఆలోచన చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథంలో జిల్లా నడపాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా అభివృద్ధి పారిశ్రామిక విస్తరణ పట్టణీకరణ, భవిష్యత్తు మోలిక సదుపాయాలు, పారిశ్రామిక వృద్ధి విద్యాసంస్థలు ఆర్థిక పురోగతి, గ్రేటర్ తిరుపతి కార్పొరేషన్ వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి కి తెలియజేశారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలకు పైగా పారిశ్రామిక భూభాగం క్రియాశీలకంగా ఉందని తెలిపారు, శ్రీ సిటీ, నాయుడుపేట ఈఎంసి క్లస్టర్లు ప్రాంతాలలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. వీటి అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. తిరుపతి జిల్లా తయారంగంలో రాష్ట్రంలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు.


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

## ప్రతిభావంతులైన జర్నలిస్టులకు అవార్డులు

- సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

**విజయవాడ, మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిజం రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మీడియా ప్రతినిదులు 2025- 26 సంవత్సరానికి గాను అవార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. స్థానిక మీడియా అకాడమీ కార్యా లయంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తో కలిసి బుధ వారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవార్డుల ఎంపిక, ప్రదా నం కోసం మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఛైర్మన్ గా నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ని ప్రభుత్వం నియమించిందని ఆయన వెల్లడించారు. ఇండియా టుడే పూర్వ ఎడిటర్ ఏ.ఏ.వి. ప్రసాద్, ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొ.డి. వి.ఆర్. మూర్తి, రిటైర్డ్ హై కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సత్య న్నారాయణమ్మూర్తి సభ్యులుగా ను, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మెం బర్ కన్వీనర్‌గాను వ్యవహరిస్తారన్నారు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో జారీ అయిన ఉత్తరువుల ప్రకారం 12 అవార్డులను ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. వీటిలో కొన్నింటిని కమిటీ విచక్షణ తో, మరి కొన్నిటిని దరఖాస్తులు కోరి అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. లైఫ్ టైం అఛీవ్ మెంటు అవార్డుకు రూ. 3 లక్షలు, ఉత్తమ జర్నలిస్టు, ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డులకు రూ. 2 లక్షలు చొప్పున, మిగిలిన అవార్డులకు రూ 1 లక్ష చొప్పున ప్రైజ్ మని ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయా అవార్డులకు అర్హతలు, దరఖాస్తుకు చివరి తేదీలను తెలుపుతూ ప్రకటన విడుదల చేయడం జరుగుతుందన్నారు. జర్న లిస్టుల అవార్డులకు సంబంధించి కనీస అను భవం మాత్రమే పేర్కొనడం జరిగిందని, దానికి, అక్రిడేషన్లకు సంబంధం లేదని చైర్మన్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ శ్రీ కె.ఎస్. విశ్వ నాథన్ మాట్లాడుతూ జర్నలిస్టుల అవార్డులు ప్రతి యేటా ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పిం చిందని అన్నారు. 2017 తరువాత మళ్ళీ 202526 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ కనపరిచిన జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చే సాంప్రదాయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన తెలిపారు. అవార్డులకు సంబంధించిన ప్రకటనను విడుదల చేసి, అవార్డులకు అర్హులైన జర్నలిస్టులను గుర్తించి జులై నెల లో అవార్డుల ప్రదానం జరిగేలా జరుగుతోందని తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ వి. మణిరాం, సమాచార జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్య చంద్ర రావు, డిప్యూటీ డైరెక్టర్ డి. రమేష్, సి.ఆర్. మీడియా అకాడమీ మేనేజర్ ఎం.భాస్కర నారాయణ రాష్ట్ర సమాచార కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



## పటిష్ట ఏర్పాట్లతో గంగమ్మ జాతర

**తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే తిరుపతి గ్రామదేవతగా పూజ లందు కుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర పటిష్ట ఏర్పాట్లుతో బుధవారం వేకువజామున అమ్మవారి విశ్వరూపం చెంప తొలగింపుతో జాతర ప్రశాంతంగా ముగిసింది. వారంరోజులు జరిగే తాతయ్యగుంట గంగమ్మజాతరలో రోజుకోవేషంలో భక్తులు అమ్మవారిని దర్శించు కోవడం, గంగమ్మ రోజుకో అలంకరణలో భక్తు లకు దర్శనమిచ్చారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పర్యవేక్షణలో గంగమ్మ ఆలయ చైర్మన్ మహేశ్‌యాదవ్, ఆలయ ఇఒ జయకుమార్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్వయంగా ఏర్పాట్లుపై పర్య వేక్షించారు. బుధవారం తెల్లవారుజామున గంగమ్మ ప్రతిమ చెంప పేరంటాలు తొలగించ డంతో జాతర ముగిసింది.

## భక్తుల సౌకర్యార్థం మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్

**ఇంద్రకీలాద్రి, మే 13, ప్రభాతవార్త :** భక్తుల సౌకర్యార్థం మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ఇపుడు ఆలయ బుకింగ్స్ ఇపుడు వాట్సప్ మనమిత్ర నెంబర్ ద్వారా సులభముగా పొందవచ్చు. టికెట్ బుకింగ్ విధానంలో '9552300009' వాట్సప్ నెంబర్‌కి గాని లేదా ప్రక్కన ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వాట్సప్‌లో "హై" అని పెట్టి భక్తులు కావలసిన సేవ ఆప్షన్‌లో దేవాలయ బుకింగ్ సేవలు నిర్ధారించి, ఓపెన్ నొక్కి ఆలయం ఉన్న జిల్లా పేరు ఎన్‌టిఆర్ అనేది ఎంచుకొని, ఆలయం పేరు అనే ఆప్షన్‌లో శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానం ఎంచుకొని, కావలసిన ఆలయ సేవ దర్శనం / సేవ / ఈహుండి ఆప్షన్‌ను ఎంచుకొని, దర్శనం/సేవలోని అంతర ఆప్షన్‌ల ద్వారా మీకు కావలసిన ఆప్షన్‌ను ఎంచుకొన్న అనంతరం తేదీ స్లాట్‌ను ఎంచుకొని భక్తుల పేరు, ఆధార్ తదితర వివరములు పొందుపరచి రివ్యూ అండ్ పే లేదా పేనౌ అనే పేమెంట్ ఆప్షన్ ఎంచుకుని పేమెంట్ పూర్తయిన తర్వాత టికెట్‌ను డౌన్లోడ్ చేసుకుని దేవస్థానం కౌంటర్లలో ఈ టికెట్‌ను ప్రింట్ తీసుకొని మీ సేవను పొందవచ్చునని ఆలయ ఈవో వికె నాయక్ భక్తులకు దర్శనం మరియు ఆర్జిత సేవల సులభ మార్గములను తెలియపరిచారు.

## సింహాచలం దేవస్థానం హుండీ లెక్కింపులో దొంగతనం

**సింహాచలం ప్రభాత వార్త మే 13:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఒక విచారకరమైన ఘటన చోటుచేసుకుంది. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సమయంలో నగదు దొంగతనానికి పాల్పడిన ఒక వ్యక్తిని ఆలయ భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. దేవస్థాన నిబంధనల ప్రకారం బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి సేవా సంఘం తరఫున స్వచ్ఛంద సేవకుడిగా వచ్చిన బి రాంబాబు (79) అనే వ్యక్తి పాల్గొన్నారు. లెక్కింపు జరుగుతుండగా, సుమారు ఉదయం 11:20 గంటల సమయంలో నిందితుడు అత్యంత తెలివిగా రూ. 17,100/ నగదును దొంగిలించి, తన చేతిలో దాచుకుని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్.పి.ఎఫ్ పోలీస్ సిబ్బంది నిందితుడి కదలికలపై అనుమానంతో తనిఖీ చేయగా, దొంగిలించిన నగదు బయటపడింది. వెంటనే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ నిందితుడిని నగదుతో సహా గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు.

## గరివిడిలో 25 నుండి దక్షిణ భారత స్థాయి బహుభాషా నాటక పోటీలు

**గరివిడి (విజయనగరం), మే 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా గరివిడిలో ఈ నెల 25 నుండి 31 వరకు దక్షిణ భారత స్థాయి బహుభాషా నాటిక పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు స్థానిక రతన్ చంద్ నగర్ కాలనీలో నిర్వాహకులు నాటిక పోటీలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ప్రతీ ఇంటికి నాటిక పోటీల కరపత్రాలను పంపిణీ చేసి ప్రజానీకాన్ని, కళాభిమానులను కళాకారులను ఆహ్వానించారు. విశ్వభారత్ సేవా సొసైటీ నేతృత్వంలో జరిగే సౌత్ ఇండియా స్థాయి నాటిక పోటీల్లో 16 నాటికలు ప్రదర్శనలకు ఎంపిక చేసినట్లు విశ్వ భారత సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బలివాడ రమేష్, సొసైటీ ప్రతినిధి, జాతీయ స్థాయి ఉత్తమ కళాకారుడు అవార్డు గ్రహీత కంబాల శివ, కళాకారుడు ఎస్ఆర్ ఖాన్ వెల్లడించారు. ఈ పోటీలు ఈనెల 25, 26, 27 తేదీల్లో అస్సాం రాష్ట్రం గౌహతికి చెందిన జీవ శ్రేష్ఠ, సూన్య పంజూరి (ఒడియా), అగర్ గుప్త దాన్(బెంగాల్), కతాయి (హిందీ) ఛతీస్ గఢ్, పేసెస్ ఆఫ్ ఉమెన్(ఒరియా), పక్కింటి మొగుడు(తెలుగు), 28,29,30,31 తేదీల్లో విడాకులు కావాలి(తాడేపల్లిగూడెం), కన్నీటికి విలువెంత(కాకినాడ), అసత్యం(విశాఖపట్నం),ఆలీతో సరదాగా (చిలకలూరిపేట), మాతృత్వం(గుంటూరు), ఇంద్రప్రస్థం (గుంటూరు), స్వప్నం దాల్చిన అమృతం(కరీంనగర్), నిశ్శబ్దమా నీ ఖరీదెంత(విశాఖపట్నం),మా ఇంట్లో మహాభారతం (చిలకలూరి పేట), ఎనిమిదో అడుగు(విజయనగరం)నాటికలు ప్రదర్శితం కానున్నాయి. గరివిడి లో గతంలో జాతీయ స్థాయి బాహు బాషా నాటిక పోటీలు జరగ్గా ,ఈనెలలో దక్షిణ భారత స్థాయిలో బహుభాషా నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయం. కళలకు నిలయమైన గరివిడి గత మెంతో ఘనంగా వెలిగేది.అదే కీర్తి ఖ్యాతి గరివిడి లో నిలిపేందుకు ఈ పోటీలు తార్కాణం కానుండటం ముదావహం.

## పిల్లల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం :కలెక్టర్ డా.జి. లక్ష్మీశ

### ఎన్టీఆర్ జిల్లాలో 50 సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపుల నిర్వహణ


సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపులకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ

**విజయవాడ మే 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న 50 సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపులకు సంబంధించిన పోస్టర్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 27 క్రీడా విభాగాల్లో ఈ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ , జట్టుభావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లాలోని యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని క్యాంపుల్లో అధిక సంఖ్యల్లో పాల్గొనాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, కె.కోటేశ్వరరావు, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా యువజన సంక్షేమ అధికారి డాక్టర్ కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోజుకు 5.23 కోట్ల అప్పు తెస్తున్న ఘనత చంద్రబాబుదే

- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మే 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సగటున రోజుకు రూ.5.23 కోట్లు అప్పు తెస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదే నని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అప్పులపైన, వైసిపి హయాంలో చేసిన అప్పుల పైన స్వేత పత్రం విడుదల చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 22 నెలల కాలంలోనే రూ.3.61 లక్షలకోట్లు అప్పులు చేశారని, సగటున రోజుకి రూ.5.23కోట్లు అప్పులు చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేస్తోందని ఆయన విమర్శించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఐదేళ్ల పాలనలో వైసిపి హయాంలో రూ.3.32లక్షల కోట్లు మాత్రమే అప్పులు చేస్తే టిడిపి నేతలు రూ.10లక్షల కోట్లు అప్పులు చేశారని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. వైసిపి ఐదేళ్ల పాలనలో కూటమి 22 నెలల పాలనలో చేసిన అప్పులపై స్వేత పత్రాన్ని విడుదల చేస్తే ఎవరి హయాంలో ఎంత అప్పులు చేశారో బహిర్గతం అవుతుందన్నారు. వైసిపి హయాంలో ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి నేరుగా డిపిటి ద్వారా సాయం అందిందన్నారు. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకున్నా లక్షల కోట్లు అప్పులు చేస్తోందని, తీసుకొస్తున్న అప్పులు ఎక్కడికి వెళ్తున్నాయని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా రైతు సమస్యలపై కనీసం సమీక్ష కూడా నిర్వహించడం లేదన్నారు. హంద్రీనీవా కాలువను 11వేల క్యూ సెక్కుల సామర్థ్యంతో విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా అమరావతి చంద్రబాబుకు క్రెడిట్ కార్డుగా మారిందని విమర్శించారు. అమరావతి మాత్రమే కాకుండా వెనుకబడిన ప్రాంతాల వైపు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూడాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎండిపోతున్న పంటలకు రక్షణ తడులు అందించి ఆదుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ, బకాయిలతోపాటు ఫీజు రీయెంబర్స్‌మెంట్‌ను చెల్లించాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 70కిపైగా రైతు కుటుంబాలకు 7 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా వైసిపి హయాంలో అనంతపురం నగరం మీదుగా చేపట్టిన నాలుగు లైన్ల రహదారి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణపు పనులు దాదాపు పూర్తి అయ్యాయని, పెండింగ్‌లో ఉన్న టవర్‌క్లాక్ సర్వీస్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు.

## తిరుపతిలో పర్యాటక రంగానికి భారీ ప్రోత్సాహం

**తిరుపతిరూరల్, మే 13 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తిరుపతిలో రిజెంటా దేవరాయ ఫోర్ స్టార్ హోటల్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుపతి, విశాఖపట్నంను ఐకానిక్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి రూ.1,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి పెట్టుబడిదారులకు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదులు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ప్రముఖ హోటల్ సంస్థలు తిరుపతిలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. దీంతో తిరుపతి అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
గురువారం 14, మే 2026






# విశాఖలో సైబర్ క్రైం దూకుడు..

- దేశంలోనే పేరొందిన ముఠా సభ్యుల్ని అరెస్టు చేసిన విశాఖ సైబర్ క్రైం పోలీసులు
- 8మంది అరెస్టు
- రూ 2 కోట్ల డిజిటల్ సామగ్రి స్వాధీనం

వార్త 8లో



8వ పేజీలో

# భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జ్ఞానాపురం మార్కెట్ అభివృద్ధి

## జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్





8లో

# నీట్ పరీక్షల్లో పారదర్శకతకు వ్యవస్థాగత సంస్కరణలే పరిష్కారం

## ఎయూ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు

**విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త :**

నీట్-యుజి 2026 పేపర్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నేపథ్యంలో, పరీక్షల నిర్వహణలో మూలపూర్వక సంస్కరణలు అత్యవసరమని ఆంధ్ర విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. కేవలం శిక్షలు విధించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదని, వ్యవస్థాగత మార్పులు, నైతిక విలువల ఆధారిత విద్యా విధానం ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మే 3న నిర్వహించిన నీట్-యుజి పరీక్షకు సంబంధించిన "గెస్ పేపర్" సోషల్ మీడియాలో ముందుగానే వైరల్ కావడం, అసలు ప్రశ్నపత్రంలోని అనేక ప్రశ్నలు వాటితో సరిపోలినట్లు దర్యాప్తులో బయటపడటం దేశవ్యాప్తంగా ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రాజస్థాన్ ఎస్‌వోజీ, సీబీఐ ప్రాథమిక విచారణలో వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రశ్నలు వ్యాప్తి చెందినట్లు తేలినట్లు సమాచారం. కోచింగ్ సెంటర్ల నెట్‌వర్క్ ద్వారా లక్షల రూపాయలకు గెస్ పేపర్లు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై స్పందించిన డాక్టర్ ఉమామహేశ్వరరావు, ప్రస్తుతం అమల్లో ఉన్న జీపీఎస్ ట్రాకింగ్, ఏఐ నిఘా, 5జీ జామర్లు వంటి భద్రతా చర్యలు సరిపోవని అన్నారు. భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, మల్టిపుల్ ప్రశ్నపత్రాల సెట్లు, బ్లాక్‌చెయిన్ సాంకేతికత వినియోగం, థర్డ్ పార్టీ ఆడిటింగ్ వంటి సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. పరీక్షా నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ, ప్రొఫెషనల్ ఎథిక్స్ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. అలాగే కోచింగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, లీక్‌లకు సహకరించిన అధికారులపై జీవితకాల నిషేధం విధించేలా చట్టాలను మరింత కఠినతరం చేయాలని సూచించారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు ఆందోళన చెందవద్దని, అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్ ద్వారా వచ్చే ప్రకటనలను గమనిస్తూ ప్రిపరేషన్ కొనసాగించాలని డాక్టర్ ఉమామహేశ్వరరావు సూచించారు.

# పెట్టుబడుల ఆకర్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి



- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

**విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త:**

జిల్లాలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన, భూసేకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, ఎంవోయూల అనంతర చర్యలు తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు (మీాఖం), వాటి ప్రగతి, గ్రౌండింగ్ దశలో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణ పనుల స్థితిగతులపై అధికారులు సమగ్ర వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా భూ బ్యాంక్‌ను గుర్తించి ప్రభుత్వ భూములతో పాటు అవసరమైతే ప్రైవేటు భూములను కూడా సమీకరించే అవకాశాలను పరిశీలించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అనువైన భూభాగాలను ముందుగానే గుర్తించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పెట్టుబడిదారులతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారికి అనుకూల వాతావరణం కల్పించాలని, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సింగిల్ విండో సేవలను సమర్థవంతంగా అమలు చేస్తూ పరిశ్రమల స్థాపనకు ఎదురయ్యే ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటక, ఐటీ, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను వినియోగించుకోవాలని,

తరువాయి 8వ పేజీలో

# సింహాచలం దేవస్థానం హుండీ లెక్కింపులో దొంగతనం



**సింహాచల, మే 13, ప్రభాతవార్త:**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఒక విచారకరమైన ఘటన చోటుచేసుకుంది. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సమయంలో నగదు దొంగతనానికి పాల్పడిన ఒక వ్యక్తిని ఆలయ భద్రతా సిబ్బంది పట్టుకున్నారు. దేవస్థాన నిబంధనల ప్రకారం బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి సేవా సంఘం తరఫున స్వచ్ఛంద సేవకుడిగా వచ్చిన బి రాంబాబు (79) అనే వ్యక్తి పాల్గొన్నారు. లెక్కింపు జరుగుతుండగా,

తరువాయి 8వ పేజీలో

# నేటి నుంచి విశాఖలో 'ద ఇండియా ఎడిట్ బై వైభవ్' ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

- ప్రదర్శనలో పాల్గొననున్న 60కి పైగా ప్రముఖ డిజైనర్ బ్రాండ్లు



**విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త:**

ప్రముఖ జ్యువెలరీ సంస్థ వైభవ్ జ్యువెలర్స్ సమర్పిస్తున్న "ద ఇండియా ఎడిట్ బై వైభవ్" ప్రత్యేక ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ప్రదర్శన ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్నారు. నగరంలోని వెల్‌కమ్ హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. దేశవ్యాప్తంగా పేరుపొందిన 60కు పైగా ప్రముఖ డిజైనర్ బ్రాండ్లు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నాయి. ఫ్యాషన్ వేర్, హ్యాండ్‌లూమ్ కలెక్షన్లు, హోమ్ డెకర్, హస్తకళ ఉత్పత్తులు,

తరువాయి 8వ పేజీలో

## పెట్టుబడుల ఆకర్షణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

7వ తరువాయి ..

భాగస్వామ్య సదస్సులో జరిగిన అవగాహన ఒప్పందాల ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే దిశగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రాబోయే పరిశ్రమలు, టూరిజం ప్రాజెక్టులు, ఐటీ కంపెనీల వివరాలను సేకరించాలని, వాటికి ఎలాంటి చోట ఏయే భూములు అవసరమో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన భూభాగాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సీఐఐ, ఎస్.ఐ.పి.బి. అనుమతులు పొందిన ప్రాజెక్టుల ఏర్పాటులో వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవోలు సంగీత్ మాథుర్, శేషశైలజ, ఏపీఐఐసీ జెడ్ఎం సింహాలచం, పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, టూరిజం అధికారిణి మాధవి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి, ఏడీసీ సత్యవేణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విశాఖలో
## 'ద ఇండియా ఎడిట్ బై వైభవ్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

7వ తరువాయి ..

వెల్‌నెస్ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్ఎస్ అధికారి డా. సాయేష్ చావన్, కంచర్ల రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. భారతీయ కళలు, సంప్రదాయ హస్తకళలు, ఆధునిక డిజైన్లను ఒకే వేదికపై ప్రజలకు పరిచయం చేయడమే ఈ ప్రదర్శన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ రంగాల్లో ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

## బంగాళాఖాతంలో తూర్పు నౌకాదళ యుద్ధ విన్యాసాల సమీక్ష..
### సిద్ధతపై నేవీ చీఫ్ ప్రశంసలు



విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త :

భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి తూర్పు నౌకాదళ కమాండ్ పర్యటన సందర్భంగా బంగాళాఖాతంలో నిర్వహించిన యుద్ధ విన్యాసాలు, కార్యాచరణ సిద్ధతను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఐఎన్ఎస్ హిమగిరి నౌకపై ప్రయాణించి తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు, సముద్ర గస్తీ విమానాల ఆధునిక యుద్ధ విన్యాసాలను పరిశీలించారు.తూర్పు ఫ్లీట్, లోకల్ ఫ్లోటిల్లా సమన్వయం, వేగవంతమైన ప్రతిస్పందన సామర్థ్యం, యుద్ధ సిద్ధతను నేవీ చీఫ్ ప్రశంసించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులకైనా వేగంగా, కచ్చితంగా స్పందించే స్థాయిలో తూర్పు నౌకాదళం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.నౌకాదళ సిబ్బందిని ఉద్దేశించి అడ్మిరల్ త్రిపాఠి మాట్లాడుతూ "నోటీస్ టు స్టీమ్ అంటే నోటీస్ టు కాంబాట్‌గా ఉండాలి" అని స్పష్టం చేశారు. యుద్ధ సామర్థ్యాన్ని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవడం, లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే కార్యాచరణ సామర్థ్యం కొనసాగించడం అత్యంత కీలకమని అన్నారు. ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో యుద్ధ సిద్ధత, ఆపరేషనల్ అందుబాటు, మిషన్ సామర్థ్యాలే భారత నౌకాదళ ప్రధాన ప్రాధాన్యతలుగా కొనసాగాలని నేవీ చీఫ్ సూచించారు.

## యెర్నిమాంబా రాట మహోత్సవంలో
## ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త :

నగరంలోని జ్ఞానాపురం యెర్నిమాంబా ఆలయంలో నిర్వహించిన రాట మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వేడుకలు మన సంస్కృతికి ప్రతీకలని, ఇటువంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యెర్నిమాంబా అమ్మవారి జాతర వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త :

అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందపురం మండలం గిడిజాల గ్రామానికి చెందిన సూరావజ్జుల శ్రీనివాస్ కు సీఎం రిలీఫ్ ఫండ్ ను, 7 వ వార్డుకు చెందిన దొడ్డి తులసీరాం కుటుంబానికి బీమా సాయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 5,23,742 విలువైన చెక్కును బాధితుడి కుటుంబ సభ్యులకు.. అలాగే ప్రమాదవశాత్తు మరణించిన దొడ్డి తులసీరాం భార్య దొడ్డి లక్ష్మీకి పార్టీ తరపున రూ.5 లక్షల బీమా మొత్తాన్ని ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, కోరాడ రాము, షిణగం రామకృష్ణ, కోరాడ వైకుంఠం, పిల్లా వెంకట్రావు, కానూరు అచ్యుతరావు, శ్రీరామ్మూర్తి, పిల్లా మోహన్ కృష్ణ, నర్సింగ్, పిల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

# జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

పాడేరు, మే 13, ప్రభాతవార్త:

రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపం తుమ్మరమెట్టలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు కిడారి శ్రావణ్ కుమార్, శ్రీప్రియలను ఆశీర్వదించారు. పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు లగిశపల్లికి చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. లోకేష్‌ను కలిసేందుకు స్థానిక గిరిజన ప్రజానీకం పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం వారితో ఫోటోలు దిగారు. మార్గమధ్యలో వర్తనాపల్లి, నక్కలపుట్టు జంక్షన్లలోనూ తనకోసం నిరీక్షిస్తున్న ప్రజలకు అభివాదం చేసి, వారి నుంచి వినతులు తీసుకున్నారు.

# సింహాచలం దేవస్థానం హుండీ లెక్కింపులో దొంగతనం

7వ తరువాయి ..

సుమారు ఉదయం 11:20 గంటల సమయంలో నిందితుడు అత్యంత తెలివిగా రూ. 17,100/- నగదును దొంగిలించి, తన చేతిలో దాచుకుని బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ?అక్కడ విధుల్లో ఉన్న ఎస్.పి.ఎఫ్ పోలీస్ సిబ్బంది నిందితుడి కదలికలపై అనుమానంతో తనిఖీ చేయగా, దొంగిలించిన నగదు బయటపడింది. వెంటనే సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు.దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ నిందితుడిని నగదుతో సహా గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. దేవస్థాన పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హుండీ లెక్కింపు వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని దేవస్థాన అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జ్ఞానాపురం మార్కెట్ అభివృద్ధి

విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త:

విశాఖ నగరానికి కీలక వాణిజ్య కేంద్రంగా ఉన్న జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో పర్యటించి అక్కడ దైనందిన కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు.. వర్తకులు, కార్మికులు, రైతు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు భారీ స్థాయిలో జరుగుతున్నప్పటికీ, పార్కింగ్, లోడింగ్--అన్‌లోడింగ్, రహదారులు, నిల్వ సదుపాయాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ అత్యవసరమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వ్యాపార పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో మరింత సౌకర్యవంతమైన హోల్‌సేల్ మార్కెట్ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం హైవేలకు అనుసంధానం ఉండే ప్రదేశంలో సమగ్ర మార్కెట్ యార్డు అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి, వర్తకులు , వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. చెన్నైలోని కోయంబేడు మార్కెట్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, సరైన ప్రణాళికతో అభివృద్ధి చేసిన హోల్‌సేల్ మార్కెట్లు నగర ఆర్థిక వ్యవస్థకు బలంగా మారతాయని అన్నారు. మొదట్లో మార్పులపై కొంత సందేహం సహజమే అయినప్పటికీ, ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత వ్యాపారులు, వినియోగదారులు స్వయంగా అలవాటు పడతారని పేర్కొన్నారు. జ్ఞానాపురం మార్కెట్‌పై నేరుగా, పరోక్షంగా వందలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, సుమారు 60 మంది వర్తకులు, 500 మందికి పైగా కార్మికులు, వందమంది గుమస్తాలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వారి ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా, దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి అనేది నగర భవిష్యత్తుకు అవసరమని, వర్తకులు, రైతులు, కార్మికుల సహకారంతో జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌ను ఆధునిక వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎం.పి. మతుకుమిల్లి శ్రీభరత్ వెంట జ్ఞానాపురం హోల్ సేల్ కూరగాయల మార్కెట్ కు చెందిన వైష్ణవి హోల్‌సేల్ వెజిటబుల్ మార్కెట్ అధ్యక్షుడు కె. వీర్రాజు గారు,సెక్రటరీ వి పరమేష్ గారు, పి. శ్రీనివాసులు గారు కె. ప్రసాద్ గారు,కె.పూర్ణ గారు, ఎన్.ఎస్.బి శ్రీనుగారు వున్నారు.

# విశాఖలో సైబర్ క్రైం దూకుడు

విశాఖపట్నం, మే 13 ప్రభాతవార్త

*ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో అమాయకులను అప్పుల పాలుచేసి కోట్ల రూపాయలు దోచుకున్న ఈ ముఠాపై విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు కొరడా ఝులిపించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో బాధితుల ఫిర్యాదుతో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు వేగవంతమైన విచారణతో ముఠా ఆగడాలకు కళ్లెం వేశారు. ఈ ముఠా ఇతర రాష్ట్రాలలో కూడా విస్తరించి ఉండటంతో పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. రూ.400 కోట్ల ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ ను ఛేదించారు. పక్కా ఆధారాలతో నిందితులను అరెస్టు చేశారు. వారిని రిమాండ్ కు తరలించారు. నిందితులు తమ కార్యకలాపాలకు వినియోగించిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.*

ఇక వివరాల్లోకి వెళ్తే..విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విచారణ చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులకు భారీ ఆన్‌లైన్ బెట్టింగ్ , మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కరణ్ పఖ్రాని అలియాస్ గబ్బర్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా బెట్టింగ్ నెట్‌వర్క్ నడుస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.ఫిర్యాదుదారు తండ్రి రవి శంకర్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన పరిచయస్తుడు త్రినాథ్ మాటలు నమ్మి బ్యాంక్ ఖాతాలు తెరిచి ఇచ్చాడు. మొదట రమ్మీ సర్కిల్ కోసం ఉపయోగిస్తామని చెప్పిన నిందితులు, తర్వాత ఆ ఖాతాలను ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ మోసాలకు వినియోగించినట్లు తెలిసింది. అనంతరం రవి శంకర్ తన స్నేహితులు, పరిచయస్తుల పేర్లపై కూడా అనేక ఖాతాలు తెరిపించి మొత్తం 50 నుంచి 60 వరకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు పోలీసులు గుర్తించారు.ఈ వ్యవహారంలో అనుమానం రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా దర్యాప్తు ప్రారంభమైంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఏ-3 కొణతాల జగదీష్‌ను 2025 ఏప్రిల్ 27న అరెస్టు చేయడం జరిగింది. అతని నేర అంగీకారంతో సాంకేతిక ఆధారాల ఆధారంగా బెంగళూరులోని బిలేకహళ్లి ప్రాంతంలో ఉన్న అజ్మల్ రెసిడెన్సీలోపోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ నుంచి 13 మందిని అరెస్టు చేసి విశాఖకు తరలించి రిమాండ్‌కు పంపారు.

### రూ.400 కోట్లకు పైగా లావాదేవీలు?

అన్ లైన్ బెట్టింగ్ వ్యవహారంలో సుమారు రూ.400 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి నిర్వహించిన దాడుల్లో 57 మొబైల్ ఫోన్లు, 130 బ్యాంక్ పాస్‌బుక్కు, 33 ఏటీఎం కార్డులు, 4 ల్యాప్‌టాప్‌లు, 2 కరెన్సీ కౌంటింగ్ మెషీన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 224 మ్యూల్ బ్యాంక్ ఖాతాలను గుర్తించగా, వాటిలో 160 ఖాతాల స్టేట్‌మెంట్ల పరిశీలనలో కేవలం ఆరు నెలల్లోనే రూ.400 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లను నిర్వహిస్తూ, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా బెట్టింగ్ లింకులు పంపించి నిందితులు ప్రజలను ఆకర్షించినట్లు పోలీసులు వెల్లడించారు.

### ప్రధాన నిందితుడు అరెస్ట్..

ఈ ఏడాది ఏప్రిల్ 21న పక్కా సమాచారంతో ప్రధాన నిందితుడు కరణ్ పఖ్రానిని కోల్‌కతాలోని రీజెంట్ పార్క్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. సాంకేతిక దర్యాప్తులో భాగంగా కోజ్ టూల్, గాంధివామ్ టూల్ సహాయంతో డిజిటల్ ఫుట్‌ప్రింట్లు, ఫోన్ నంబర్లు, ఈమెయిల్ లింకేజీలు విశ్లేషించి ప్రధాన నిందితుడు కరణ్ పఖ్రానిని గుర్తించిన అనంతరం కోల్‌కతాలోని రీజెంట్ పార్క్ ప్రాంతంలో మిగతా నిందితులతో కలిసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి ఈ ఆపరేషన్‌లో ఏ-1తో పాటు ఏ-19 నుంచి ఏ-24 వరకు నిందితులను అరెస్టు చేశారు. బెంగళూరు, కోల్‌కతా, పుణే, గోవా, రాయపూర్ తదితర నగరాలకు ఈ ముఠా విస్తరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

### సైబర్ నేరాల పై ఉక్కుపాదం
### - సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి

సైబర్ నేరస్థుల చేతిలో చాలామంది మోసపోతున్న వైనం పై సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పందించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నప్పటికి నిర్లక్ష్యంగా ఉండటంతో సైబర్ నేరస్తుల చేతులో సులువుగా మోసపోతున్నారని చెప్పారు. ముందే జాగ్రత్తగా వ్యవహరిస్తే ఆ నేరస్తుల నుంచి మోస పోకుండా ఉండటం జరిగేదని అన్నారు. తమకు అందిన ఫిర్యాదుల పై మాత్రం సీరియస్ గా స్పందిస్తున్నామని తెలిపారు.సైబర్ క్రైమ్ పోలీసులు మాత్రం చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ సైబర్ నేరగాళ్ల పని పడుతున్నారని పేర్కొన్నారు. నేరస్తులు దేశంలో ఏ మూల దాక్కుని ఉన్నా సరే వదిలే ప్రసక్తి లేదన్నారు. చట్టపరంగా వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# విశాఖకు రూ.1500 కోట్ల వరం..

## మధురవాడకు 24/7 నీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి గ్రీన్ సిగ్నల్!

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖపట్నం నగర మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఎపెక్స్ కమిటీ.. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ), గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ (జీవీఎస్సీసీఎల్ ) ప్రతిపాదించిన మూడు భారీ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్ ) ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. మొత్తం రూ. 1,501.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు విశాఖ నగర నీటి సరఫరా, పారిశుద్ధ్యం, స్మార్ట్ యుటిలిటీ వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులకు దారితీయనున్నాయి. మధురవాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, 24 గంటల తాగునీటి సరఫరా, నగరవ్యాప్తంగా బల్క్ అండ్ సెమీ-బల్క్ నీటి సరఫరా ఆటోమేషన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశాఖ అభివృద్ధి చరిత్రలో కీలక ఘట్టంగా మారింది. ఈ మూడు ప్రాజెక్టులకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద సుమారు రూ.375.26 కోట్ల కేంద్ర గ్రాంట్ లభించనుంది. మిగిలిన నిధులు ఐ ఎఫ్ సీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణాలు, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వంటి జాతీయ బ్యాంకుల టర్మ్ లోన్ల ద్వారా సమీకరించనున్నారు. మధురవాడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు రూ.658.61 కోట్లు కేటాయించగా.. 401 కిలోమీటర్ల మురుగునీటి పైప్‌లైన్ నెట్‌వర్క్‌తో పాటు 20 ఎంఎల్డీ సామర్థ్యంతో ఆధునిక ఎస్ బి ఆర్ టెక్నాలజీ ఆధారిత మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు కానుంది. వేగంగా విస్తరిస్తున్న మధురవాడ కారిడార్‌కు ఇది పెద్ద ఊరటగా భావిస్తున్నారు. అలాగే మధురవాడ జోన్, పరిసర ప్రాంతాల్లో 24/7 స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ.725.18 కోట్లతో భారీ ప్రాజెక్టు చేపట్టనున్నారు. 65 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, 37,407 ఏఎంఐ స్మార్ట్ కనెక్షన్లు, డిస్ట్రిక్ట్ మీటరింగ్ ఏరియాస్, వాల్యూమెట్రిక్ టారిఫ్ విధానం వంటి ఆధునిక సాంకేతిక తలను అమలు చేయనున్నారు. "డ్రింక్ ఫ్రమ్ ట్యాప్" కాన్సెప్ట్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఈ ప్రాజెక్టు రూపొందించబడింది. ఇక నగర వ్యాప్తంగా బల్క్ అండ్ సెమీ-బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆటోమేషన్ కోసం రూ.117.24 కోట్లతో స్కాడా ఆధారిత స్మార్ట్ మానిటరింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. 7,857 మీటరింగ్ కనెక్షన్లు, కృష్ణా బ్యారేజ్ పంపింగ్ వ్యవస్థ ఆధునీకరణ,



రియల్ టైమ్ నీటి ప్రవాహ పర్యవేక్షణ వంటి సదుపాయాలు ఇందులో భాగం కానున్నాయి. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, ఎం.హెచ్.యూ.ఎ నేషనల్ ఎపెక్స్ కమిటీ నుంచి లభించిన ఈ సూత్రప్రాయ ఆమోదం విశాఖ నగరానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గొప్ప గుర్తింపని పేర్కొన్నారు. ఆధునిక పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, నీటి భద్రత, పారిశుద్ధ్యం, స్మార్ట్ యుటిలిటీ వ్యవస్థల్లో విశాఖను దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయని తెలిపారు. సీఎం ఎన్. చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఈ ప్రతిపాదనలు సిద్ధమయ్యా యని, పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేసిందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే విశాఖ నగరంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, స్మార్ట్ యుటిలిటీ పరిపాలనలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తూర్పు నౌకాదళ కమాండ్‌ను సందర్శించిన నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ త్రిపాఠి

విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త :

భారత నౌకాదళాధిపతి (సీఎన్ఎస్) అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి ఈ నెల 10 నుంచి 12 వరకు విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమాండ్‌కు సంబంధించిన ఆపరేషనల్, శిక్షణ, పరిపాలనా కార్యకలాపాలను సమీక్షించారు. పర్యటనలో భాగంగా అడ్మిరల్ త్రిపాఠి సముద్రంలో ఒకరోజు గడిపి తూర్పు ఫ్లీట్ కార్యాచరణ సిద్ధత, ఆపరేషనల్ సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, నావికులతో సమావేశమై దేశ సముద్ర భద్రత పరిరక్షణలో వారి అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని అభినందించారు.

అలాగే సముద్రిక ఆడిటోరియంలో నిర్వహించిన "ఫైర్‌సైడ్ చాట్" కార్యక్రమంలో నౌకాదళ సిబ్బంది, రక్షణ శాఖ పౌర ఉద్యోగులతో సీఎన్ఎస్ ముచ్చటించారు. ఆపరేషనల్ సామర్థ్యాల పెంపు, సిబ్బంది సంక్షేమం, ఉత్సాహవంతమైన సేవలపై నిర్మాణాత్మక చర్చలు జరిపారు. ఈ పర్యటన ద్వారా భారత నౌకాదళం ఆపరేషనల్ సిద్ధత, సిబ్బంది సంక్షేమం, అన్ని హోదాల సిబ్బందితో మరింత అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తోందని మరోసారి స్పష్టమైంది.



## పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలి

### జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్



అనకాపల్లి, మే 13, ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే పూర్తిగా తొలగించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా వ్యర్థాలు లేకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాలు, గ్రామ పంచాయతీలలో వ్యర్థాలను గుర్తింపు, విభజన, శుద్ధి, శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన యంత్రాలు, సిబ్బంది, నిధులను సమకూర్చి కొని పనులను పురమాయించి వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి మండలంలో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్లు ఏర్పాటు చేసి, చెత్త సేకరణ, రవాణా వంటి వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూసుకోవాలని, ఎక్కడా లోపాలు లేకుండా మరమ్మత్తులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిలో సొంత మరుగుదొడ్లు ఉండేలా వాటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లను మరింత మెరుగుపరచాలని, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ఉండకుండా లక్ష్యాలను చేరుకుని జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డిఎల్‌డిఓ, డిప్యూటీ ఎంపిడిఓలు, పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి : జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

అనకాపల్లి, మే 13, ప్రభాతవార్త



రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సత్వరమే పరిష్కరించాలని, రెవెన్యూ సేవలలో సమయపాలన, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను కట్టుదిట్టం చేయాలని జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ డి.ఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ రెవెన్యూ, సర్వే, భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖలపై మండల, డివిజన్‌ల వారిగా, గ్రామ వార్డు సచివాలయాల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, పిజిఆర్ఎస్‌లలో వచ్చిన అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, ఆక్రమణలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ మ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. సమావేశంలో డి.ఆర్వో సుబ్బలక్ష్మి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు కె.మనోరమ, అనిత, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వివి రమణ, ఎడి సర్వే గోపాలరాజా, జిల్లా పౌర సరఫరాల అధికారి, పౌర సరఫరాల సంస్థ డి.ఎం.లు కె.ఎన్.మూర్తి, కె.జయంతి, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, కలక్టరేట్ మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్లమారమ్మ అమ్మవారి కలశ ప్రతిష్ట

అనకాపల్లి, మే 13, ప్రభాతవార్త



మండలంలోని పిసినిగాడ పంచాయతీ శివారు బిఆర్‌టి కాలనీలో కొలువైయున్న శ్రీ నల్లమారమ్మ అమ్మవారి కలశ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆ కాలనీ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. అమ్మవారి కలశ ప్రతిష్ట మహోత్సవంలో అనకాపల్లి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమర శెట్టి రామ్‌కి, టిడిపి నేత దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లమారమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారుగా 5 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## మహానాడుకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలిరావాలి : పప్పల చలపతిరావు, నాగేశ్వరరావు

ఎలమంచిలి, మే 13, ప్రభాతవార్త



పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యాలయంలో ఎలమంచిలి మండలం తెలుగుదేశం పార్టీ సమావేశం ఎలమంచిలి మండలం పార్టీ అధ్యక్షుడు ఉతశెట్టి సన్యాసినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పండుగ అయినా మహానాడు కార్యక్రమం ఈనెల 27, 28, 29వ తేదీలలో నెల్లూరు జిల్లాలో అతి వైభవంగా జరుగనుందని, కార్యక్రమానికి ఎలమంచిలి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఎలమంచిలి మండలం రేగుపాలెం గ్రామానికి చెందిన రమణ ప్రమాదవశాత్తు ఈ మధ్యకాలంలో చనిపోవడంతో భార్య రాజ్యలక్ష్మికి ప్రమాదవశాత్తు బీమా కింద ఐదు లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. అదేవిధంగా కష్టపడిన నాయకులను కార్యకర్తలను గుర్తించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ ముందు ఉన్నారని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్, రాష్ట్ర అభివృద్ధి విషయంలో నిరంతరం కృషి చేస్తున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని తెలిపారు. లక్కవరం పిఏసీఎస్ చైర్మన్ కొలుకులూరి విజయభాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు ఇత్తంశెట్టి రాజా వెంకటరమణారావు, మాజీ జిల్లా అధికార ప్రతినిధి చిరంజీవి, మాజీ జడ్పీటిసి రాజాన నారాయణమ్మ, మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఊడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన దుర్గకు రాష్ట్ర స్థాయి అవార్డు

నర్సీపట్నం,మే 13,ప్రభాతవార్త




నర్సీపట్నం బీసీ బాలికల వసతి గృహంలో చదువుతున్న రుత్తల దుర్గ పదవ తరగతిలో 574 మార్కులు సాధించింది. ఈ మేరకు మంగళవారం అమరావతిలో ఎంజేపీ గురుకులాలు, బీసీ వసతి గృహాల్లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సబిత, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఏ.మల్లికార్జునరావు, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ చేతుల మీదగా అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని దుర్గను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వసతి గృహాధికారి బి. వెంకటలక్ష్మి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామచంద్రమ్మ పుట్టుక (మెరుపులు) మహోత్సవం



ఎలమంచిలి, మే 13, ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ రామచంద్రమ్మ పుట్టుక మహోత్సవం (మెరుపులు) నేడు అనగా గురువారం నిర్వహించుటకు మహోత్సవ ఆలయ ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 400 సంవత్సరాలు చరిత్ర కలిగిన రామచంద్రమ్మ అమ్మవారి దేవస్థానం గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు ప్రత్యేకంగా వెలుగొందుతుంది. తరతరాలుగా గ్రామ ప్రజలు ఈ అమ్మవారిని గ్రామ దేవతగా భావించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పెద్దలు తెలిపిన వివరాలు ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలు ఒకసారి అమ్మవారు ప్రత్యక్షమై పవిత్ర దినాన అర్ధరాత్రి సమయంలో ఆలయ సన్నిధిలో దివ్యకాంతి దర్శనం ఇస్తారని విశ్వాసం. ఈ దివ్య సంఘటనను గ్రామస్తులు అమ్మవారి కరుణాకటాక్షంగా భావించి భక్తి భావంతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా రామచంద్రమ్మ అమ్మవారి మెరుపులు మహోత్సవం ఆలయ వస్తా కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మహోత్సవం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవ కార్యక్రమాలు, సాంప్రదాయ సేవలు, భక్తి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే ఈ మహోత్సవానికి సమీప గ్రామాలే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుంటారు.

## రాష్ట్ర కనీస వేతనాలు బోర్డు డైరెక్టర్ విల్లాని అభినందించిన విశాఖ ఎంపీ ఎం భరత్



అగనంపూడి, ప్రభాతవార్త

రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు డైరెక్టర్గా నియమితులైన రాష్ట్ర టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు విల్లా రామ్మోహన్ కుమార్‌ని తన కార్యాలయంలో ఎం భరత్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక రంగంలో సుదీర్ఘకాలం కార్మికులకు విశిష్ట సేవలు అందిస్తూ, టిడిపికి అంకితభావంతో పనిచేసిన విల్లా రామ్మోహన్ రావుకి ఈ పదవి ఇవ్వడం సముచిత్తము అని అన్నారు. నక్కపల్లి, కడప లో స్టీల్ ప్లాంట్లు రావడం వల్ల విశాఖ ఉక్కు ఆంధ్రులు హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ఎటువంటి ఇబ్బంది లేదని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వాజ్పేయి ప్రధాని మంత్రిగా ఉన్నప్పుడు, నేడు నరేంద్ర మోడీ ప్రధానిగా ఉండగా వారి మద్దతుతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వవైభవం స్టీల్ ప్లాంట్ పరిరక్షించే సమర్థత మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఉన్నాదని అన్నారు. టిఎన్టియుసి నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ కొర్రాయి నాగార్జున కలిసి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమైన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కృషి చేసినందుకు అభినందనలు తెలియజేశారు. ఉక్కు కార్మికులకు, పదవీ విరమణ చేసిన స్వచ్ఛంద పదవి విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన పెండింగు జీతాలు, ఎలావున్సులు ఇవ్వాలని, విశాఖ జిల్లాలో కార్మిక సంక్షేమానికి కావలసిన శాశ్వత కార్మిక భవనం నిర్మించాలన్నారు. అగనంపూడి తలారువానిపాలెం రైల్వే బ్రిడ్జి అండర్ గ్రౌండ్ రహదారి ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగినది. సీనియర్ టిడిపి నాయకులు పివి వసంతరావు, రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు నన్నపనేని మల్లికా పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం

నర్సీపట్నం,మే 13,ప్రభాతవార్త



నర్సీపట్నం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పిల్లలు చేత కొంతసేపు నీతి కథలు చదివించారు. ప్రసాద్ మాస్టర్ చదరంగంలోని కొన్ని మెలకువలను, రాజుకి ఎలాగా చెక్ చెప్పాలో విద్యార్థుల కు వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ మాట్లాడుతూ ఈరోజు సర్ రోనాల్డ్ రాస్ జయంతి సందర్భంగా ఆయన కోసం విద్యార్థులకు వివరించారు. రోనాల్డ్ రాస్ బ్రిటిష్ వ్యక్తి అయినప్పటికీ భారతదేశంలో పనిచేస్తున్నప్పుడు మలేరియా అన్న వ్యాధి దోమల వల్ల వస్తుందని నిర్ధారించారు. ఆ వ్యాధి రాకుండా ఎలా నివారించాలో వివరించారు. ఉపాధ్యాయుడు ఎన్. నారాయణమూర్తి వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించి ఏమేమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రభాకర్ కొన్ని దేశాల పేర్లను జంబ్లింగ్ చేసి బోర్డు పైన రాశారు, వాటిని సరిచేసి రాయమన్నారు.

## సమ్మర్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందాలి

### క్రీడా సామాగ్రి కిట్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్



అనకాపల్లి మే 13, ప్రభాతవార్త

విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో సమ్మర్ క్యాంప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సందర్భంగా కశింకోట మండలం బయ్యవరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు సంబంధించిన క్రీడా సామాగ్రి కిట్స్‌ను విద్యార్థులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మే 1 నుండి మే 30 వరకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్న సంబంధిత గేమ్స్ కోచ్‌ను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పి.శైలజ, కోచ్ సిహెచ్ సూరి అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 42 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు

అచ్చుతాపురం, మే 13, ప్రభాతవార్త




అచ్చుతాపురంలోని బ్రాండిక్స్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 150వ ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా ఎంపికైన 42 మంది రోగులకు విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. బ్రాండిక్స్ ప్రాంగణంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో కంటి సమస్యల తో బాధపడుతున్న పలువురిని గుర్తించారు. వారిలో అత్యవసరంగా శస్త్రచికిత్సలు అవసరమైన 42 మందిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిపుణులైన వైద్య బృందం ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించింది. రెండు రోజుల పాటు అవసరమైన మందులు, వైద్య పర్యవేక్షణను ఉచితంగా అందించారు. చికిత్స అనంతరం కోలుకున్న రోగులను ప్రత్యేక వాహనాల్లో సురక్షితంగా తిరిగి బ్రాండిక్స్ ప్రాంగణానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రోగులకు పులిహోర, పెరుగు అన్నం పంపిణీ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించిన బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామి, సంస్థ సిబ్బందికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## హరిపాలెంలో ఘనంగా స్వచ్ఛ పథం కార్యక్రమం



అచ్చుతాపురం, మే13, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండలం పరిధిలోని హరిపాలెం గ్రామంలో బుధవారం "స్వచ్ఛ పథం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) గ్రామాభివృద్ధి, పరిశుభ్రత నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. గ్రామంలో తిరుగుతున్న "స్వచ్ఛ రథం" అవసరాన్ని ప్రజలకు వివరించి, ఇంటి వద్ద ఉన్న పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేస్తే, ప్రతిగా అవసరమైన వినియోగ వస్తువులు పొందవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.చిన్నారావు, ఇతర ఉన్నతా ధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ పరిశుభ్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించాలి

### పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు : జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్

అనకాపల్లి, మే 13, ప్రభాతవార్త



మే 21 నుండి జూన్ 4 తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయక్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమా వేశ మందిరంలో పోలీస్, విద్యుత్, వైద్య, విద్య, రవాణా తదితర అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 21వ తేదీ నుండి జూన్ 4వ, తేదీ వరకు ఉదయం, సాయంత్రం 25 పరీక్షా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల కేంద్రంలోకి హాల్ టికెట్, ఒరిజినల్ ఐడి ప్రూఫ్ తప్ప మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతింపబోమని అన్నారు. టాయిలెట్లు, వైద్య విద్యుత్, త్రాగు నీరు మౌలిక సదుపాయాలు పరిశీలన చేసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశిస్తూ సంబంధిత అధికారులను పరీక్షలు పారదర్శకంగా, జరిగేలా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యాశాఖ, పోలీసు, ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ, రవాణా ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## మహిళల భద్రతకు అందరూ సహకరించాలి

### నర్సీపట్నం టౌన్ సీఐ షేక్ గఫూర్



నర్సీపట్నం,మే 13,ప్రభాతవార్త

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని జోగినాధు పాలెం గ్రామంలో మహిళలు, చిన్నారుల భద్రతపై మంగళవారం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. నర్సీపట్నం టౌన్ సీఐ షేక్ గఫూర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల నివారణ, బాల్య వివాహాల నిరోధం, మహిళల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. అత్యవసర ా పరిస్థితుల్లో మహిళలకు ఉపయోగపడే శక్తి యాప్ వినియోగ విధానాన్ని వివరించారు. మొబైల్లో శక్తి యాప్ నమోదు చేసుకోవడం ద్వారా ప్రమాద సమయంలో వెంటనే పోలీసులకు సమాచారం చేరుతుందని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుమారు 100 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించి సమాజంలో శాంతి భద్రతలు కాపాడాలని అధికారులు కోరారు.

## శశికాంత్ ఆత్మహత్యకు ప్రేరేపించిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి



అనకాపల్లి, మే 13, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తానం గ్రామానికి చెందిన బాలుడు రాయుడు శశికాంత్ ఆత్మహత్యకు ప్రేరేపించిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే మారిష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మారేష్ మాట్లాడుతూ గత నెల 19వ తేదీన జరిగిన చిన్న వివాదంలో ఆ గ్రామానికి చెందిన ఆధిపత్య వర్గాలకు చెందిన వ్యక్తులు బాలుడుపై దాడి చేసి కొట్టి అవమానించగా అవమానాన్ని జీర్ణించుకోలేని బాలుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారని తెలిపారు. బాలుడు తన ఆత్మహత్యాయత్నానికి కారకులైన వ్యక్తుల పేర్లు తను బ్రతికుండగానే మరణ వాంగ్మూలంలో తెలియపరచారని చెప్పారు. రాయుడు శశికాంత్ ఆత్మహత్యకు ప్రేరేపించిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ ఈనెల 1వ తేదీన చలో ఎస్పీ ఆఫీస్ పేరుతో ప్రదర్శన, ధర్నా నిర్వహించి ఎస్పీకి వినతి పత్రం సమర్పించామని చెప్పారు. రోజులు గడుస్తున్న నిందితులను అరెస్ట్ చేయడంలో పరవాడ పోలీసుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అనకాపల్లిలో నిరసన దీక్ష శిబిరాన్ని ప్రారంభించామన్నారు. ఈ దీక్ష కొనసాగుతున్న సమయంలో పరవాడ డిఎస్పి దీక్ష శిబిరాన్ని సందర్శించి ఆందోళనకారులతో చర్చించారు. త్వరలో దోషులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు దీక్షలు విరమించడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచంద్రరావు, కసింకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు, సీనియర్ న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్, అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు కొణతాల హరినాథ్, బీసీ సంఘ నాయకులు బొడ్డేడ అప్పారావు, జిల్లా దళిత సంఘాల నాయకులు గోడు వెంకటేశ్వరరావు, తాతబాబు, కొల్లి సత్యారావు, చెక్క రాంబాబు, అనకాపల్లి జిల్లా యాత సంక్షేమ సంఘం నాయకులు ఎర్ర రాము తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై సంకల్పం 2.0

గొలుగొండ మే 13 ప్రభాతవార్త



మాదకద్రవ్యాల వినియోగం తద్వారా దుష్పరిణామాల పై కొత్త ఎల్లవరం పంచాయతీ రాజుపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్,రెవెన్యూ సంయుక్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో తహశీల్దార్ కాకర నూకరాజు, ఎస్ఐ పి.రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న నేరాలు మహిళలపై దాడులు తదుపరి పరిణామాలపై వివరించారు. ఉపాధి హామీ పథకం జరుగుతున్న పని వద్ద ఈ కార్యక్రమం నిర్వహించడంతో శ్రామికులు 300 పైగా మాదకద్రవ్యాలు తదుపరి దుష్ప్రభావం పై తెలియజేశారు. ప్రజలు చట్టాలపై, అవగాహన తద్వారా పొందే భద్రత అంశాలపై కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వో మణికంఠ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పోలీస్ మండల పరిషత్ రెవెన్యూ సహాయక సిబ్బంది శ్రామికులు పాల్గొన్నారు.

## మూలజంప డి-పట్టా రైతుల సమస్యలు పరిష్కరించాలి



యలమంచిలి, మే 13, ప్రభాతవార్త

రాంబిల్లి మండలం మూలజంప గ్రామ డి-పట్టా రైతుల సమస్యల పరిష్కారం కోసం యూనిట్ ఇన్చార్జ్ అందుకూరి ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు బుధవారం మునగపాక మండల ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వహించిన రీ- సర్వే సమయంలో డి-పట్టా రైతులకు సరైన కొలతలు వేయకపోవడంతో ఆయా భూములు మునగపాక మండల పరిధిలోకి వెళ్లిపోయాయని తెలిపారు, ఈ సమస్యపై కొన్నాళ్లుగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశామని అన్నారు, అనంతరం జిల్లా ఏడిఓ వచ్చి సర్వే నిర్వహించి భూములకు సర్వేనెంబర్ 59, ఎల్‌పిఎం నెంబర్ 882గా కేటాయించారు, అయినా ఇప్పటివరకు కొత్త పట్టాలు మంజూరు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా రైతులు రాంబిల్లి ఎమ్మార్వో సత్యనారాయణను కలిసి సమస్య వివరించగా మునగపాక మండల అధికారులకు రైతుల వివరాలు అందజేస్తే రెండు మండలాల పరిధిలో ఉన్న ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి పాత పట్టాల స్థానంలో కొత్త పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపారం పట్టా రైతులు పాల్గొన్నారు.

## గజ్జలమ్మ జాతర సందర్భంగా అవగాహన కార్యక్రమం

కసింకోట, మే 13, ప్రభాతవార్త




గజ్జలమ్మ జాతర సందర్భంగా కన్నూరు పాలెం గ్రామంలో "100 డేస్ యాంటీ డ్రగ్ 2.0" కార్యక్రమం కింద మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, మహిళల భద్రత, మహిళలపై జరిగే నేరాల నివారణతో పాటు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు సంబంధించి పోలీసులు తీసుకుంటున్న చర్యలు, మహిళలపై జరిగే నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్, డయల్ 112, 100, 1091 వంటి పోలీసు సేవలను వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశాఖ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

### -జూలై 22 నుంచి అమలు

విశాఖపట్నం, మే 13, ప్రభాతవార్త

విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం (18505/18506) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కూడిన కొత్త కూర్పును అమలు చేయనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ మార్పులు జూలై 22 నుంచి అమల్లోకి రానున్నాయి. విశాఖపట్నం నుంచి తిరుపతికి వెళ్లే 18505 ఎక్స్‌ప్రెస్ రైలు జూలై 22 నుంచి సవరించిన కూర్పుతో నడవనుండగా, తిరుగు దిశలో 18506 తిరుపతి-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ జూలై 23 నుంచి కొత్త కూర్పుతో ప్రయాణికులకు అందుబాటులో ఉండనుంది. సరికొత్త కూర్పులో మొత్తం 18 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఉండనున్నాయి. ఇందులో ఒక సెకండ్ ఏసీ, నాలుగు థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక థర్డ్ ఏసీ, ఆరు స్లీపర్ క్లాస్, నాలుగు జనరల్ కోచ్‌లు, ఒక సెకండ్ క్లాస్ కమ్ లగేజీ (దివ్యాంగజన్) కోచ్, ఒక లగేజీ జనరేటర్/బ్రేక్‌వాన్ కోచ్ ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రవేశపెడుతున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ కోచ్‌లు ఆధునిక సదుపాయాలతో పాటు మెరుగైన భద్రతా ప్రమాణాలు కలిగి ఉంటాయని అధికారులు వివరించారు.

vsp11:vsp11.qxd 13-05-2026 21:19 Page 1






## మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సివేరి అబ్రహం



అరకులోయ, మే 13, ప్రభాతవార్త : పాడేరులో బుధవా రం జరిగిన జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి,, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం మర్యాదపూర్వకంగా కలుస్తు న్నారు. పాడేరు మండలం లగిసపల్లి హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు సివేరి అబ్రహం మం త్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అబ్రహంను ఆప్యా యంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం



అరకులోయ, మే 13, ప్రభాతవార్త : అరకు లోయ మండలంలో బుధవారం సిపిఎం ఆధ్వ ర్యంలో ఆదర్శ వివాహం జరిగింది. పద్మాపురం పంచాయతీ బెడ్డగూడ గ్రామానికి చెందిన బడ్నా యక్ గాసి, చిన్నమ్మి దంపతుల కుమార్తె బడ్నా యక్ అమల మేరీకి, బొండం పంచాయతీ, జయం తి వలస గ్రామానికి చెందిన కిలో హరిదాసు, పార్వతి దంపతుల ప్రథమ కుమారుడు కిల్లో దాసు బాబుకు ఆదర్శ వివాహము సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు అధ్యక్షతన జరిపారు. వివాహ కర్త సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర వివాహాన్ని జరిపించారు. పెళ్లి పెద్ద వి. ఉమామహేశ్వరరావు, వివాహ కర్త కిల్లో సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో పోటీపడి కట్నాలు కానుకలు తో పెళ్లిళ్ల నిర్వహిస్తున్న ఈ సమాజంలో ఉన్నత చదువులు చదివి ఆదర్శ వివాహం చేసుకొని అందరికీ ఆదర్శవంతమైన జీవితం గడపాలని నిర్ణయం చేసుకున్న వధువులు వాసులకు తల్లిదండ్రులకు కుటుంబ పెద్దలకు ఈ సమాజంలో గుర్తింపు ఉంటుందని గుర్తు చేశారు. ఆదర్శ వివాహానికి అనేకమంది మేధావులు విద్యావంతులు ప్రోత్స హిస్తున్నారన్నారు. సమాజంలో నిరుపేదలైన ఆదివాసి గిరిజనుల సాంప్రదాయ బద్ధమైన పెళ్లిళ్ల రోజురోజుకి కనుమరుగవుతున్న చరణంలో ఆదర్శ వివాహం చేసుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. పద్మాపురం పంచాయతీ ఉప సర్పంచ్ జన్ని భగత్ రామ్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు గత్తుం బుజ్జి బాబు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, గిరిజన సంఘం మండల నాయకులు కొర్రా మగ్గన్న , పాంగి రామన్న,కిల్లో బజ్జి బాబు, కుమిడి అప్పన్న, తామల జోషి, చిట్టం నాయక్ గురుమూర్తి, వదువరువుల తల్లి తండ్రుల కిల్లో హరి దాసు,బడ్నాయక్ గాసి, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ లైన్ల కింద కర్రలు పాటి వాటికి తీగలు చుట్టరాదు : ఈఈ

పాడేరు, మే13, ప్రభాతవార్త: మోదకొండమ్మ వారి పండగ పురస్కరించుకొని చాలామంది కరెంటు లైన్ల కింద కర్రలు పాతి వాటికి తీగలు చుట్టి ఉన్నారు. అవి ఏమైనా కరెంటు వైర్లకు తగిలినట్లయితే యాక్సిడెంట్ అవ్వడానికి అవకాశం ఉంటుంది కావున కర్రలను, వైర్లను, కరెంట్ లైన్లకు కనీసం నాలుగు అడుగుల దూరంగా వెయ్యవలెను. లేనియెడల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన వాటికి విద్యుత్ శాఖ కు ఎటువంటి బాధ్యత వహించదనీ విద్యుత్ శాఖ పాడేరు ఈ ఈ పీ.వేణుగోపాల్ బుదవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసారు.ఎటువంటి కరెంటు స్తంభాలను గాని వైర్లను గాని ఎవరు ముట్టరాదు మరియు కరెంటు వైర్ల నుండి ఎటువంటి వైర్లు లాగరాదనీ ఈ ఈ విజ్ఞప్తి చేశారు. అమ్మవారి పండగలో ఎటువంటి విద్యుత్ సమస్యలు వచ్చిన క్రింది నెంబర్లకు సంప్రదించాలని ఈ ఈ సూచించారు. పాడేరు లైన్ మెన్ 9493527699, పాడేరు లైన్ ఇన్స్పెక్టర్ 9659853999 పాడేరు ఏఈ 9440816362, పాడేరు డి ఈ ఈ 9440812511, విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ 9490610027 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఈ ఈ వేణుగోపాల్ కోరారు.

## విత్తన శుద్ధి చాలా ముఖ్యం : శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్




పాడేరు,మే13, ప్రభాతవార్త: పసుపు పంటలో అధిక దిగుబడి, వ్యాధుల నివారణ కోసం విత్తన శుద్ధి చాలా ముఖ్యమైనదనీ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. పసుపు దిగబడుల్లో తీసుకోవాల్సి న జాగ్రత్తలు కోసం వంట్లమామిడి పంచాయతీ లో గల చోడిపల్లి గ్రామం లో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. .ముఖ్యంగా పసుపు విత్తన దుంపలను నాటే ముందు ట్రైకోడెర్మా ద్రావణంతో శుద్ధి చేయడం ద్వారా దుంప కుళ్ళు వంటి నేల ద్వారా వ్యాపించే శిలీంధ్ర వ్యాధులను నియంత్రించవచ్చునీ తెలియజేశారు. పద్ధతి ప్రకారం, 1 లీటర్ నీటిలో 10 మి.లీ లిక్విడ్ ట్రైకోడెర్మా కలిపి ద్రావణం తయారు చేసి ఆ ద్రావణంలో ప్రతిభ రకం పసుపు విత్తన దుంపలను 30 నిమిషాల పాటు నానబెట్టాలనీ సూచించారు. అనంతరం వాటిని తీసి 30 నిమిషాల పాటు నీడలో ఆరబెట్టాలి. ఇదే సమయంలో పొలాన్ని బెడ్ విధానంలో సిద్ధం చేయాలి. బెడ్ల ఎత్తు 15-20 సెం.మీ., వెడల్పు 1 మీటర్ ఉండేలా మరియు అవసరమైన పొడవుతో తయారు చేయాలనీ తెలియజేశారు. బెడ్లు సిద్ధమైన తర్వాత బాగా కుళ్లిన పశువుల ఎరువు ను బెడ్ పై సమానంగా పరచాలి. తరువాత ట్రైకోడెర్మా శుద్ధి చేసిన పసుపు విత్తన దుంపలను బెడ్లపై నాటాలి. నాటిన వెంటనే పొలంలో తేమ నిల్వ ఉండేందుకు మరియు కలుపు నియంత్రణకు ఎండిన గడ్డి తో మల్చింగ్ చేయాలి. ఈ విధానం వలన మొలక శాతం మెరుగుపడటంతో పాటు పంట ఆరోగ్యంగా పెరుగుతుందనీ సూచించారు. కార్యక్రమం లో స్పైస్ బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ కళ్యాణి, ఉద్యాన శాఖ అధికారులు శరణ్య మాధురి, శిరీష ,యమ్ ట్యాగ్ ఇండస్ట్రీస్ ప్రతినిధి రోజీ మరియు ఎన్ జి ఓ లు, రైతులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రాంతంలో పీసా చట్టాన్ని అమలు చేద్దాం



పాడేరు,మే13, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో బుదవారం ఆరు మండలాల పిసా ఉపాధ్యక్షులు కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయ వాది మరియు ప్రభుత్వ రాష్ట్ర కోఆర్డినేటర్ పిసా గ్రామసభ వ్యవహారాలు శాఖ పల్లా త్రినాదా రావు పాల్గొన్నారు. సుమారు 200 మంది ఉపాధ్యక్షులు కార్యదర్శులు ఆరు మండలాల నుండి పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో పాడేరు జి. మాడుగుల చింతపల్లి జికె వీధి, కొయ్యూరు నాతవరం మండలాల నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంలో పాడేరు డివిజన్ పిసా గ్రామసభ ఏర్పాటు చేసి అందులో డివిజన్ ఫారం అధ్యక్షులు కార్యదర్శి ని ఎంపిక చేసారు.పాడేరు డివిజన్ ఫోరం ఎన్నిక అధ్యక్షులు పాలికి లక్కు(పాడేరు). ఉపాధ్యక్షులు లకే రామకృష్ణ (జీ మాడుగుల) కార్యదర్శి సిద్ధార్థ మార్క్ (జీకే విధి) మహిళా కన్వీనర్ జెన్ని చిలకమ్మ (చింతపల్లి) సహాయ కార్యదర్శి వంజంగి రమేష్ నాయుడు (పాడేరు) కోశాధికారి జెరత్త జోగిరాజు (మాకవరం) సహా య కోశాధికా సోమేలి చిట్టిబాబు (పాడేరు) కార్యవర్గ సభ్యులు : సింహాచలం బాబు (పాడేరు) బి. రామకృష్ణ చింతపల్లి వాసు దేవరాజు (పాడేరు) అరుడ గాబ్రియల్ (జీకే వీధి) కోటికూరి దొరబాబు (చింతపల్లి), కొర్ర ఏసుబాబు (పాడేరు) ముట్టడం వెంకటరమణ (చింతపల్లి), పడవల నూకరాజు (నాతవరం) కె. చంద్రపతి (జి మాడుగుల),జి. పెద్దబ్బాయి (జి మాడుగుల,) డి రాజు (కొయ్యూరు), గొప్ప దేవుడు (కొయ్యూరు), సరళాబు మోహన్ రావు (పాడేరు) బద్నేని సింహాచలం (పాడేరు), సుర్ల రామకృష్ణ (పాడేరు), కొర్ర బలరాం (జికె వీది)దూరు బుజ్జన్న, లింగేరి సుందర్రావు (పాడేరు).ఎన్నికయ్యారు.

## ఆదివాసీల సమస్యలపై జిల్లా కోఆర్డినేటర్‌కు వినతి




గూడెం కొత్తవీధి, మే 13, (ప్రభాతవార్త) : పాడేరు నియోజకవర్గ కేంద్రంలో (పంచాయతీల షెడ్యూల్డ్ ప్రాంతాల విస్తరణ చట్టం) సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో గూడెం కొత్తవీధి మండలానికి చెందిన పెసా సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న పలు అన్యాయాలను, గిరిజనులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను ఈ సందర్భంగా వారు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా సాగిన ఈ భేటీలో, జీకే వీధి మండల పెసా ప్రతినిధులు జిల్లా పెసా కోఆర్డినేటర్ ఈశ్వర్ ని కలిసి తమ ప్రాంత సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం, గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ ప్రాముఖ్యత కలిగిన సమావేశంలో జీకే వీధి మండల పెసా ఫోరమ్ ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రముఖుల కొర్ర బలరాం జీకే వీధి మండల శినిలీతి ఫోరమ్ అధ్యక్షులు, లకే రామచంద్రుడు మండల పిసా కోశాధికారి, బత్తుల సిద్ధార్థ మండల పిసా ఉపాధ్యక్షులు, రీమల కోటి ముఖ్య సభ్యులు, కె. మనోజ్, ఎమ్.వెంకటేశ్, అరడ గాబ్రియేల్ పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో చట్టాల అమలు తీరు, స్థానిక వనరులపై ఆదివాసీల కు ఉన్న హక్కుల రక్షణ కోసం ఈ కమిటీ నిరంతరం పోరాడుతుందని, అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు సమస్యలపై దృష్టి పెడతామని ఈ సందర్భంగా ప్రతినిధులు స్పష్టం చేశారు.

## జనగణన హౌస్ లిస్టింగ్ ఎన్యుమరేషన్ పనుల పర్యవేక్షణ



అరకు రూరల్, మే 13, ప్రభాతవార్త: జనగణన కార్యక్రమంలో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాకుల ఎన్యూమరేషన్ సర్వే పనుల పర్యవేక్షణను ఈరోజు అరకులోయ మండలంలో నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో వీసం ప్రసాద్, మండల రెవెన్యూ అధికారి మరియు ఛార్జ్ సెన్సెస్ అధికారి కె. కుమారస్వామి పద్మాపురం గ్రామపం చాయతీ పరిధిలోని యండపల్లివలస గ్రామంలో ఎన్యూమరేషన్ సర్వే పనులను పరిశీలించారు. పర్యవేక్షణ సందర్భంగా మండలంలో ఇంకా కొన్ని హెచ్ ఎల్ బి లలో ఎన్యూమరేషన్ పనులు పూర్తిస్థాయి లో జరగలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు ఎంపీడీవో, మండల రెవెన్యూ అధికారి మరియు ఛార్జ్ సెన్సెస్ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక సూచనలు జారీ చేయబడ్డాయి. పెండింగ్‌లో ఉన్న హెచ్ ఎల్ బి లను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని నిర్ణీత గడువులోపు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేసి, అర్హులైన ఏ కుటుంబం కూడా మిగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సూపర్వైజర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించి రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, నమోదు చేసిన వివరాలను పరిశీలించి సరైన డేటా నమోదును నిర్ధారించాలని ఆదేశించారు. ఎంపీడీవో వీసం ప్రసాద్, మండల రెవెన్యూ అధికారి మరియు ఛార్జ్ సెన్సెస్ అధికారి కె. కుమారస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. శంకరరావు, పద్మాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి వై. పాత్రుడు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ చట్టం చెయ్యాలి



పాడేరు, మే 13, ప్రభాతవార్త: పాడేరులో పర్యటించిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆదివాసీ గిరిజన సంఘం, డీఎస్సీ సాధన కమిటీ నాయకుల బృందం పొద్దు బాలదేవ్, ఎస్ ధర్మన్నపడాల్, కూడా రాధాకృష్ణ లగుసుపల్లి హెలిప్యాడ్ వద్ద కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసులకు రాష్ట్ర ప్రభుత్వం 100 రిజర్వేషన్ కల్పిస్తామన్నా హామీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని 5వ షెడ్యూల్ ఆర్టికల్14,15, మరియు 16 ప్రకారం 100 శాతం రిజర్వేషన్ ఆదివాసులకు ఇచ్చి 9వ షెడ్యూల్ చేర్చాలని ఆదివాసి షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఇవ్వాలని విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీ 11 మండలాలు అల్లూరి సీతారామరాజు జిల్లాగా ఏర్పడిందని అసస్త్రీయంగా అల్లూరి జిల్లాలో జోన్ 2 లో చేర్చడం ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని జోన్ 1 లో చేర్చాలని ఆదివాసి ప్రాంతాన్ని జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు జారీ చేసిన జీవో నెంబర్ 2 ,13 ,51 ద్వారా బడా కార్పొరేట్ అదాని నవయుగ కంపెనీలకు ఆదివాసుల హక్కులు చట్టాలు ధిక్కరించి అల్లూరి జిల్లా అనంతగిరి, అరకువేలి,హుకుంపేట,చింతపల్లి ,కొయ్యూరు ,జికె వీధి మండలాల్లో 25 పంచాయితీ పరిధిలో 60 వేల మంది ఆదివాసులు 20 అటవీ భూమి వేల ఎకరాల జిరాయితి భూమి వందల ఎకరాల కాఫీ తోటలు వన్యప్రాణులు జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు జారీ చేసిన జీవోలు రద్దు చేయాలని పివిటిజల పీఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు పెంచుతూ జీవో జారీ చేసిందని కానీ నేటికి నిధులు విడుదల చేయలేదని తక్షణమే పెంచిన లక్ష రూపాయలు నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని ఏకలవ్య పాఠశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయులకు రెన్యువల్ చేసి కొనసాగించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏకలవ్య గురుకులం పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సొసైటీ ప్రకటించిన 17వేల 475 చెల్లించాలని గేటు వద్ద సెక్యూరిటీ గార్డులకు వసతి కల్పించి రక్షణ పరికరాలు పంపిణీ చేయాలని రాష్ట్రంలో 4 ఐటీడీఏల పరిధిలో పనిచేస్తున్న మాతృ బహుభాషా ఉపా ధ్యాయులకు రెన్యువల్ చేయాలని జీతభత్యాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని మాతృభాష ఉపాధ్యాయు లకు రెగ్యులర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయాలని వారు కోరారు.

## 25,26 తేదీల్లో దేశ వ్యాప్త బ్యాంకుల సమ్మె

### అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణికి వినతిపత్రం అందజేత



పాడేరు,మే13, ప్రభాతవార్త: అఖిల భారత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 25, 26 తేదీల్లో చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు కోరుతూ అనకాపల్లి రీజి యన్ ఎస్‌బిఐ ఉద్యోగుల ప్రతినిధి బృందం అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనుజా రాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న సమస్యలను, ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ఎంపీకి వివరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం కోసం చేపడుతున్న ఈ పోరాటం ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతినిధుల వివరణపై సానుకూలంగా స్పందించిన ఎంపీ తనుజా రాణి, ఉద్యోగుల సమస్యల పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాలను లేవనెత్తి, బ్యాంకు ఉద్యోగులకు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు.ఎంపీ నుంచి లభించిన ఈ మద్దతు ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేసిందని, న్యాయం సాధించే దిశగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అనకాపల్లి రీజనల్ సెక్రటరీ పైల ప్రసాదరావు పేర్కొన్నారు. రీజనల్ సెక్రటరీ పైల ప్రసాదరావుతో పాటు యూనియన్ సభ్యులు జె. కళ్యాణ్ కుమార్, పి.వి. మురళీధర్, వి. అరుణ్ కుమార్, పి. సురేంద్ర నాథ్, డి.ఎం.ఎన్. శ్రీనివాస్, క్రాంతి, వి.కుమార్, కృష్ణ ప్రసన్న, అనిల్ కుమార్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత : ఎంపీడీవో



అరకురూరల్, మే 13, ప్రభాత వార్త : మండలంలో ప్రతి బుధవారం గ్రామపంచాయతీలో స్వచ్ఛపథం కార్య క్రమంలో భాగంగా ఈరోజు పెదలబుడు గ్రామపంచా యతీలో స్వచ్ఛ పథం" పారిశుధ్య కార్యక్రమం విజయ వంతంగా నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమం దొరవారి హోటల్ నుండి దొరవారి వీధి, ఏరియా హాస్పిటల్ రోడ్ మీదుగా సరభగూడ హౌసింగ్ కాలనీ వరకు నిర్వహిం చబడింది. సుమారు 1.5 కిలోమీటర్ల పరిధిలో నిర్వహిం చిన ఈ పారిశుధ్య కార్యక్రమంలో స్థానిక ప్రజలు చురుకుగా పాల్గొని పరిసరాల పరిశుభ్రతకు సహకరిం చారు. నివాస ప్రాంతాలలో రోడ్లలోనూ, వీధుల్లో చెత్త,శుభ్రత నిర్వహణ చేపట్టారు. గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు పారిశుధ్య కార్యక్రమాలలో నిరంతరం భాగస్వాములు కావాలని ,ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీసం ప్రసాద్ డిప్యూటీ ఎంపీడీవో కెవి సత్యనారాయణ, గ్రామస్తులు పారిశుద్ధ కార్మికులు,క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

## హెలిప్యాడ్ వద్ద లోకేష్‌కు ఘన స్వాగతం



పాడేరు, మే 13, ప్రభాతవార్త: పాడేరులో టీడీపీ నాయకుడు వివాహానికి వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ,ఐటీ మంత్రి నారా లోకేష్‌కు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ఇంచార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, ఎస్పీ,ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు, టిడిపి ముఖ్య నాయకులు.

## జిల్లా అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్



పాడేరు,మే13, ప్రభాతవార్త: విజయవాడలో తేది 7,8 లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో వెల్లడించిన ఆదేశాల మేరకు, జిల్లా ప్రగతికి సంబంధించి వివిధ శాఖల అధికారులు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శాఖల వారీగా అభివృద్ధి ప్రణాళిక ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కాన్ఫరెన్స్ సమీక్షించిన, అలాగే జిల్లాకు సంబంధించిన అంశాలను అధికారులతో ప్రస్తావించారు.ముఖ్యమంత్రి ఆదేశాల, అమలు, సలహాలు, సూచనలు రాష్ట్ర రాజధానిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నిర్దేశించిన ప్రాధాన్యత రంగాలపై తక్షణమే దృష్టి సారించాలని, ఆయా శాఖల వారిగా ప్రగతి నివేదికలు, జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు మరియు భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా లో విద్య, వైద్యం, వ్యవసాయం మరియు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకుండా లక్ష్యాలను చేరుకోనేల క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరిపి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి అన్ని శాఖల సమన్వయం ఎంతో అవసరమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. "ప్రభుత్వ లక్ష్యం ప్రజల సంక్షేమమేనని ముఖ్యమంత్రి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, జిల్లా ప్రగతికి ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల ప్రగతి పురోగతి ఏ స్టేజిలో ఉన్నవి పెండింగ్ పనులపై సమగ్ర నివేదిక రూపొందించి శాఖలకు నిర్దేశించిన గడువులోపు అందించాలని ఆదేశించారు. సమావే శంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మెయిన్‌రోడ్డులో లైటింగ్ ఏర్పాటు



పాడేరు,మే13, ప్రభాతవార్త: పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మెయిన్ రోడ్డు ఇరువైపులా విద్యుత్ లైటింగ్ అలంకరణ ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల17,18,19 తేదీల్లో అమ్మవారి జాతర మహోత్సవం జరగనుంది.

## రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టిన కారు .. ఒకరి మృతి



పాయకరావుపేట మే 13 ప్రభాతవార్త: పాయకరావుపేట మండలం నామవరం గ్రామం దగ్గరజాతీయ రహదారిపై తుని నుండి విశాఖపట్నం వెళ్తున్న జి జే 17 ఏ హెచ్4955నెంబర్ గల షిఫ్ట్ తెలుపు రంగు కారుకి ఎదురుగా ప్రయాణిస్తున్న స్ప్లెండర్ మోటార్ సైకిల్ లిస్ట్ హఠాత్తుగా బ్రేక్ వేయుట వలన స్పీడ్ గా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టి బోల్తా పడినందున కారులో ప్రయాణిస్తున్న ఇరువురి ప్రయాణికులకు గాయములు అయినందున 108 సహాయంతో తుని గవర్నమెంట్ ఆసుపత్రి యందు చికిత్స నిమిత్తం చేర్పించడం జరిగినది. కారు డ్రైవరు రాధా అలీ సామ అను వ్యక్తి చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మృతి చెందినాడు. కారులో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తి ఈరోజు కోలుకొని ఇచ్చిన సమాచారానికి సంబంధించి గుజరాత్ రాష్ట్రం కచేరి జిల్లా నామ బంధ నావా ఆవాస్ గ్రామం కు సంబంధించిన వాళ్ళుగా తెలియజేయడమైనది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే వ్యవసాయానికి సంబంధించిన మందుల వ్యాపార నిమిత్తం తుని నుండి శ్రీకాకుళం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని కారులో ప్రయాణిస్తున్న రెండో వ్యక్తి తెలియజేయడమైనది ఈరోజు మధ్యా హ్నం కోలుకొని ఇచ్చిన సమాచారం మేరకు మృతిని అన్నయ్యకు గుజరాత్ సమాచారం తెలియజేసి పాయకరావుపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ఆదర్శ గ్రామాలుగా గుర్తించాలి : కలెక్టర్




పాడేరు,మే13, ప్రభాతవార్త: జిల్లాలో ప్రైమరీ సెక్టార్ శాఖలా అధికారులతో ఆర్గానిక్ పై రోడ్డు మ్యాప్ తయారీ చేయుటపై జిల్లా ఐకలతో జిల్లా కలెక్టర్ నిశాంతి ప్రత్యేక సుమావేశం నిర్వహించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో శ్వీళీళీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.బాబురావు నాయుడు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్. భాస్కర్, వ్యవసాయ అధికారి మరియు జిల్లా స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ వేగవంతం చెయ్యాలని, అందుకు సంబంధించిన అమలుపై అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసి, విస్తృత స్థాయిలో అమలు చేయాలని, అల్లూరి జిల్లా లోని ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శ జిల్లాగా తీర్చి దిద్దాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఆదాయాభివృద్ధి, భూసార పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి కోసం ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని వేగంగా విస్తరించేందుకు జిల్లా ఉన్నత అధికారులు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, ఐసీడీఎస్, విద్య ఇతర అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు, రైతు శిక్షణలు, ప్రదర్శన క్షేత్రాలు, ప్రకృతి వ్యవసాయ నమూనాలు ఏర్పాటు చేయడంతో పాటు, రైతులకు అవసరమైన శిలీదీళీ, విత్తన శుద్ధి, విత్తన గుళికలు, జీవామృతం, ఘన జీవామృతం, వంటి సహజ వ్యవసాయ పద్ధతులపై ప్రోత్సాహం కల్పించాలని ఆమె సూచించారు. జిల్లాలో సహజ వ్యవసాయం లక్ష్యాలను సాధించేందుకు శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, క్రమం తప్పకుండా పురోగతిని సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# 16లోగా గ్యాస్ బ్యాక్‌లాగ్‌లు తగ్గేలా ప్రణాళిక

**- ఆయిల్ కంపెనీలతో యంత్రాంగానికి సమన్వయం అవసరం**

**- పవర్ సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహార్**

**సచివాలయం,మే 13,ప్రభాతవార్త:** గ్యాస్ సరఫరా బ్యాక్‌లాగ్స్ ఇంకా కొన్ని జిల్లాల్లో అధికంగా కనిపిస్తున్నాయి. ఈనెల 16వ తేది నాటికి బ్యాక్ లాగ్స్ పూర్తి చేస్తామని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆయిల్ కంపెనీలు గ్యాస్‌ను డిస్ట్రిబ్యూటర్లకు అప్పగించే వరకు బాధ్యత వహిస్తారు. దాని తర్వాత ప్రజలకు సక్రమంగా గ్యాస్ అందేలా యంత్రాంగం పటిష్టంగా పనిచేయాలి. అప్పుడే గ్యాస్ బ్యాక్ లాగ్స్ తగ్గుతాయని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. అయిల్ కంపెనీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని, క్షేత్రస్థాయిలో తనిఖీలు, పరిశీలనలు చేస్తేనే సరఫరా చైన్ సక్రమంగా ముందుకు సాగుతుందన్నారు. ఈనెల 16వ తేది నాటికి అన్ని జిల్లాల్లోనూ గ్యాస్ బుక్ చేసిన 4నుంచి 5రోజుల్లోగా డెలివరీలు అయ్యే పరిస్థితి ఉండాలని, దీనికి అనుగుణంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఎల్‌పిజి బ్యాక్ లాగ్స్, పిడిఎస్ బియ్యం అక్రమం రవాణా నిరోధం, పెట్రోలు బంక్‌ల నిత్య పర్యవేక్షణ వంటి అంశాలపై జిల్లాల పౌరసరఫరాల శాఖాధికారులతో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ బ్యాక్ లాగ్స్ అధికంగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి, ఏలూరు, అనకాపల్లి, విశాఖపట్నం, గుంటూరు తదితర జిల్లాల్లో బ్యాక్ లాగ్స్ అధికంగా ఉన్నాయి. కొన్ని డిస్ట్రిబ్యూటర్లలో 5వేలకు పైబడి బ్యాక్ లాగ్స్ పెండింగ్ ఉన్నాయి. అలాంటి డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు అవసరం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న ఆందోళనల ఫలితంగా ఏర్పడిన ఆయిల్ కొరత సమస్యను సమిష్టిగా పనిచేసి సాధారణ స్థితికి తీసుకొచ్చాం. ఏప్రాంతంలో అయిన పెట్రోలు బంక్‌లు డ్రై అవుట్ అయితే వెంటనే స్పందించేలా పనిచేయండి. ప్రతి పెట్రోలు బంక్ వద్ద కూడా "తగినంత నిల్వలున్నాయి. ఆందోళన చెందకండి తగినంతగా మాత్రమే ఇంధనం పట్టుకోండి అని వాహనదారులకు చైతన్యం కలిగించేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయండి. దీంతో ప్రజల్లో అనవసర భయాందోళనలు తొలగిపోతాయి. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో అన్ని జిల్లాల పౌర సరఫరాల శాఖాధికారులు ప్రత్యేకమైన టాస్క్ ఫోర్సులను వెంటనే ఏర్పాటు చేయండి. ముఖ్యంగా గోదాముల నుంచి రేషన్ దుకాణాల నుంచి పిడిఎస్ అధికంగా అక్రమ మార్గంలో తరలిపోతుందనే సమాచారం ఉంది. అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జీలను గుర్తిస్తే వెంటనే చర్యలకు సిఫార్సు చేయండి. జిల్లాల ఎస్పీలను సమన్వయం చేసుకొని పీడి యాక్టును నమోదు చేయండి.

ఏ జిల్లా అధికారులు ఎలా పనిచేస్తున్నారో గుర్తించేలా ప్రధాన కార్యాలయం నుండి ప్రత్యేక మానిటరింగ్ సెల్ పనిచేస్తుంది.

నాణ్యత లేని సరుకులు కొన్ని జిల్లాల్లో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ జరుగుతోందనే సమాచారం వస్తుంది.



# నేడు అనంతకు మంత్రి నారాలోకేష్

**- బత్తలపల్లిలో ఆర్డిటి ఆసుపత్రి సందర్శన**

**- అనంతపురం అర్బన్‌లో టిడిపి కార్యకర్తల సమావేశం**

**అనంతపురం, మే 13 ప్రభాతవార్త బ్యూరో** టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ గురువారం శ్రీ సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డిటి బత్తలపల్లిలో నిర్వహిస్తున్న ఆసుపత్రిని నారాలోకేష్ సందర్శించడంతోపాటు ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ దంపతులను సన్మానించనున్నారు. ఆర్డిటికి విదేశీ సంస్థల నిధులు వచ్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎఫ్‌సిఆర్ఏ లైసెన్స్ మంజూరుకు మంత్రి నారాలోకేష్ ఇతర టిడిపి ముఖ్యులు గట్టి ప్రయత్నం చేసిన నేపథ్యంలో నారాలోకేష్ జిల్లా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కార్యకర్తల సమావేశంలో కూడా నారాలోకేష్ పాల్గొంటున్నారు. గ్రూపు రాజకీయాలతో సతమతమయ్యే టిడిపి అర్బన్ నియోజకవర్గంలో నారాలోకేష్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి నారాలోకేష్ ప్రత్యేక హెలీ క్యాప్టర్‌లో పుట్టపర్తి విమానాశ్రయానికి గురువారం సాయంత్రం 4:00 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లిలోని ఆర్డిటి ఆసుపత్రిని సందర్శిస్తారు. ఆ తర్వాత మీడియా సమావేశంలో పాల్గొంటారు. తదనంతరం అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో గురువారం రాత్రి 7:30 నుంచి అనంతపురం అర్బన్ నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాలోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధర్మవరంలోనూ, బత్తలపల్లిలోనూ భారీఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లను టిడిపి కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేశారు. దర్మవరం నియోజకవర్గంలో ఘనంగా నారాలోకేష్‌కు స్వాగతం పలికేందుకు టిడిపి వర్గీయులు సన్నాహాలు చేస్తున్నారు. అదే సమయంలో అనంతపురం అర్బన్‌లో నారాలోకేష్ పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేతృత్వంలో సన్నాహాలు చేస్తున్నారు.



## ప్రధాని చెప్పిన పొదుపు చర్యలు పాటించాలి : సీఎం చంద్రబాబు

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రకటించిన పొదుపు చర్యలపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రధాని ప్రకటించిన 8 అంశాలను పాటించాలని ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు "ఎక్స్" వేదికగా పిలుపునిచ్చారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించిన ముఖ్యమంత్రి యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని సీఎం అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు.. పౌరులు కూడా బాధ్యతగా ఉండాలన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 8 అంశాలను మనం పాటించాల్సి అవసరాన్ని గుర్తించాలన్నారు. తాత్కాలికంగా వచ్చే ఇబ్బందులు అధిగమించాలంటే పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలి అన్నారు. దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది అన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటి. ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తుంది. దీనిని ప్రోత్సహించాలి అన్నారు. ప్రభుత్వం లోనూ ఈ తరహా విధానాన్ని అమలు చేసే పరిస్థితులు వస్తాయి అన్నారు. దేశం మొత్తం దుబారాను తగ్గించాలి అన్నారు. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లటం అందరికీ చాలా పెద్ద ఫ్యాషన్ గా మారింది అన్నారు. కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి అన్నారు. సెక్యూరిటీని కూడా కుదించుకోవాలి అన్నారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని సూచించారు అన్నారు. దీనిని కూడా పాటిద్దాం. మన దేశంలో, రాష్ట్రంలోనూ మంచి పర్యాటక ప్రాంతాలున్నాయి. ప్రజలు విదేశాలకు వెళ్లడం కంటే మన పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలి. నాదేశం నా బాధ్యత అనే ఆలోచన ప్రజలంతా చేయాలి అన్నారు.. రెండు రోజుల్లో దీనిపై చర్చించి స్పష్టమైన చేస్తాంఅన్నారు. బంగారం కొనడాన్ని కూడా తగ్గించాలని ప్రధాని చెప్పారు. దీనిపైనా ప్రజలు ఆలోచన చేయాలి అన్నారు.

# రాష్ట్రంలో తిరుపతి, విశాఖపట్నం 'ఐకానిక్ టూరిజం హబ్స్'గా అభివృద్ధి

**- కొత్త పర్యాటక పాలసీ ద్వారా ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట: మంత్రి కందుల దుర్గేష్**

**తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో కొత్త పర్యాటక పాలసీ ద్వారా ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామని, పారిశ్రామిక హోదాతో పర్యాటకానికి ప్రోత్సాహమిచ్చి ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటకశాఖ ,సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తిరుపతిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. భక్తులకు కేవలం దర్శనమే కాకుండా, ఆధ్యాత్మిక అనుభూతిని పెంపొందించేలా ఎకో అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ ప్రణాళికలను ఆయన బుధవారం ఉదయం తిరుమల ఆలయం ముందు మీడియాప్రతి నిధులకు వివరించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, తిరుపతిలో అధునాతన వసతులు, స్టార్ హోటళ్ల నిర్మాణానికి ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో తిరుపతి, విశాఖపట్నం నగరాలను అంతర్జాతీయ స్థాయి "ఐకానిక్ టూరిజం హబ్స్"గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే తిరుపతిలో సుమారు ఆరు స్టార్ హోటళ్ల నిర్మాణానికి పీపీపీ విధానంలో ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు. తిరుపతికి వచ్చే భక్తులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, రెండుమూడు రోజుల పాటు ఇక్కడే బసచేసేలాప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం తిరుపతి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడం కోసం ఎకో టూరిజం, సాహస క్రీడలు ఏర్పాటుచేస్తూ అడ్వెంచర్ టూరిజం వంటి వినూత్న అంశాలను అభివృద్ధి చేస్తామన్నారు.. పర్యాటకులు ఇక్కడ ఎక్కువ కాలం గడిపేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. బుధవారం ఉదయాన్నే ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకోవడం జన్మధన్యంగా భావిస్తున్నానని మంత్రి దుర్గేష్ విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. బుధవారం ఉదయం మంత్రి దుర్గేష్ నిడదవోలు నియోజకవర్గ నేతలతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఒంగోలు లాడ్జిలో మహిళా ఉద్యోగిని దారుణ హత్య

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త** ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో మహిళా ఉద్యోగిని దారుణ హత్యకు గురైన ఘటన తీవ్ర సంచలనం రేపింది. నీటిపారుదల శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న బొల్లేటిపల్లి ఆదిలక్ష్మి (35) మంగళవారం నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పలుచోట్ల గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో ఆమె కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు లాడ్జిలోని గదులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. ఒక గది బయట నుంచి తాళం వేసి ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు డూప్లికేట్ తాళంతో తలుపు తెరిచారు. గది లోపలికి వెళ్లిన పోలీసులు రక్తపు మడుగులో గొంతు కోసిన స్థితిలో ఆదిలక్ష్మి మృతదేహాన్ని గుర్తించి దిగ్భ్రాంతికి గురయ్యారు. హత్య జరిగిన తీరును బట్టి నిందితుడు అత్యంత క్రూరంగా వ్యవహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆమెకు సన్నిహిత సంబంధం ఉన్న వ్యక్తి లేదా బంధువే ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఒకటో పట్టణ సీఐ కె.వెంకటేశ్వరరావు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణులు గదిని పరిశీలించి వేలిముద్రలు, ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదిలక్ష్మి హత్య వార్త తెలిసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రశాంతంగా ఉండే ఒంగోలు నగరంలో ఈ ఘటన తీవ్ర భయాందోళనలకు గురి చేసింది.

# పుట్టపర్తిలో ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ కేంద్రం

**లక్ష కోట్ల భారీ డిజైన్స్ ప్రాజెక్టు - వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు :పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు

**పుట్టపర్తి టౌన్, మే 13, ప్రభాతవార్త** సత్యసాయి జిల్లా పుట్టపర్తి దేశ రక్షణ రంగంలో కీలక కేంద్రంగా అవతరించబోతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తిలో 650 ఎకరాల్లో రూ. లక్ష కోట్ల వ్యయంతో ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు కావడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో భారత రక్షణ రంగానికి చెందిన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు సత్యసాయి జిల్లాకు రావడం ప్రజలకు గర్వకారణమని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. అంతేకాకుండా ఆమడగూరు మండలంలో 5 వేల మెగావాట్ల సామర్థ్యంతో రూ.51 వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న రిలయన్స్ సోలార్ పవర్ ప్రాజెక్టు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానుందని అన్నారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలు తీసుకురావడంలో కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ కి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 15న పుట్టపర్తిలో జరగనున్న యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సీఎం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, జిల్లా అధికారులు బుధవారం పరిశీలించారు.

### శుభకార్యానికి వెళ్లి వస్తుండగా బొలెరో బోల్తా

## బాలుడు మృతి, పది మందికి గాయాలు

**మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఘటన**

**మహబూబ్‌నగర్,మే 13:** శుభకార్యానికి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందగా పదిమందికి తీవ్ర గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామం నుంచి పాతమొల్లగ్ర గ్రామానికి పెళ్లి వేడుకకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో డ్రైవర్ నిరక్ష్యం వల్ల జిల్లాకేంద్రం సమీపంలోని క్రిస్టియన్‌పల్లి వద్ద కలెక్టరేట్ కార్యాలయం ఎదు రుగా ప్రధాన జాతీయ రహదారిపై ఒక్కసారిగా బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో బొలెరోలో సుమారు 15 మంది ప్రయాణిస్తుండగా ధమగ్నాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు (8) మృతి చెందాడు. ఈఘటనలో సుమారు పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను మహబూబ్‌నగర్‌జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. ప్రమాదఘటనతో పెళ్లి కుటుంబంలో అటు ధమగ్నాపూర్ గ్రామం.

## ట్రాఫిక్ ఎస్ఐ సర్వీస్ నుంచి డిస్మిస్

**మహిళ పై వేధింపుల వివాదమే కారణం**

**కర్నూలు, మే 13, ప్రభాతవార్త :** కర్నూలు నగరంలో ట్రాఫిక్ ఎస్ ఐగా పని చేస్తున్న హరిప్ర సాద్ను డిస్మిస్ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐకి వివాహమై పిల్లలు ఉన్నప్పటికీ మరో యువతితో వివాహేతర సంబం ధం కొనసాగించారు. దీనిపై యువతి కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు హరిప్రసాద్ను విధుల నుంచి తొలగించారు. వైఎస్సార్ కడప జిల్లా రాజు పాలేనికి చెందిన హరిప్రసాద్ 2012లో ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిం చారు. పది రోజుల క్రితం నంద్యాల జిల్లా నుంచి కర్నూలు ట్రాఫిక్ విభాగానికి బదిలీపై వచ్చారు. హరిప్రసాద్కు యువతితో వివాహేతర సంబంధం విషయంలో రెండు నెలలుగా ఇరు కుటుంబాల మధ్య వివాదం కొనసాగుతోంది. చివరకు యువతి కుటుంబ సభ్యులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణ జరిపించి డిస్మిస్ చేశారు. కాగా, హరిప్రసాద్ ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐగా పనిచేసే సమయంలో కూడా ఆయనపై అనేక ఆరోపణలు రావడంతో అధికారులు శాఖాప రమైన చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వ్యక్తి ట్రాక్టర్లో ఇసుక తరలిస్తుం డగా చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద పట్టుకుని పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ.. సెల్ఫీ వీడియోను మంత్రి లోకేశ్కు పంపారు. దీనిని తీవ్రంగా పరిగణించిన డీజీపీ ఎస్పీ హరిప్రసాద్ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో డీఐజీ ఆయన్ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ తొల గించిన తర్వాత చిత్తూరు జిల్లాలో కొంతకాలం పనిచేశారు. ఇటీవలే కర్నూలు జిల్లాకు వచ్చిన ఆయన కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

# టెట్ రివ్యూపిటిషన్ తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు

**హైదారాబాద్,మే 13,ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పని సరి ఆదేశంపై వేసిన రివ్యూపిటేషన్ తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. బుధ వారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష 2010కి పూర్వం నియామకమైన ఉపాధ్యా యులకు వర్తింప చేయడం న్యాయసమ్మతం కాదనీ ఎఐపిటిఎఫ్ న్యాయవాదల బృందం సుప్రీంకోర్టులో సీనియర్ లాయర్లు అభిషేక్ మనుసింఘ్వీ, ముకుల్ రోహిత్‌గీ వాదించారు. బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటలపాటు టెట్ తప్పనిసరి అనే ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఎఐపిటిఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వినోద్‌తాకరాణ్‌సీమాథూర్, నిషాదహియా, ప్రాథమిక ఉపాధ్యయసంఘం తెలంగాణ ఉపప్రధాన కార్యదర్శి దీపక్‌పంత్‌లు వేసిన పిటిషన్‌లో దేశంలోని 25లక్షల మంది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉన్నతన్యాయస్థానంను అభ్యర్థించారు. 2012లో ఎసిటిఇ మార్గదర్శకాలు విడుదల చేశారని దాని తరువాత2017లో ఆర్‌టిఇ సవరణ చేశారని దానికి ముందు నియామకమైనవారికి ఎలా వర్తింపచేస్తారని వారు న్యాయస్థానం ముందు గోడు వెల్లగక్కారు. టెట్‌గడువును

రెండు సంవత్సరాల నుంచి నాలుగు సంవత్సరాలకు పెంచాలని న్యాయవాదులు కోరారు.

# బక్రీద్ నేపథ్యంలో భారీగా శాంతి భద్రతల ఏర్పాట్లు

**అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్లతో డిజిపి విడియో కాన్ఫరెన్స్**



బక్రీద్ నేపథ్యంలో శాంతి భద్రతలపై ఎస్‌పిలు, కమిషనర్లతో బుధవారం డిజిపి సి.వి,అనంద్ విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన జరగనున్న బక్రీద్ నేపథ్యంలో జంతువుల తరలింపులో ఎలాంటి సమస్యలు రాకుండా చూడడం, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకునే విషయమై డిజిపి సి.వి ఆనంద్ బుధవారం నాడు అన్ని జిల్లాల ఎస్‌పి లు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపి కార్యాలయంలో డిజిపి ఆనంద్‌తో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి సహా ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆనంద్ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా జంతువుల అక్రమ రవాణాను కచ్చితంగా అడ్డుకోవాలని కోరారు. సున్నితమైన ఈ అంశంపై పోలీసులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయంతో మెలగాలని డిజిపి ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఎక్కడ గొడవలకు తావులేకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఇటీవల పలుచోట్ల పశువుల అక్రమ రవాణా వెలుగు చూసిందని, ఈ నేపథ్యంలో అన్నిచోట్ల స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి)ని పక్కాగా అమలు చేయాలని ఎస్‌పిలు, కమిషనర్లను ఆయన ఆదేశించారు. పశువుల రవాణా విషయంలో కొ స్లాటర్ యాక్ట్ 1977, ట్రాన్స్ పోర్ట్ యాక్ట్ 1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ 1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆయన తెలిపారు. వీటిని ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు. పశు వుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఛత్తీస్‌ఘడ్, ఎపి, కర్నాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు రాష్ట్ర వా వ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డిజిపి తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద విధుల్లో వుండే పోలీసులు పక్కాగా వ్యవహరించాలని, పశువులను తరలించే వాహనాలలో అన్ని పత్రాలను పరిశీలించి, అవి సరైనవని నిర్ధారించుకోవాలని ఆయన ఆదేశించారు. అనుమానాస్పద ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు చేయాలని, రానున్న 15 రోజుల్లో పశువుల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు. పశువుల అక్రమ రవాణా పేరిట ఎవరైనా చట్టాన్ని చేతులో తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించవద్దని డిజిపి ఆదేశించారు. ఈ విషయంలో గోరక్షక్ బృందాలు, ఖురేషీలు పోలీసులకు సహకరించాలని డిజిపి కోరారు. నిబంధనలకు విరుద్ధంగా తరలించే పశువులను ఎక్కడైనా జప్తు చేస్తే వాటిని వెంటనే సంరక్షణ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. సోషల్ మీడియాకు నిఘా వుంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్ రెడ్డి, షా నవాజ్ ఖాన్, కార్తి కేయ, నిఘా విభాగం డిఐజి భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎత్తిపోతల పథకాల సలహాదారు

## పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుగా పనిచేస్తున్న విశ్రాంత జెన్‌కో ప్రత్యేకాధికారి కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం జీవో నెం.974ను విడుదల చేసింది. సలహాదారు పెంటారెడ్డి నియామకం 16.11.2025 నుంచి 15.11.2026 వరకు అమల్లో ఉండనుంది. ఆయనకు గౌరవ వేతనం కింద నెలకు రూ.1,50,000 చెల్లించనున్నారు. అదేవిధంగా ప్రభుత్వ వాహనం, మొబైల్ ఛార్జీలు, అధికారిక పర్యటనల సమయంలో వర్తించే రవాణా, కరువు భత్యాలను ప్రభుత్వం కల్పించనుంది. హైదరాబాద్‌లోని ఇంజనీర్‌ఇన్‌చీఫ్ (అడ్మిన్) పరిపాలనా నియంత్రణలో పెంటారెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. గతంలో ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను గుర్తించి, నిబంధనల సడలింపుతో ఈ పొడిగింపును మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

## లైంగిక వేధింపుల కేసులో ఎస్ఐ అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించాడని ఓ మహిళ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సురేష్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ ఇటీవల సస్పెన్స్‌కు గురైనట్లు తెలిసింది. కాగా ఎస్ఐ సురేష్ కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ యువతితో స్నేహం చేసి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించినట్లు బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ సురేష్‌పై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు బాలనగర్ ఏసిపి నరేష్ రెడ్డి తెలియజేశారు.

# ఐపిఎల్ పేరిట 600పైగా నకిలీ వెబ్‌సైట్లు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు

**ఫ్రీ టికెట్ల పేరిట అమాయకులకు టోకరా, జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా యువతను కట్టిపడేసిన ఐపిఎల్ సీజన్ ముగింపు దశకు చేరడంతో దీనిని సొమ్ము చేసుకు నేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త తరహా ఎత్తుగడలకు శ్రీకారం చుట్టారు. ఫ్రీ టికెట్ల పేరిట అమాయకులను నిండా ముంచేందుకు 600పైగా నకిలీ వెబ్‌సైటు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు దేశ వ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ నకిలీ వెబ్‌సైట్ల విషయంలో అందరు జాగ్రత్తగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఫ్రీ ఐపిఎల్ టికెట్లు, ఉచిత లైవ్ స్ట్రీమింగ్ పేరుతో ఈ నకిలీ వెబ్‌సైట్లను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. ఇదంతా భారీ ఆన్ లైన్ మోసంగా సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ కూడా అన్ని రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చే సింది. సైబర్ నేరగాళ్లు 600 పైగా నకిలీ వెబ్‌సైట్లు, 400 పైగా నకిలీ లైవ్ స్ట్రీమింగ్ వెబ్‌సైట్లు పని చేస్తున్నాయని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ వెల్లడించింది. ఈ నకిలీ వెబ్‌సైట్లు ఐపిఎల్ టికెట్ల పేరిట అమాయకుల నుంచి అందినంత దండుకుని బిచాణా ఎత్తేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. ఇదే సమయంలో విని యోగదారుల కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలో ఇం టర్నెట్ వాడే సమయంలో మాల్వేర్‌ను చొప్పించి దీని సహాయ ంతో వారి బ్యాంకు ఖాతాలతో పాటు అన్ని వివరాలను చోరీచేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొంది. నకిలీ వెబ్‌సైట్లు ప్రొఫెషనల్‌గా వుంటూ అసలైన విగా అనిపించేలా పనిచేస్తు న్నాయని, ఈ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుం టున్నామని సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌సెక్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఐపిఎల్ టికెట్ల కొనుగోలు సమయంలో అధికారిక టికెటింగ్ ప్లాట్‌ఫాంలను మాత్రమే ఉపయోగిం చాలి.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

## భూసారం పెంపు కోసం పీడీఎస్ విత్తనాలు



కంచిలి, మే 13 ప్రభాతవార్త : బొగాబెణిలో రైతులకు భూసారం కోసం పిఎండిఎస్ విత్తనాల కిట్స్ తయారీ విధానాన్ని వ్యవసాయ అధికారులు చేసి చూపించారు. బుధవారం గ్రామంలో సమావేశం ఏర్పా టు చేసి ప్రజలతో మాట్లాడుతూ అది జాతులు 30 రకాల విత్తనాలు విత్తనాలను ఒక గిఫ్ట్ 15 కేజీలు తయారు చేయడం జరిపారు. పిఎండిఎస్ వల్ల ఉపయోగం పీఎండిఎస్ వేయడం వలన యూరియా, డిఏపి వాడకం తగ్గుతుందని రైతులకు వివరించారు. పిఎండిఎస్ వేస్తే భూసారం పెరుగుతుందని భూముల్లో తేమ శాతం పెరుగుతుందని జీవ వైవిధ్యం పెరుగుతుందని పిఎండిఎస్ వల్ల ఆదాయం ఉంటుందని రైతులకు మండల యాంకర్ శివానందం వివరించారు. ఈపీఎండిఎస్ వలన భూసారం పెరగడమే కాకుండా ఎరువులు వినియోగం తగ్గుతుందని రైతులు తొలకరి వర్షాలు కంటే ముందస్తుగా వేసుకోవడం వలన భూమిలో తేమ పెరుగుతుంది. ఆర్‌సి కుణితి వెంకటరమణ, వివోఏ భారతి ఐసి ఆర్‌పి ఎన్.విజయలక్ష్మి, ట్రైనీ ఐసిఆర్‌పి రంజిత, లీడ్ ఫార్మర్లు, గ్రామ రైతులు హాజరయ్యారు.

## ఏపీ చరిత్రలో చరిత్రాత్మకమైన రోజు.. పోలింగ్ జరిగి నేటికి రెండేళ్లు



ఆముదాలవలస, మే 13 ప్రభాతవార్త : ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు మధురమైన రోజని మే 13 జరిగిన పోలింగ్ రాష్ట్ర భవిష్యత్తును మార్చే తీర్పుకు పునాది వేసిందని, వైసీపీ ఐదేళ్ల రాక్షస, అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడిన రోజుని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు మే 13, 2024న ఏకకాలంలో జరిగాయని చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమి, 175 స్థానాలకు గాను 164 స్థానాలను గెలుచుకుని 93 శాతం స్ట్రైక్ రేట్‌తో భారీ మెజారిటీతో గెలుపొంది, టీడీపీ 144 స్థానాల్లో పోటీ చేసి 135 స్థానాలు గెలుచుకుని ఏపీ ఎన్నికల చరిత్రలోనే అత్యంత భారీ మెజారిటీ గెలుపొందడం,ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు, రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయి 81.86 ఓటింగ్ నమోదు చేశారని తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మరియు యువతకు ఉపాధి వంటి అంశాలను టీడీపీ ప్రధానంగా ప్రచార అస్త్రాలుగా మలచుకుని,జైలు జీవితం, వ్యక్తిగత విమర్శలు ఎదుర్కొన్న తర్వాత చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ఆ రోజే నాంది పడిందని తెలిపారు. ఐదేళ్ల పోరాటం తర్వాత, రాజధాని ప్రజలు తమ భవిష్యత్తును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారని, అందుకే టీడీపీ చరిత్రలో ఈ తేదీని ఒక 'టర్నింగ్ పాయింట్'గా పిలుచుకుంటారని, మే 13న పోలింగ్, జూన్ 4న వచ్చిన చారిత్రాత్మక విజయం కలకాలం గుర్తుండి పోతుందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ఇప్పటికి పోలింగ్ జరిగి రెండేళ్ళయినా ఆనాటి సంఘటనల్ని టీడీపీ శ్రేణులు గుర్తుచేసుకుంటూ, ఆనాడు పడిన బీజం ఏపీ అభివృద్ధికి బాటలు వేసి,అమరావతి రాజధానికి పార్లమెంటు చట్టబద్ధత కల్పించేలా చేసి, ఇప్పుడు అమరావతి ప్రజా రాజధాని ఏపీకి ఏకైక రాజధానిగా తన ప్రత్యేకతను చాటుకుంటోందని ఎమ్మెల్యే రవికుమార్ వివరించారు.

## యువత క్రీడలపై దృష్టిసారించాలి : బలివాడ



ఆముదాలవలస, మే 13 ప్రభాతవార్త : యువత క్రీడలపై దృష్టి సారించాలని శ్రీ వాణి విద్యా నికేతన్ అధినేత బలివాడ నారాయణమూర్తి అన్నారు. బుధవారం ఆముదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న చిరంజీవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని అన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలికి తీయడం కోసం ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లో యువతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలలో ఇచ్ఛాపురం, శ్రీకాకుళం క్రికెట్ మధ్య క్రికెట్ నిర్వహించారు. ఇచ్ఛాపురం క్రికెట్ టీం టాస్ గెలిచి బ్యాటింగ్ చేయడంతో 14 ఓవర్లకు 67పరుగులు చేయగా తర్వాత వచ్చిన శ్రీకాకుళం క్రికెట్ క్లబ్ సభ్యులు 14 ఓవర్లుకు 68 పరుగులు చేయడంతో శ్రీకాకుళం టీం విజయం సాధించారు. దీంతో శ్రీకాకుళం టీం గెలిచినట్లు క్రికెట్ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రకటించారు. అంపైర్లుగా కిల్లి సుదర్శనరావు, స్కోరర్‌గా ఈశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీఆర్జేసీలో సతీష్ కుమార్ సత్తా ... 33వ ర్యాంకు కైవసం



సంతబొమ్మాళి, మే 13 ప్రభాతవార్త : ఏపీఆర్జేసీ 2026-2027 ఎంట్రన్స్ టెస్టులో సంతబొమ్మాళి గ్రామానికి చెందిన దూబ సతీష్ కుమార్ సత్తా చాటాడు. ఈ టెస్ట్‌లో ఎంపీసీ విభాగంలో 150మార్కులు గాను 139మార్కులు సాధించి స్టేట్‌లో 33 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఈయన తండ్రి దూబ గోవిందరావు సాధారణ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుండగా తల్లి తులసి గృహిణి. స్థానిక అమ్మ అకాడమీ కేంద్రంలో చదివిన సతీష్ కుమార్ ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

## సర్కారు బడిలో చేరండి.. భవితకు పునాది వేయండి



కవిటి, మే 13 ప్రభాతవార్త : రండి రారండి సర్కారు బడిలో చేరండి అంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేట విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామానికి విజయ రథంతో తిరిగి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ భాగస్వామ్యం అవ్వాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాలపేటలో ఈ ఏడాది 10వ తరగతి ఫలితాలలో 85శాతం ఫలితాలు, మండల స్థాయిలో 585 మార్కులతో మూడవ స్థానంలో ప్రియా మురహరి అనే విద్యార్థి నిలవడం, జిల్లాస్థాయి సైనింగ్ స్టార్ అవార్డు కూడా అందుకోవడం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత ఏడాది వివిధ పోటీలలో సాధించిన విజయాలు తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లల్ని చేర్పాలని తల్లిదండ్రులను కోరారు. మధ్యపుట్టుగ, కొమ్ముపుట్టుగ, కపాసుకుద్ది, సిహెచ్ కపాసుకుద్ది, ముత్యాలపేటలో తిరిగి ప్రచారం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనింగి నాగేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ప్రతినిధి రెయ్యి లోకనాథం, ఉపాధ్యాయులు సింహాచలం, కృష్ణ, అప్పలరాజు, నాగమణి, సంతోషి కుమారి, మెర్రి గోపి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ హేమారావు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చింతామణి ఉత్సవాలకు జడ్పీ, మండల పరిషత్ నిధులు



కవిటి, మే 13 ప్రభాతవార్త : కవిటిలో వెలసి యున్న చింతామణి అమ్మవారి ఉత్సవాలు బుధవారం జూన్ రెండో తేదీ వరకు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించను న్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పారిశుధ్య పనుల కోసం మండల పరిషత్ నుండి 5 లక్షల 50 వేలు, జిల్లా పరిషత్ నుండి 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు పత్రాలను బుధవారం చింతామణి దేవస్థానం వద్ద ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్, ఎంపీటీసీ పూడి నీలాచలం అందజేశారు. ఈ సందర్భంగా చింతామణి ఉత్సవ కమిటీ మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, మాజీ సర్పంచ్‌లు ఆరంగి మధు, పాండవ చంద్రశేఖర్, బెందాళం సురేష్, మొగిలిపురి నాగేశ్వరరావు, ఆరంగి కృష్ణారావుతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొని నిధులు సమకూర్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మెయిన్ రోడ్డుపై కాలువ నిర్మించాలి



కంచిలి, మే 13 ప్రభాతవార్త: దశాబ్దాలుగా మెయిన్ రోడ్డుపై కాలువ లేకపోవడంతో మెయిన్‌రోడ్డుపై నివసిస్తున్న ప్రజలు బాధలు అంతా ఇంతా కాదు. గ్రామంలో చిన్న వీధికి కూడా చిన్నపాటి కాలువ ఉన్నప్పటికీ పొడవాటి మెయిన్ రోడ్డుకు మఠం కంచిలి నుండి కేశవయ్య దాబా హోటల్ వరకు ఇరువైపులా నిర్మించాల్సిన అవసరం ఉంది. అయినా కాలువ నిర్మాణం కోసం అధికారులు కనీసం పట్టించుకోవడంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతిసారి కాలువలు ఏర్పాటు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ ఆ నిధులను వేరే చోట్లకు మళ్లిస్తున్నారు. సుమారు కిలోమీటర్‌కు పైగా రహదారికి ఇరువైపులా నివాసం ఉంటున్న ఇంటి వాడుక నీరును కాలువలు లేకపోవడంతో ఎటువైపుకు విడిచి పెట్టాలోని ప్రతిరోజు ఆలోచన. కొన్నిచోట్ల ఇంటికి కాలువ లేక వాడుక నీరు విడిచిపెడుతుంటే గొడవలు జరుగుతుండడం సహజపాటిగా మారింది. వర్షాకాలంలో అయితే రోడ్డుపైనే నీరు నిల్వ ఉండడంతో రోడ్డు పూర్తిగా శిథిలమవుతుంది. రోడ్డుపై కాలువ నీరు నిలిచిపోవడంతో వాహన చోదలకు, పాదచారులకు నిత్యం నరకయాతనే. ఇప్పటికైనా అధికారులు మెయిన్ రోడ్డుపై డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## శ్రావణ్ వివాహానికి తరలిన జనసేన నాయకులు



వీరఘట్టం, మే 13 ప్రభాతవార్త : రాష్ట్ర జీసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, శ్రీప్రియ వివాహానికి పాలకొండ నియోజకవర్గం వీరఘట్టం మండల తెట్టింగి గ్రామ జనసేన నాయకులు పి.జె.మోహనరావు, ఆయన అనుచరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. శ్రావణ్ కుమార్ తండ్రి స్వర్గీయ అరుకు మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావుతో మోహన్‌రావుకు అప్పట్లో సత్సంబంధాలు ఉండేవి. అదే విధంగా ఆయన కుమారుడుతో కూడా రాజకీయ సాన్నిత్యాన్ని పెంచుకున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం పాడేరులో జరిగే వివాహానికి తన బృందంతో హాజరై ప్రత్యేకంగా ఆశీర్వవచనాలు అందించారు.

## మలి విడత నవోదయ ఫలితాల్లో 'ప్రగతి'కి చోటు



వీరఘట్టం, మే 13 ప్రభాతవార్త : మలి విడత జవహార్ నవోదయ ఫలితాలలో మండల కేంద్రంలోని ప్రగతి హైస్కూలుకు చెందిన విద్యార్థి కొండాల రోహిత్ ఎంపిక అయ్యాడు. మంగళవారం విడుదలైన ఫలితాలలో ఈ విద్యార్థి ఎంపిక కావడం పట్ల ప్రగతి పాఠశాల విద్యా నేత శంభాన శ్రీనివాస రావు, డైరెక్టర్ ఉదయాన దుర్గారావుతో పాటు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత ఫలితాలను కనబరచాలని వారంతా ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రతిపాదనలతోనే సరిపెట్టారు.. మంజూరు కాని కళాశాలల అప్‌గ్రేడ్



సీతంపేట, మే 13 ప్రభాతవార్త : ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామని వాటికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం కోరి సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు కళాశాలలుగా అప్‌గ్రేడ్ కాలేదు. దీంతో గిరిజన విద్యార్థులకు ఇంటర్‌లో ప్రవేశానికి సీట్లు లభించక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలో చదువుదామంటే సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించకపోవడం ప్రైవేట్ కళాశాల యజమాన్యం ఒత్తిడి చేయడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించక మధ్యలోనే చదువు మానేయవలసిన పరిస్థితి నెలకొంది. 11 ఆశ్రమ హైస్కూలను ఇంటర్ అప్‌గ్రేడ్ చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు ఐటీడీఏ అధికారులు పంపించారు. నేటికీ కళాశాలలు అప్‌గ్రేడ్ కాని పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాది 10వ తరగతి విద్యార్థులు 1500 మంది వరకు ఉత్తీర్ణత అవుతూ వీరంతా ఇంటర్‌లో ప్రవేశానికి సీట్లు కోసం ఇబ్బందులు పడుతున్నారు. రెసిడెన్షియల్ కళాశాలలు ఐటీడీఏ పరిధిలో నాలుగు ఉండగా వీటిలో బాలికలకు ఒక కళాశాల మాత్రమే సీతంపేటలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సీటు సంపాదించాలంటే 550 పైగా మార్కులు వచ్చిన వారికి సీటు లభిస్తుంది ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి ఆశ్రమ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసి గిరిజన విద్యను మరింత పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఎల్‌సీ రావుకు రోటరీ సన్మానం



ఇచ్ఛాపురం, మే 13 ప్రభాతవార్త : ఇచ్ఛాపురం రోటరీ క్లబ్, తమ సాధారణ క్లబ్ సమావేశంలో రోటేరియన్ ఎల్.సి. రావును 'ది బ్లిస్‌ఫుల్ లైఫ్' అనే పుస్తకాన్ని ప్రచురించినందుకు సన్మానించింది. ఎల్.సి.రావు హిందీ సాహిత్యంలో కృషి చేశారు. ఆయన అనేక పుస్తకాలు రచించారు. కార్యక్రమంలో రొటేరియన్ తిప్పన మోహన్ వెంకటేష్, అధ్యక్షుడు రొటేరియన్ త్రినాథ రెడ్డి, రొటేరియన్ కృష్ణారావు, రొటేరియన్ ప్రఫుల్ల, రొటేరియన్ రామారావు, రొటేరియన్ దినేష్ రొటేరియన్ డి.కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

## త్రినాథ స్వామి ఆలయం పున: ప్రతిష్ట



ఇచ్ఛాపురం, మే 13 ప్రభాతవార్త: ఈదుపురం పంచాయితీ తిప్పనపుట్టుగ గ్రామంలో త్రినాథ స్వామి ఆలయం పునః ప్రతిష్టలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞం, అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌తో పాటు దక్కత ఢిల్లీరావు, మాజీ ఎంపీపీ, ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి, బి.రాజేంద్రప్రసాద్, గ్రామ పెద్దలు, పూజ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు, ఆత్మీయులు అందరు కలిసి పాలు పంచుకున్నారు.

## రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఇచ్ఛాపురం, మే 13 ప్రభాతవార్త : పుండి రైల్వే స్టేషన్ సమీపంలో, పుండి నుండి నౌపడ వైపు వెళ్లే అవుట్‌కట్స్ వద్ద రైలు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలను పలాస జిఆర్‌పిఎస్ సేకరించింది. వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాలు, చామనఛాయ రంగు, మంచి దృఢమైన శరీరంతో ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుడి చేతిపై 'సాయిరామ్' అని పేరుతో ఉన్న పచ్చబొట్టు ఉంది. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్ కింద తెల్లటి గీతలున్న సర్ఫ్ కలర్ లుంగీ/పంచె ధరించి ఉన్నాడు. చేతికి బెల్ట్‌తో ఉన్న సొనాటా కంపెనీ వాచ్ ఉంది. ఈ వ్యక్తికి సంబంధించిన సమాచారం లేదా బంధువుల వివరాలు తెలిసిన వారు వెంటనే పలాస జిఆర్‌పిఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (9247585743, 9492250069) ని సంప్రదించవలసిందిగా కోరారు.

## స్వచ్ఛ పథంలో ఎమ్మెల్యే గోవిందరావు



పాతపట్నం, మే 13 ప్రభాతవార్త : మండలంలోని బూరగాం గ్రామంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ, రోడ్ల పక్కన ఉన్న వ్యర్థాలను తొలగించే ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బుధవారం గ్రామాల్లో స్వచ్ఛ పథం రోజుగా పాటించి, పల్లెలను సుందరంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. రహదారులు, అంతర్గత రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. సేకరించిన చెత్తను తక్షణమే సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. గ్రామాల అభివృద్ధి కేవలం మౌలిక సదుపాయాలతోనే కాకుండా, పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, గ్రామస్థులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## చెవిటమ్మ తల్లి ఆలయ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి



పాతపట్నం, మే 13 ప్రభాతవార్త : మండలంలోని కాగువాడ గ్రామంలో శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాల్లో బుధవారం వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైకాపా నాయకులతో కలసి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు రెడ్డి శాంతిని దుశ్శలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## యువత పెడదారి పట్టొద్దు : సీఐ సన్యాసినాయుడు



పాతపట్నం, మే 13 ప్రభాతవార్త : స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో బుధవారం యువతకు మాదక ద్రవ్యాల వినియోగం, మద్యపానం, ఇతర సామాజిక వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక అవగాహన సదస్సును పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసి నాయుడు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సిఐ హెచ్చరించారు. స్నేహితుల ప్రభావంతో చెడు మార్గంలో వెళ్లకుండా జాగ్రత్త వహించాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పోలీసు సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి రూ.70 వేలు విరాళం



పాతపట్నం, మే 13 ప్రభాతవార్త : మండలంలోని కాగువాడ గ్రామంలో శ్రీ చెవిటమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్ట మహోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని 50 వేలు రూపాయలు విరాళం అందజేశారు. అనంతరం హిరమండలం మండలం తుంగతంపరలో శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని 20 వేలు రూపాయలను విరాళంగా ఆయన అందజేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాలలో భక్తిభావం పెంపొందించేలా ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు జరగడం సంతోషకరమని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : సింహాచలం



కోటబొమ్మాళి, మే 13 ప్రభాతవార్త : రాష్ట్ర జనాభాలో అధిక శాతం కలిగి ఉన్న బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మండలం దంత గ్రామానికి చెందిన సీనియర్ టీడీపి కార్యకర్త చల్ల సింహాచలం అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మత్స్యకార సేవలో ఏడాదికి రూ.20వేలు 1,25,000 మందికి రూ.250 కోట్లు అందివ్వటం జరుగుతుందన్నారు. నేతన్నలకు నెలకు మగ్గానికి 200 యూనిట్లు విద్యుత్, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ అందివ్వటం జరుగుతుందన్నారు. బీసీల గృహనిర్మాణాలకు అధనంగా రూ.50వేలు అందివ్వటం జరుగుతుందన్నారు. అలాగే సెలూన్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అలాగే మత్సకారుల కోసం 217 జీవో ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. 10 శాతం మద్యం దుఖాణాలు గీత కార్మికులకు కేటాయింపు, నాయీబ్రాహ్మణాలకు వేతనాలు పెంపు, నెలకు రూ.25వేల వేతనం, సోలార్ రూటాప్ బీసీలకు రూ.20వేలు అదనంగా సాయం, బీసీ స్టడీ సర్కిల్ పునరుద్ధరణ, 5720 మందికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు.

# శ్రీకాకుళం వార్త



## కేంద్రమంత్రి తక్షణమే రాజీనామా చేయాలి



రాజాం, మే 13 ప్రభాతవార్త: వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (ఎన్ఇఇటి నీట్) ప్రశ్నాపత్రాలు రక్షించలేని మోడీ ప్రభుత్వానికి దేశాన్ని పరిపాలించే అర్హత లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఎలక్షన్ కమిషన్ భ్రష్టు పట్టించారు. న్యాయ వ్యవస్థను భ్రష్టు పట్టించారు. అమెరికాకి లొంగిపోయి విదేశాంగ విధానాన్ని భ్రష్టు పట్టించారు. ధరలను పెంచి ప్రజల జీవితాలను భ్రష్టు పట్టిస్తున్నారు. దేశంలో వనరులన్ని కార్పొరేట్లకు దోచిపెట్టి దేశాన్ని నాశనం చేస్తున్నారు. దేశ ప్రజల ఆరోగ్యాన్ని ప్రాణాలను కాపాడే వైద్య విద్యలో నీట్ పేపర్ లీకేజీ కావడం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని దేశ ప్రజల ఆరోగ్యం విద్య ప్రమాదంలో పడుతుందని అన్నారు. నీట్ పరీక్షలు వికేంద్రీకరణ చేసి పనికిమాలిన ఎన్‌టిఏ ను రద్దు చేసి ప్రభుత్వం నడపాలని డిమాండ్ చేశారు. 22 లక్షల మంది నీట్ పరీక్షలకు లక్షల రూపాయల ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకొని వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దన్నారు. కేంద్రంలో విద్యాశాఖ మంత్రిని తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## వీధికుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలు



రాజాం/రేగిడి, మే 13 ప్రభాతవార్త: రేగిడి ఆమదాలవలస మండలం బూరాడ గ్రామంలో వీధి కుక్క దాడిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో శీర అప్పలనాయుడు ఆల్లు భుజంగరావు, శీర కాశీ విశ్వేశ్వరరావు, లావేటి రామారావు ఉన్నారు. ఉదయం సమయంలో గ్రామంలో ఉన్న అసిరి తల్లి గుడి వద్ద కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. స్థానికులు కేకలు వేసి కర్రలతో తరమడంతో కుక్కలు పారిపోయాయి.ఈ విషయంపై గత 2 నెలల్లో ఇది రెండోసారి. గ్రామంలో ఉన్న సచివాలయంకి ఎన్నిసార్లు కంప్లైంట్ చేసినా పంచాయితీ కార్యదర్శి పట్టించుకోవడం లేదు.గ్రామాల చుట్టుపక్కల తిరగాలంటే భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే పంచాయతీ అధికారులు, సిబ్బంది గ్రామంలో ఉన్న కుక్కల బెడద నుండి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృత పరిచేందుకు చర్యలు



వంగర/రాజాం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : రాజాం శాసనసభ్యులు కొండ్రు మురళి మోహన్ సహకారంతో రాజాం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయాన్ని సెర్ప్ సంస్థ సహకరంతో విస్తృత పరిచేందుకు చర్యలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాజాంలో మంత్రికి ప్రముఖ పారిశ్రామికవేత్త లోలుగు మదన్ డాక్టర్ గార రవి ప్రసాద్ వికాస్ తరంగణి అధ్యక్షులు టిటీవీ రమణమూర్తి ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావు జాతీయ యువజన అవార్డు గ్రహీత చైతన్యకుమార్‌తో కలసి మంత్రి కోండ్రు మురళీమోహన్ నియోజకవర్గంలో సెర్ప్ సంస్థ ద్వారా ప్రకృతివ్యవసాయాన్ని విస్తృతపరచాలని, ప్రముఖ ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వరరావు వినతి మేరకు రూపొందించిన లెటర్‌ను వారు మంత్రికి అందజేశారు.

## ఐదు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

శ్రీకాకుళం/ఇచ్ఛాపురం, మే 13 ప్రభాతవార్త : ఇచ్ఛాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా బుధవారం సాయంత్రం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద తనిఖీ చేయగా సుమారు 5 కిలోల గంజాయి మరియు రెండు మొబైల్ ఫోన్లు వాటిని స్వాధీనం చేసుకున్నారని ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. అరెస్టు చేయబడిన వ్యక్తి ఝార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింగభూమ్ జిల్లా, కుర్మార్ దుంగి మండలం తుం టకట గ్రామానికి చెందిన రాజ్ అభిషేక్ రాజ్జు సింకుగా గుర్తించారు. కేసు విచారణలో, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అతను గంజాయి అక్రమ రవాణాలో ఒడిశా రాష్ట్రం ఖందమాల్ జిల్లా నుంచి గంజాయిని తీసుకువచ్చి ఝార్ఖండ్ రాష్ట్రానికి తరలించే ప్రయత్నంలో ఉండగా ఇచ్ఛాపురం వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో ఇచ్ఛాపురం టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎం.ముకుందరావు నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు వివరాలను ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నం నాయుడు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాపై జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## రెండేళ్లలో ఆర్వోబీలు : కేంద్రమంత్రి



శ్రీకాకుళం,మే 13 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లాలో రైల్వే ఆర్వోబిల నిర్మాణం త్వరితగతిన చేపట్టి ఇబ్బందులు లేని సాఫీ ప్రయాణాన్ని చేరువ చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని తన కార్యాలయం నుండి శ్రీకాకుళం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇందులో ముఖ్యంగా అరసవల్లి, శ్రీకుర్మం ఆలయాల సమగ్ర అభివృద్ధి, మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడానికి తీర ప్రాంతాల్లో జెట్టీల నిర్మాణం, పరిశ్రమలు, స్థానిక ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడానికి లీలీలీని పార్కులను వేగవంతం చేయడం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దిలీళి నిధులతో జిల్లా లైబ్రరీ ఆధునీకరణతో పాటు 4 కొత్త పబ్లిక్ పార్కుల అభివృద్ధి విషయాలపై కీలకంగా చర్చించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రైవేట్ సెక్రటరీ శ్రీకేష్ లాత్కర్, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

## రొయ్యల ఫీడ్ ధరల పెంపు నిలిపివేత

### మంత్రి అచ్చెన్నాయుడు జోక్యంతో కీలక నిర్ణయం



శ్రీకాకుళం, మే 13 ప్రభాతవార్త: ఆక్వా రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నీ కూటమి ప్రభుత్వం సహించదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలను ఒక్కసారిగా పెంచడం వల్ల రాష్ట్రంలోని వేలాది ఆక్వా రైతులపై తీవ్ర ఆర్థికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాలు, అధికారులతో బుధవారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందిస్తూ, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ధరలు పెంచడం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందని, ఇలాం టి సమయంలో రైతులపై అదనపు భారం మోపే చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చ రించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీఎస్ఎడియే కోవైస్ చైర్మన్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మత్స్యశాఖ కమిషనర్‌తో పాటు ఎస్ఐఎఫ్టి, సిఐబీఏ, సిఐఎఫ్ఏ, సిఐఎఫ్టి, మత్స్య విశ్వవిద్యాలయం ప్రతినిధులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర లక్ష్యంగా గారలో స్వచ్ఛపథం కార్యక్రమం

శ్రీకాకుళం, మే 13 ప్రభాతవార్త : గార మండలంలోని తూలుగు పంచాయితీ పరిధిలోని సీ ఎస్ పి రోడ్డులో బుధవారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రతి బుధవారం గ్రామ పంచాయతీ పరిధిలో గల రహదారులు మరియు రోడ్ల పరిశుభ్రతను చేపట్టాలని ఆయన కోరారు. స్థానిక ప్రజలు, అధికారులు, నాయకులతో కలిసి రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, యువకులు, స్వచ్ఛంద కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై కీలక సూచనలు



శ్రీకాకుళం/నరసన్నపేట, మే 13 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో నరసన్నపేట సమీపంలోని జమ్ము తామరాపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, నరసన్నపేటలో సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎస్పీ డి.లక్ష్మణరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యువల్ రాజు, నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, రంజిత్, అధికారులు పాల్గొన్నారు.

14-5Pg9th cheli Final.qxd:14-5Pg9th cheli Final.qxd 1/1/02 6:15 AM Page 1



## జీవన సూత్రాలు పాటిస్తే..



వయసెంత వచ్చినా నిగనిగలాడుతూ కనపడాలని ఎవరికుండదు చెప్పండి. చెప్పండి. కానీ కొంతమంది ఏళ్లు గడిచినా చిన్న వాళ్లలా కనిపిస్తే.. కొందరినేమో త్వరగా వృద్ధాప్యం పలకరిస్తుంది. ఇది వారి వంశ పారంపర్యమేమో అనుకుంటాం. కానీ కొన్ని జీవన సూత్రాలు పాటిస్తే ఎవరైనా వయసును తగ్గించుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

**చన్నీటి స్నానం :** సీజన్ ఏదైనా చల్లటి నీళ్లతో స్నానం చేస్తే వచ్చే లాభాలు అనేకం. ఇది మెటబాలిజాన్ని పెంచటమే కాదు. రక్త ప్రసరణనూ వృద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

**ఉపవాసం..** కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉపవాసం ఉంటూనే ఉంటాం. వారంలో ఒక రోజు తప్పనిసరి చేసుకోండి. జీర్ణవ్యవస్థకు ఇలా అప్పుడప్పుడే విశ్రాంతి నిస్తే.. చర్మంలో కొత్త కణాల వృద్ధి జరుగుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలూ త్వరగా ఏర్పడవు. అలానే మైండ్‌ఫుల్ ఈటింగ్.. అంటే తినే ప్రతి ముద్దనీ ఆస్వాదిస్తూ తినాలట. ఇదీ మనల్ని నిత్య యవ్వనంగా ఉంచుతుంది.

**కళలతో..** మీకు డ్యాన్స్ చేసే అలవాటు ఉందా లేదా సంగీత వాద్యాలేమైనా వాయించగలరా? లేదంటే నేర్చుకోండి. ఎందుకంటే క్రమం తప్పకుండా నాట్యం చేసేవాళ్లు శారీరకంగానే కాదు..మానసికంగానూ ఫిట్‌గా తయారవుతారు. ఇక సంగీతంలో ప్రవేశం ఉంటే.. కాగ్నిటివ్ సామర్థ్యం పెరిగి, కొత్త ఆలోచనలకీ ఆస్కారం ఉంటుంది.

**కృతజ్ఞతలు చెప్పండి..** ఈ తీరు ఆశావహ దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఉత్సాహంగా ఉరకలు వేసే మనసు యవ్వనానికి ప్రతీకే కదా! పోనీ ఒత్తిడి లేకపోయినా ఆ ప్రభావం శరీరం మీద సానుకూల ప్రభావం చూపుతుంది. ఇదీ మేలు చేసేదే! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. కొత్త పరిచయాలు ఏర్పరచుకోండి. నలుగురితోనూ మంచి బంధాలు వారి ఆయుష్షు పెరగటమే కాదు. వృద్ధాప్యమూ త్వరగా దరిచేరదట. ▫

## నానబెట్టి తినాలి !



మధురమైన మామిడి పండును చూడగానే నోరూరుతుంది. అలాఅని అమాంతం దానిని దొరకపుచ్చుకుని తినేద్దామంటే కుదరదు. తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం వల్ల ఆరోగ్యపరంగా బోలెడు ప్రయోజాలున్నాయి.

**ఎంతసేపు నానబెట్టాలి ?** 'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి', విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనేకాదు ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే ! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చేకూరాలంటే తినే ముందు వాటిని 1-2 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట పాటైనా నీటిలో నానబెట్టాలట! వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొందమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు. దీనివల్ల శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. ఫలితంగా జీర్ణ సంబంధిత సమస్యలు, ముఖంపై మొటిమలు.. వంటివి తలెత్తుతాయి. ఈ సమస్యలను దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెట్టాలి. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోతాయంటున్నారు నిపుణులు.

**రసాయనాలు తొలగాలంటే...** మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిని రసాయనాలు పండు తొక్కపై చేరతాయి. అది గమనించకుండా వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికే ప్రమాదం! తద్వారా వివిధ ఆరోగ్య సమస్యలొస్తాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలంటే తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం ఒక్కటే మార్గం! తద్వారా పండు తొక్కకు అంటుకున్న రసాయనాలు తొలగిపోతాయి.

**బరువూ తగ్గచ్చు!...** మామిడి పండ్లలో ఉండే ఫైటోకెమికల్స్, బయోయాక్టివ్ సమ్మేళనాలు కొవ్వు కణాలు కొవ్వు సంబంధిత జన్యువులపై ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం వల్ల ఈ సమ్మేళనాల గాఢతతగ్గి, శరీరానికి హానికరమైన కొవ్వుని కరిగించడంలో తోడ్పడుతాయి. తద్వారా బరువూ అదుపులో ఉంచుకోవచ్చు. ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు. అయితే బరువు తగ్గాలంటే మాత్రం పండ్లను షేక్స్, స్మూతీస్ రూపంలో కాకుండా నేరుగా తినడమే మంచిది. ▫

**చిట్కా:** ◷ మైదా పిండి గోధుమ పిండికీ పురుగుపట్టకుండా ఉండాలంటే నాలుగు స్పూనుల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి. ◷ ఫ్లాస్క్ వాడనప్పుడు దానిలో పావు చెమ్చా పంచదార వేయండి దుర్వాసన రాదు

## వ్యథ: మానసిక ఒత్తిడిని గెలిచేదెలా ?

**ప్రశ్న:** నేను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాను. ఆందోళన, నిద్రలేమితో బాధపడుతున్నాను. ఇప్పుడిప్పుడే డిప్రెషన్ కూడా వస్తున్నట్టు అనిపిస్తోంది. నా వయస్సు 40 సంవత్సరాలు. నేను, నా భర్త ఇద్దరం ఉద్యోగులు. మాకు ఇద్దరు పిల్లలు. మానసిక ఒత్తిడి తగ్గడానికి ఏమైనా మందులు ఉంటే సూచించండి.' **- ఒక సోదరి, బెంగళూరు**

**జవాబు:** అమ్మా, నిజానికి 'మానసిక ఒత్తిడిని పూర్తిగా తొలగించే" ప్రత్యేకమైన మందులు లేవు. ఎందుకంటే ఒత్తిడి అనేక కారణాల వల్ల కలుగుతుంది. అయితే ఒత్తిడి వల్ల వచ్చే ఆందోళన, నిద్రలేమి, డిప్రెషన్ వంటి లక్షణాలకు మాత్రం మంచి చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే సైకియాట్రిస్ట్ పరీక్షి ంచి తగిన మందులు సూచిస్తారు. అలాగే జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడిని చాలా వరకు తగ్గించుకోవచ్చు. క్రమమైన వ్యాయామం, యోగా, ధ్యానం, సరైన నిద్ర, కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు, ఇష్టమైన పనులకు సమయం కేటాయించడం వంటి విషయాలు మానసిక ప్రశాంతతకు సహాయ పడతాయి. ఒత్తిడి ఎక్కువైనప్పుడు శరీరం, మనసు, ప్రవర్తనలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. టెన్షన్, భయం, చిరాకు, కోపం పెరగడం, ఏకాగ్రత తగ్గడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది కలగడం వంటి మానసిక లక్షణాలు ఉంటాయి. అలాగే తలనొప్పి, మెడ-భుజాలు బిగుసుకుపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అలసట, నిద్రలేమి, జీర్ణ సమస్యలు, ఆకలి మార్పులు వంటి శారీరక లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొంతమంది ఒంటరిగా ఉండాలనుకోవడం, పని మీద ఆసక్తి తగ్గడం, ఎక్కువగా టీ-కాఫీ తాగడం, ఫోన్ లేదా సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం, కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడడం వంటి ప్రవర్తనా మార్పులు కూడా చూపిస్తారు. ఈ లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణ ఒత్తిడి కొంతకాలానికి తగ్గిపోతుంది. కానీ వారాల తరబడి కొనసాగితే అది యాన్జైటీ డిసార్డర్ లేదా డిప్రెషన్ వైపు వెళ్లే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో తప్పకుండా మానసిక ఆరోగ్య నిపుణుడిని సంప్రదించాలి. మీ ఒత్తిడికి అసలు కారణం ఏమిటో ముందుగా గుర్తించండి. పని భారం, కుటుంబ సమస్యలు, ఆర్థిక లేదా ఆరోగ్య సమస్యలు ఏవైనా కారణాలు ఉండొచ్చు. సమస్యను గుర్తిస్తే పరిష్కారం కూడా సులభమవుతుంది. అవసరమైతే ఒకసారి సైకాలజిస్ట్‌ను కలిసి కౌన్సెలింగ్ తీసుకోండి. సరైన సహాయం తీసుకుంటే మానసిక ఒత్తిడిని ఖచ్చితంగా తగ్గించుకోవచ్చు.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## దాహం తీర్చిన సాయి

**ఒకసారి నానా సాహెబ్** చండోర్కర్ ఆఫీసు పనిమీద ఒక గ్రామానికి వెళుతూ దారిలో ఉన్న హరిశ్చంద్ర గుట్టను దాటవలసి వచ్చింది. కార్యాలయ సిబ్బందితో గుట్ట ఎక్కుతున్నాడు నానా సగం దూరం ఎక్కేసరికి మధ్యాహ్నమైంది. అది మండు వేసవి నడి నెత్తిన సూర్యుడున్నాడు. నానాకు గొంతుక పిడచకట్టుకుపోయింది. ఆయన అనుచరులంతా దగ్గరలో నీరు ఏమైనా లభ్యమవుతుందేమోనని చూచారు. కానీ, ఫలితం లేదు. నానా తీవ్ర దాహంతో ఉన్నాడు ఏమి చేయటానికి దిక్కుతోచలేదు. నానకు తన ఆరాధ్య దైవమైన సాయి గుర్తుకు వచ్చాడు. వెంటనే సాయిని మనసారా ప్రార్థించాడు. భక్తులందరకు తమ ఇష్ట దైవాలు సమయానికి సహాయం చేస్తారు. ఈ సంగతి నానాకు తెలుసు. నర్సీ మెహతా హుండీని భగవానుడు గౌరవించాడు. ఏకనాథుని కోసం వంటలవాని రూపాన్ని దాల్చాడు రంగనాథుడు. దామాజీని కాపాడటం కోసం, విఠూ మహర్‌గా అవతరించాడు పాండురంగడు. నానా సాయిబాబా ఇక్కడ ఉంటే బాగుండును అన్నాడు. ఆయన అనుచరులలో కొందరికి రుచించలేదు, ఆ మాట. అదే సమయానికి షిరిడీలో తన ప్రక్కన కూర్చున్న శ్యామాతో సాయి నానా ఆపదలో ఉన్నాడు అన్నాడు. సరిగ్గా అదే సమయానికి కట్టెల మోపు నెత్తిన పెట్టుకున్న భిల్లుని. 'నీవు కూర్చున్న బండ క్రింద' అని జవాబి చ్చాడు ఆ భిల్లుడు. ఆ బండను తొలగించగానే స్వచ్ఛమైన నీరు ఎగజిమ్మింది. నీటిని తృప్తిగా త్రాగి నడక సాగించాడు నానా తన పరివారంతో. కొంత కాలానికి షిరిడీకి వెళ్లాడు నానా. ఫలాన రోజున, ఫలానా సమయంలో ఏదైనా ఆపదలో ఉన్నారా? అని ప్రశ్నించాడు నానాను శ్యామా. వివరాలు చెప్పాడు నానా. నీటి జాడ చెప్పిన భిల్లుడు సాయే అని అప్పుడు తెలిసింది నానకు. సాయి నానాకు భౌతిక దాహాన్ని తీర్చాడు నీటి జాడను చూపి, ఆధ్యాత్మిక దాహాన్ని కూడా తీర్చాడు గీతార్థాన్ని తెలిపి. ▫

## హృదయ స్పందన రాగం..



కొన్ని పాటలు శరీరంలో పులకలు తెప్పిస్తాయి. మరికొన్ని చల్లటిగాలేదో చుట్టుముట్టిన భావనని కలిగిస్తాయి. కొన్ని వ్యక్తం చేయలేని శోకాన్నేదో కలిగిస్తే.. మరికొన్ని తెలియని ఆనందాన్ని పుట్టిస్తాయి. ఎందుకు జరుగుతోందిలా? అన్న ప్రశ్నకి సంగీతం మనసులో తెచ్చే స్పందనలే ఇందుకు కారణమని చెబుతూ వచ్చారు ఇంతకాలం. కానీ ఒక్క మనసే కాదు శరీరమూ సంగీతానికి రకరకాలుగా స్పంది స్తోందని తాజాగా తేల్చారు శాస్త్రవేత్తలు. ఇందుకోసం528 మందితో ఓ అధ్యయనం నిర్వహించారు. వాళ్లకి వినిపించడానికి కొన్ని వాయిద్య సంగీత భాగాల్ని ఎంచుకున్నారు. వాళ్ల ముందు మానవ శరీరభాగాలతో ఉన్న టచ్‌స్క్రీన్ బొమ్మని ఉంచారు. ప్రతిసారీ సంగీతాన్నీ విన్న పది సెకన్ల తర్వాత వాళ్ల శరీరంలో ఏ భాగం స్పందిస్తోందో దాన్ని టచ్‌స్క్రీన్‌లోని బొమ్మని తాకి చెప్పమ న్నారు. దాదాపు అందరూ కొన్ని పాటలతో తమ హృదయ స్పందన పెరుగుతోందనీ, మరికొన్నింటితో ఉదరభాగంలో ఏదో కదులుతున్నట్టు భావించామనీ చెప్పారట! దీన్నిబట్టి సంగీతం అన్నది మనసుపైనే కాదు శరీరంమీదా ప్రభావాన్ని చూపుతోందని తేల్చారు శాస్త్రవేత్తలు. ముఖ్యంగా పాట మొదలైనప్పటి నుంచీ చివరిదాకా సాఫీగా సాగే మెలడీ ఉదర(గట్) భాగాల్లో అవ్యక్తాన ుభూతికి కారణమైతే.. అక్కడక్కడా మలుపులున్న సంగీతం హృదయ స్పందనల్నీ పెంచుతోందని విశ్లేంచారు. ▫

# తెర



## 'హ్యాపీ జర్నీ' ఫస్ట్ లుక్ రిలీజ్

కూడా లేవు. షూటింగ్ కూడా అంత ఈజీ కాదని అర్థమైంది. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను. నేను ఈ చిత్రంలో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న హార్ట్‌వార్మింగ్ ఎమోషనల్ డ్రామా 'హ్యాపీ జర్నీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. అభిరామ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మహిళా భావోద్వేగాలకు ప్రధాన ప్రాధాన్యతనిస్తూ రూపొందుతోంది. బాలాజీ గుట్ట, కౌశిక్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాత .ఏడుగురు మహిళల భావోద్వేగ ప్రయాణాలను ప్రధానంగా చూపించే ప్రయత్నం ఈ చిత్రం చేస్తోంది. అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినిషా అలీశెట్టి, రూపా శ్రీనివాస్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీ దండమూడి, వంశీధర్ గౌడ్, రవి శివతేజ పైలా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రతి పాత్రను ఎంతో సహజంగా, భావోద్వేగాలకు దగ్గరగా తీర్చిదిద్దారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ప్లెజెంట్‌గా, ఫీల్‌గుడ్ ట్రావెల్ వైబ్‌ను అందిస్తోంది. పారిస్‌లోని ప్రసిద్ధ లూవ్రే పిరమిడ్, ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, సాఫ్ట్ సన్‌సెట్ బ్యాక్‌డ్రాప్ మధ్య భిన్న తరాల మహిళలు, కొంతమంది యువకులు కలిసి కనిపిస్తున్న తీరు, స్నేహం, ఆప్యాయత, జీవితాన్ని ఆస్వాదించే జర్నీని అందంగా ప్రతిబింబిస్తోంది. కథ యూరప్‌లోని పారిస్, మాంట్‌పెలియర్ వంటి అందమైన ప్రదేశాల్లో సాగనుంది.

## 'దూరదర్శని' అందరి సొంతూరి కథ : హీరో సువిక్షిత్



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయశంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది.

**మీ నేపథ్యం ఏమిటి?**

కడప జిల్లా రాయచోటి. నాకు వ్యాపారం ఉంది. చిన్నప్పటి నుండి సినిమాలంటే పాషన్.. సినిమాలను చూసి ఇన్‌స్పయిర్ అయ్యే వాడిని. అనుకోకుండా ఈ సినిమా ద్వారా హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను.

**ఈ సినిమాలోకి హీరోగా ఎలా అవకాశం వచ్చింది?**

రచయిత నారాయణ, అరుణాచలంలో కలిసిన ఓ యాచకుడి జీవిత గాథ ఆధారంగా ఈకథను అనుకుని రాసుకున్నారు. అయితే మొదట ఈ సినిమాను వేరే హీరోతో చేద్దామని ప్లాన్ చేశాం. అయితే కథకు కొత్త హీరో అవసరం కాబట్టి నాకున్న ఇంట్రెస్ట్‌తో. ఆ పాత్రకు నేను సెట్ అవుతానని భావించి కథానాయకుడిగా నేనే నటించాను.

**మిమ్ములను మీరు ఈ కథ కోసం ఎలా మోల్ట్ చేసుకున్నారు?**

ఈ కథను నేను కూడా విన్నాను. 90 బ్యాక్ డ్రాప్‌లో నడిచే ఈ కథలో లీడ్ పాత్రకు అప్పట్లో ఎలాంటి అనుభూతి పొందామో తెలుసుకుని నటించాలి. ఆ అనుభూతి పొందిన వారిలో నేను కూడా ఉన్నాను. అందుకే నేనే చేస్తే సహజంగా ఉంటుందని భావించాను.

**రిలీజ్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారా?**

మేము ఎదో తక్కువ థియేటర్స్‌లో రిలీజ్ చేద్దాం అనుకున్నాను. ఇప్పుడు దాదాపుగా 250పైగా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నాం.

**సినిమాలో హీరో , హీరోయిన్ చనిపోతారు అంటున్నారు? ఆ పాయింట్‌ను ఎందుకు రివీల్ చేశారు?**

హీరో, హీరోయిన్ చనిపోయిన తరువాత హ్యాపీ ఎండింగ్ ఎలా ఇచ్చాం. అసలు అరుణాచలంలోకి ఆ పెద్దాయన ఎలా వచ్చాడు? ఆయన జీవితంలో జరిగింది ఏమిటి అనేది కథ. సినిమాలో హీరో ఫాదర్‌గా ఆ పెద్దాయన పాత్ర కనిపిస్తుంది. 90లో ప్రతి ఒక్కరూ వాళ్ల ఊరిలో తిరిగొచ్చిన ఫీల్ కలుగుతుంది.

**ఈ సినిమా వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ ఎలా ఉంది?**

ప్రతి సినిమాకు ఉండే కష్టాలు మాకు ఉన్నాయి. అయితే ఆర్టిస్టులు, టెక్నిషియన్స్ అందరూ సపోర్ట్ చేశారు. కానీ ఈ రోజు సినిమాను విడుదల వరకు తీసుకరావడం మేము సాధించిన విజయంగా భావిస్తున్నాం.

**90వ దశకం బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకోవడానికి రీజన్ ఏమిటి?**

సిటీకి అలవాటు పడి అందరం మన మూలాలను, పల్లెటూర్లను మర్చిపోతున్నాం. అందుకే అందర్ని వెనక్కి తీసుకెళ్లి జ్ఞాపకాలు గుర్తుకు తెస్తున్నాం. ఈ సినిమా చూసిన వారికి వాళ్ల సొంతూరు గుర్తుకొస్తుంది.

**సినిమా టిక్కెట్‌తో పాటు కర్చీఫ్ ఇస్తామని అంటున్నారు?**

ఈ సినిమా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఎమోషన్ చూసి ఎడ్వకుండా ఎవ్వరూ ఉండలేరు.

**హీరోగా కంటిన్యూ చేస్తారా?**

తప్పకుండా మంచి కథలతో సినిమాలు చేయాలని ఉంది.

## థియేటర్ల మనుగడ కోసం 'పర్సెంటేజ్ షేరింగ్' విధానం



ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకు పోరాటం. సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ కోసం అందరికీ సమానంగా వర్తించే 'పర్సెంటేజ్ షేరింగ్" విధానాన్ని అమలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాము: ప్రెస్ మీట్ లో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిరక్షణ, కొనసాగింపుకు సంబంధించి ప్రతిపాదిత"పర్సెంటేజ్ షేరింగ్ విధానం" అమలుపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్ సభ్యుల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు చదలవాడ శ్రీనివాస్, శిరీష్ రెడ్డి, సునీల్ నారంగ్‌తో పాటు పలువురు ఎగ్జిబిటర్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో కీలక అంశాలు, నిర్ణయాలను వెల్లడించారు. మీడియా సమావేశంలో చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక నిర్మాతగా మాట్లాడాలంటే నిర్మాత తండ్రి అయితే, ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడు. అలా చూసినప్పుడే సినిమా ఇండస్ట్రీ బాగుంటుంది. తండ్రి ఎంత కష్టపడినా బిడ్డల సుఖం కోసమే. గత 20 ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారికి గిట్టుబాటు లేక, ఆదరణ లేక పరిస్థితులు క్షీణించాయి. గత ఏడాది నుంచి పరిస్థితి మరింత దిగజారింది. నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ.. మేము పర్సెంటేజ్ విధానం గురించి మాట్లాడుతున్నామంటే ఇది ఎగ్జిబిటర్ల బ్రతుకుపోరాటం. ఏ సినిమాను టార్గెట్ చేసి గానీ, ఏ నిర్మాతను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో గానీ ఇది చేయడం లేదు. థియేటర్లను రక్షించండి. కామర్స్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ.. పర్సెంటేజ్ విధానం కోసం మేము 2008 నుంచే పోరాడుతున్నాం. చివరిగా 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల సమయంలో కూడా పర్సెంటేజ్ అమలు చేస్తామని చెప్పారు. కానీ అది జరగలేదు. మేము థియేటర్లు బంద్ చేస్తున్నామని అసత్య ప్రచారం చేశారు. మేము థియేటర్లు బంద్ చేయడం లేదు. ఎవరైతే పర్సెంటేజ్ ఇస్తారో వాళ్ల సినిమాలను ప్రదర్శిస్తామని చెబుతున్నాం.

## 'గుర్తింపు' ట్రైలర్ విడుదల



గంగా ఎంటర్టైన్మెంట్స్, స్వస్తిక్ విజన్స్ సంయుక్త నిర్మాణంలో కేజేఆర్ హీరోగా తెరకెక్కిన 'గుర్తింపు' ట్రైలర్ విడుదల..స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా గంగా ఎంటర్టైన్మెంట్స్, స్వస్తిక్ విజన్స్ సంయుక్త నిర్మాణంలో కేజేఆర్ హీరోగా ఎస్‌కే ప్రశాంత్, అజిత్ బాస్కర్, అరుణ్ మురుగన్ నిర్మించిన చిత్రం 'గుర్తింపు'. ఈ మూవీకి జె.పి. తెన్ పతియాన్ దర్శకత్వం వహించారు. దేశంలోని క్రీడా వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ పనితీరు, పేదలు క్రీడలకు ఎంత దూరంలో ఉన్నారు అనే విషయాల్ని ఇతివృత్తంగా తీసుకుని 'గుర్తింపు' సినిమాని తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. క్రికెట్ మన నేషనల్ గేమ్.. 'హాకీ మన నేషనల్ గేమ్'.. 'మన దేశానికి నేషనల్ గేమ్ అనేదే లేదు', 'మీరందరూ చూసే పది సెకన్లు కాదు సార్ నా జీవితం.. దాని వెనకాల నా 29 ఏళ్ల జీవితం, శ్రమ ఉంది సర్.. మీట్‌కి వెళ్తే గెలుస్తాం.. కానీ అక్కడి వరకు వెళ్లలేక పోతున్నాం' 'మనలాంటి వాళ్లకి గేమ్ మామూలు విషయం కాదు.. అదే మనకు విడుదల','స్పోర్ట్స్ అని కొడితే క్రికెట్ గురించి మాత్రమే న్యూస్ వస్తుంది', దేశం కోసం పోరాడే వాళ్లకి మాత్రమే కాదు.. క్రీడాకారులకి కూడా ఎంతో రుణపడి ఉంటుంది, ఈ ట్రైలర్‌ను గమనిస్తే ఓ పేదవాడు అథ్లెటిక్‌గా ఎదిగే క్రమంలో ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొ న్నాడు.. ఈ ప్రయాణంలో క్రీడశాఖమంత్రిని కోర్టు మెట్లు ఎందుకు ఎక్కించాడు.. అసలు అతనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమస్యలు వచ్చాయి.. కోర్టులో కోరుకున్న న్యాయం దక్కిందా? లేదా? అనే ఉత్సుకత కలిగించేలా ట్రైలర్‌ను కట్ చేశారు. విజువల్‌గా, సౌండింగ్ పరంగా ట్రైలర్ అదిరిపోయింది. హీరోగా కేజేఆర్ లుక్స్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, పర్ఫామెన్స్ ఈ ట్రైలర్‌లో అదిరిపోయింది. ఈ మూవీని జూన్‌లో విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## మే 15న వస్తున్న 'ముసలోడికి దసరా పండుగ'



నాన్‌స్టాప్ నవ్వులు పండించడానికి టాలీవుడ్ తెరపైకి ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ రాబోతోంది. రాజీ నాయుడు సీతమ్మ వాళ్లె ఆశీస్సులతో రమణా ఫిలిమ్స్ బ్యానర్‌పై యువ నిర్మాత రమణ వాళ్లె నిర్మిస్తున్న ద్విభాషా చిత్రం "ముసలోడికి దసరా పండుగ" విలక్షణ నటుడు నాజర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ఈ శుక్రవారం (మే 15న) థియేటర్‌లలో విడుదల కాబోతోంది. ఇప్పటికే ట్రైలర్ ప్రచార చిత్రాలతో భారీ అంచనాలు అందుకున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత రమణ వాళ్లె మాట్లాడుతూ.. "ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే రెండు గంటల పాటు కష్టాలన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ప్రతి ఒక్కరికి నచ్చుతుందని నమ్మకంగా చెప్పగలం. ఈ సినిమాను మా పితృ సమానులు దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు అంకితమిస్తున్నాం" అని తెలిపారు. చాలా కాలం తర్వాత తెలుగు తెరపైకి ఫ్యామిలీ ఎమోషన్స్, ఫుల్ లెంగ్త్ కామెడీతో రాబోతున్న ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## బ్లాక్ బస్టర్'శంబాల' కాంబో రిపీట్



బ్లాక్ బస్టర్ 'శంబాల' కాంబో రిపీట్.. బృందా రవీందర్ దర్శకత్వంలో ఆది హీరోగా షైనింగ్ పిక్చర్స్, యగంధర్ ముని నూతన చిత్రం..సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ శంబాల్లతో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభి మోజు, దర్శకుడు యుగంధర్ ముని, హీరో ఆది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా నిలిచారు. శంబాల లాంటి మరో వినూత్నమైన కథాంశంతో వీరంతా కలిసి ఓ ప్రయోగం చేయబోతోన్నారు. యుగంధర్ ముని సమర్పణలో షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలైన మహిధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు ఆదితో మరో సినిమాని నిర్మించనున్నారు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు. శంబాల తరువాత మళ్లీ ఆ స్థాయిలో సినిమాని నిర్మించాలని వీరంతా కలిసి కథాన్వేషణలో పడ్డారు. ఇక అద్భుతమైన కథ తోడవ్వడంతో వీరంతా కలిసి ముందుకు వచ్చారు. ఎమోషన్స్‌తో పాటుగా ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారు. భయం, ఉత్కంఠ, అన్ లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్, ఎమోషన్స్‌తో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఒక అద్భుతమైన అను భూతిని అందించేందుకు టీం సిద్ధమైంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్ అదిరి పోయింది. ఈ పోస్టర్‌లో ఆది సాయి కుమార్ ఇంటెన్స్ లుక్, రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు, ఆకులు, కనిపిస్తున్న పాత కాలం నాటి స్టాంప్ ఇవన్నీ చూస్తుంటే ఓ కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకు వెళ్లేలా కనిపిస్తున్నారు.

14vzm15:14vzm15.qxd 13-05-2026 22:01 Page 1



## చూసేయ్ జాగా... వేసేయ్ పాగా ... అధికారుల భరోసా



బొబ్బిలి, మే 13, ప్రభాతవార్త : ఒక్కొక్క ఫైల్‌కి ఒక్కొక్క రేటు ..ఆ రేటు ఎవరు ఇచ్చినా పరవాలేదు అందరికీ ఎంచక్కా పనులు అయి పోతాయి .. బొబ్బిలికి చెందిన ఒక రెవెన్యూ అధికారి ఏమాత్రం జంకు లేకుండా ఏజెంట్స్ ని ఏర్పాటు చేసుకుని ఈ దందాన్ని యదేచ్ఛగా నడుపుతున్నట్లు ఆరోపణలు కోకొల్లలు... ఇంతలా బరితెగింపు ఎలా వచ్చిందా అని జనం విస్తపోతున్నారు. ఇక్కడకు ఏ రెవెన్యూ అధికారి వచ్చిన యధాస్థితి. అడ్డు ఆపు లేకుండా దోచుకోవడమే తప్ప జంకె ప్రసక్తి లేదు దీని వెనక పెద్ద హస్తాలే ఉంటాయి అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొబ్బిలి మండలం, పట్టణం ఎక్కడైనా సరే ఖాళీ స్థలం దొరి కితే కబ్జా చేసెయమని రెవెన్యూ సిబ్బంది లోలోపల సూచనలు చేస్తారు అని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఐటిఐ కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పట్టణంలో ఒక టిఫిన్ షాప్ యాజమాని ఎప్పుడో పాత పట్టాన్ని తీసుకొచ్చి ఇండోర్ స్టేడియం రహదారి మార్గాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఇది తెలిసి తెలియనట్లు రెవెన్యూ సిబ్బంది మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై ప్రజా సంఘాలు ఆరోపణలు చేస్తే గాని దీనిపై చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం విషయం రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్ డిటి సుబ్బారావు వద్ద ప్రస్తావించగా తాము ఎలాంటి అనుమతులు. ఇవ్వలేదని గతంలో ఇచ్చిన పట్టా నా వద్ద ఉందని చెబుతున్నాడు సదరు వ్యక్తి. పట్టాలో ఉన్నది ఒక స్థలం అయితే ఈయన నిర్మాణం చేపడుతుంది వేరే స్థలం పనులు ఆపాలని తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు వాటిపై పనులు చేపట్టకూడదని అన్నారు అని చెప్పారు దీనిపై పోలీసులు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. భైరసాగరం వద్ద ప్రభుత్వ స్థలం విషయమై ఆర్ ఐ తో మాట్లాడితే జిరాయితీ భూముల్లోనే నిర్మాణాలు జరుగుతున్నాయి అన్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న మన్నారు. ప్రహరీ నిర్మాణానికి అనుమతుల కోసం రియల్ ఎస్టేట్ యాజమాన్యం ఆన్లైన్లో దరఖాస్తు చేశారని ఇంకా పరిశీలిస్తున్నమని పట్టణ ప్రణాళిక విభాగ అధికారి ఫిలిప్ చెప్పారు. ఇదొక్కటే కాదు రెవెన్యూ అధికారులు అండతో ఇందిరమ్మ కాలనీ అయితే కాలనీ పక్క వలసల్లో కూడా భాగాలు వేస్తున్నారంటే వారికి పెద్దదిక్కు ఏదో ఉందని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పూర్తిగా సర్వే నెంబర్లు మార్చి నిర్మాణాలు చేపడుతున్న రెవెన్యూ సిబ్బంది నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడంతో సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. 347ఏ లో 16. 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది సర్వే నెంబరు 364లో నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ రికార్డులు ఎలా మార్చారని రిజిస్ట్రేషన్ చేశారని విమర్శలు గుప్పుమంటున్నాయి దీనిపై జిల్లా అధికారులు చొరవ తీసుకొని సమగ్ర దర్యాప్తు చేస్తే ఇక్కడ భూభాగోతం సమూలంగా తెలుస్తుంది. బొబ్బిలి ప్రజలు ఆశిస్తున్నారు. దీనిపై డిటి సుబ్బారావు వివరణ కోరగా ఆ రికార్డులన్నీ తాసిల్దార్ చూస్తారని నా వద్దకు ఇంకా రాలేదని వివరణ ఇచ్చారు.

## గ్రామాల్లో కార్డన్ సెర్చ్



కురుపాం, మే13, ప్రభాతవార్త : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం సర్కిల్ పరిధిలో గల చినమేరంగి మరియు మొండెంఖల్లు గ్రామంలో ఏ. సంతోష్, పార్వతీపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ. సంతోష్ ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించి వారందరికీ నాటు సారా వలన కలిగే అనర్థాలు గూర్చి తెలియజేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు.నాటుసారా వ్యాపారానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తదుపరి కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసు లలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని వేలం వేయడం జరిగిందిన తెలిపారు.

## మ్యాజిక్ డ్రైనేజీ పనుల పరిశీలన



బలిజిపేట, మే13, ప్రభాతవార్త : మండలం పెద్ద పెంకి గ్రామంలో బుధవారం రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గుంటూరు నుండి వచ్చి పెదపెంకి లో జరుగుతున్న మ్యాజిక్ కంట్రోల్ డ్రైనేజీ సిస్టం స్వయంగా పరిశీలించారు గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో ప్రత్యేకంగా ఈ యొక్క గ్రామాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో నిధులు మంజూరు తో ఈ గ్రామాన్ని పూర్తిగా పూర్తిస్థాయిలో డ్రైనేజీ వేస్ట్ ను ఒక క్రమబద్ధంలో తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని విలేకరుల సమావేశంలో బి గోపీనాథ్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, గుంటూరు వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు కే రామచంద్రరావు ప్రాజెక్ట్ డైరెక్టర్, డిప్యూటీ ఎంపీడీవో పుష్పారావు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ, ఉపాధి హామీ సిబ్బంది కే కేశవరావు ఏపీవో, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత



పాచిపెంట, మే 13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన పాచిపెంట తహసిల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం రాజముద్రతో ముద్రించిన పట్టాదారుని పాస్ పుస్తకాలను తహసిల్దార్ రవి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ సభ్యులు పల్లెడ ఉమామహేశ్వరరావు ఏఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు పెద్ద పీట వేశారని రైతు క్షేమమే ప్రభుత్వ ధ్యేయమనీ వారు అన్నారు. గతంలో అప్పటి ప్రభుత్వం రైతుల కుఇవ్వవలసిన పట్టా పాస్ పుస్తకాల్లో అప్పటి సీఎం ఫోటోను ముద్రించి రైతులు భూమును వారి కబంధ హస్తాల్లో ఉంచుకునే ప్రయత్నం అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేశారని ఆయన అన్నారు. రైతులు సంక్షేమం కొరకు రైతులకు నూతనంగా పట్టా పాస్ పుస్తకాల రాజముద్రతో ముద్రించి రైతులకు అందజేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకి దక్కిందని ఏఎంసి డైరెక్టర్ పూసర్ల నర్సింగ్ రావు ఎంపీటీసీ సభ్యులు ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు అధ్యాపకుడు రామారావు ఆర్థిక ప్రోత్సాహకాలు



లక్కవరపు కోట, మే13, ప్రభాత వార్త : మండలంలోని గంగుబూడి హైస్కూల్లో చదువుకొని ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరిచి 594 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆగ్రామానికి చెందిన ఉమా పార్వతికి విశాఖపట్నం డాక్టర్ వి ఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. వి . రామారావు 5 వేలు ఆర్థికప్రోత్సాహం అందచేసి ప్రోత్సహించారు. అలాగే వానపల్లి మనోజ్, దొడ్డి సాత్విక , ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 464/470 మార్కులు సాధించిన కోసూరు పూర్ణిమలకు 2 వేలు చొప్పున నగదు బహుమతులు అందచేసారు. పూర్వం గంగుబూడి హైస్కూల్లోనే చదువుకున్న డాక్టర్ ఎస్ వి రామారావు ప్రతీ ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తనవంతుగా సాయమందించి ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది అద్భుత ప్రతిభతో జిల్లా టాపర్ గా నిలిచిన ఉమాపార్వతితో పాటు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులకు నగదు బహుముతులు అందచేసారు. అలాగే వారి ఉన్నత చదువులకు సాయమందిస్తానని హామీఇచ్చారు. పట్టుదలతో చదివి ఉన్నతమైన లక్ష్యాలను సాధించి గ్రామానికి ఇంకా మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా డాక్టర్ రామారావు విద్యార్దులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్రి ఈశ్వరరావు, కోసూరు వెంకటరమణ, ఉపాధ్యాయులు గుడే శారద, పొనగంటి మోహన్ రావు , ఇమంది శ్రీనివాసరావు, నీలి ప్రసాద్, కోసూరు అప్పలరాజు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పదోతరగతి టాపర్‌కు రూ. 50 వేలు ఆర్థిక సాయం



లక్కవరపు కోట, మే 13, ప్రభాత వార్త: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా రాణించి అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణమని ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వై. ఉమాపార్వతి 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎల్.కోటలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు విద్యార్థిని ఉమాపార్వతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదరికంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని జిల్లా టాపర్‌గా నిలవడం నియోజకవర్గానికే గర్వకారణమని కొనియాడారు. ఉన్నత చదువులకు భరోసా ఇచ్చారు భవిష్యత్తులో మెడిసిన్ చదవాలన్న తన కోరికను ఉమాపార్వతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆమె తక్షణమే స్పందించారు. విద్యార్థిని లక్ష్యానికి అండగా నిలుస్తూ, ఇప్పటి నుంచి మెడిసిన్ పూర్తయ్యే వరకు తన సొంత నిధుల నుంచి ఏటా రూ. 50,000 ఆర్థిక సాయం అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని, ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, కొత్తవలస పి ఏ సి ఎస్ ఛైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ, ఎల్ కోట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గండి శ్రీరామ మూర్తి, గంగుబూడి మాజీ వైస్ ప్రెసిడెంట్ పెదిరెడ్ల ఈశ్వరరావు, కోసూరి అప్పలరాజు, రేగ మాజీ సర్పంచ్ ఎడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రావాడ ఈశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## సాలూరు పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ విజ్ఞప్తి



సాలూరు, మే 13, ప్రభాత వార్త : జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షన్ 2026 ప్రోగ్రాంలో భాగంగా మున్సిపల్ అధికారులు,సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఇంటికీ వెళ్లి వ్యర్థాలను నాలుగు రకాలుగా విడదీయ డంపై అవగాహన కల్పించాలని ఇంకా తడి,పొడి హానికర వ్యర్థాల విభజించి సేకరించాలని క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా వ్యాపారస్తులు, హోటల్ యజమానులు తమ దుకాణాల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, రోడ్లపై చెత్త వేయకుండా చూసుకోవాలని సూచనలు చేసారు.ప్రతిరోజు ఉదయం చెత్త సేకరించే విధంగా మైకుల ద్వారా స్వచ్ఛత సందేశాలను వినిపించడం అలాగే మనమంతా బాధ్యతగా వ్యర్థాలను వేరు చేసి సకాలంలో మున్సిపల్ అధికారిక పోర్టల్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ అందించి మన పట్టణాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని స్పష్టం చేసారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై గిరిజనులకు అవగాహన




కురుపాం, మే 13 ప్రభాతవార్త : వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి. నారాయణ రావు అన్నారు. బుధవారం బియ్యాలవలస పంచాయతీ సింగపురంలో యువతకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రమాదాలు జరుగుటకు కారణము ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం అని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## 15న నెల్లిమర్లలో ఉచిత గుండె వైద్యశిబిరం

నెల్లిమర్ల, మే 13 ప్రభాతవార్త : విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ హాస్పిటల్, నెల్లిమర్ల శ్రీ చిన్నమాంబ సేవ యోజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. నెల్లిమర్లలోని శ్రీ ఆదిత్య విద్యాలయంలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి వస్త్రాది సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె సంబంధిత వైద్యులు డా. విద్యా సాగర్ కరణం రోగులను పరీక్షించనున్నారు. శిబిరంలో బిపి, షుగర్ టెస్ట్, 2డి ఎకో, ఈసీజీ ఉచితంగా తీయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరాన్ని నిర్వహించనున్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## కేర సురక్ష బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శృంగవరపుకోట, మే13, ప్రభాతవార్త : కొబ్బరి కార్మికులు కేర సురక్ష బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి పూస ర్లస్వాతి తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కొబ్బరి అభివృద్ధి బోర్డు సంయుక్త సహకారంతో కొబ్బరి కార్మికుల సామాజిక భద్రత,ఆర్థిక రక్షణ కల్పించేందుకు కేర సురక్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.మొత్తం బీమా ఏడు లక్షల రూపాయలుగా నిర్ధారించేరన్నారు. మరణం,శాశ్వత వైకల్యం సంభవిస్తే ఏడు లక్షలు,శాశ్వత పాక్షిక వైకల్యంకు మూడు లక్షల యాభై వేల రూపాయలు కార్మికుల కుటుంబానికి చెల్లించడం జరుగుతుందని తెలిపారు.ఇలా బీమా పథకంలో పలు అంశాలు రూపొందించారన్నారు.ఇక బీమా ప్రీమియం చెల్లింపు విషయానికొస్తే మొత్తం ప్రీమియం 956రూపాయలు కాగా ఇందులో కొబ్బరి అభివృద్ధి బోర్డు వాటా కింద 813రూపాయలు,ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు వాటా కింద100,కార్మికులు వాటా కింద కేవలం 43 ప్రీమియం చెల్లించాలని ఆమె తెలిపారు.బీమా పొందేందుకు సీడీబీ దరఖాస్తు తీసుకుని అందులో ఆధార్ కార్డు,బ్యాంకు పాస్ పుస్తకం నకలు పత్రాలను జత చేసి కార్యాలయానికి అందజేయాలని మరింత సమాచారం కోసం కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని కొబ్బరి కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి స్వాతి తెలిపారు.

## జరజాపుపేటలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన



నెల్లిమర్ల, మే 13, ప్రభాతవార్త: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచింది. జరజాపుపేట క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలో ప్రథమ స్థానం సాధించింది. పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి గ్రామ ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు 500 మార్కులకు పైగా 19 మంది సాధించడం విశేషం కాగా, గణితంలో ఐదుగురు విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించి పాఠశాలకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చారు. అలాగే పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి తన విద్యా ప్రమాణాలను చాటుకుంది. ఈ విజయోత్సాహాన్ని గ్రామ ప్రజలకు చేరవేసేందుకు, ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయురాలు సుశర్ల కామేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది వేసవి సెలవుల్లో సైతం గత 11 రోజులుగా గ్రామంలో డోర్ టు డోర్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు, అద్భుత ఫలితాలు గురించి తల్లిదండ్రులకు వివరిస్తూ ఇతర పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను కూడా జరజాపుపేట ఉన్నత పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 30 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్ పొందడం పాఠశాలపై ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది.గ్రామ అభివృద్ధికి విద్యే మార్గమని నమ్ముతూ పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో యాదాది ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను హెచ్‌ఎం కామేశ్వరిని, ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి జరజాపుపేట పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు.

## అంగన్‌వాడీ పిల్లలను సొంత బిడ్డలుగా భావించాలి



శృంగవరపుకోట,మే13,ప్రభాతవార్త : అంగన్వాడీ పిల్లలను సొంత బిడ్డలుగా భావించి సంపూర్ణమైన పౌష్టికాహారం అందించాలని ఎస్.కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ అచ్యుత తెలిపారు.కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా భవానీనగర్‌లో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఓ అచ్యుత మాట్లాడుతూ కిషోర్ బాలికలకు పోషకాహారం,బాల్య వివా హాలు, జీవన నైపుణ్యం గురించి అలాగే కిషోర్ బాలురకు డ్రగ్స్ వలన జరిగే నష్టాలు, చెడు వ్యసనాలు, వేసవికాలంలో స్కిల్ డెవలప్ మెంట్,కంప్యూటర్ గురించి వారికి అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భవానీ నగర్,అమ్మపాలెం, బొడ్డవర, అంబుదాసుపాలెం, మెట్టపాలెం, గాదిలలోవ కేంద్ర కార్యకర్తలు,పిల్లలు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఈగల్ సోషల్ మీడియా అవేర్‌నెస్‌పై అవగాహన




పార్వతీపురం, మే 13, ప్రభాతవార్త: మన్యం జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సబ్‌స్క్రైబ్ ఈగల్ సోషల్ మీడియా అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజీపీ ఆకే రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ, ఈగల్ ఎస్పీ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు జి. భాస్కరరావు ఎస్సై ఆర్టీసీ సిబ్బందికి ఈగల్ విభాగం చేపడుతున్న ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, జాయింట్ ట్రైన్ ఆపరేషన్స్, ఈగల్ కార్యకలాపాలపై వివరించారు. ఈ సందర్భంగా గంజాయి, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, నేర చరిత్రపై పడే ప్రతికూల ప్రభావాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారదాత వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, మాదకద్రవ్యాల కేసుల్లో చిక్కుకుంటే జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. పి. కృష్ణమోహన్ హెడ్ కానిస్టేబుల్, డిపో బీఎం ఎస్. లక్ష్మణరావు, ఆర్టీసీ యూనియన్ నాయకులు కె. నర్సింగరావు, కె.వి. రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## కిశోర్ వికాసంపై అవగాహన సదస్సు



రామభద్రపురం, మే 13, ప్రభాత వార్త : కిషోర్ వికాసం పైన జరుగుతున్న విస్తృత ప్రచారంలో భాగంగా కొట్టకి రామభద్రపురం అంగన్వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్వైజర్ కృష్ణకుమారి సూర్యకుమారి మేరకు అంగన్వాడీ కార్యకర్త బాలలకు వారు తీసుకోవలసిన జాగ్రత్తల పైన పలు విషయాలు తెలిపారు. అలాగే పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవాలని ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో పోషణ అభియాన్ పథకం అమలు చేస్తున్న విషయం గ్రహించాలన్నారు. బాలికల ఎదుగుదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిషోర్ బాలికలు లతో పాటు గర్భిణిలు బాలింతలు ప్రీస్కూల్ పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు : ఏవో



చీపరుపల్లి , మే 13 ప్రభాతవార్త : చిన్న, సన్న కారు రైతులకు మేలు చేసేలా రాష్ట్రీయ కృషి వికాస యోజనలో భాగంగా వ్యవసాయ యంత్రాల పై ప్రభుత్వం భారీగా సబ్సిడీ ధరలను కల్పిస్తూ యంత్ర పరికరాలను సరఫరా చేసిందని మండల వ్యవసాయ శాఖ అధికారిని సూర్యకుమారి బుధవారం నాడు విలేకరులకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు, చిన్న, సన్న కారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఈ పథకం ద్వారా అందించడం జరుగుతుందని వివరించారు.గత 3 సంవత్సరాల లో కనీసం 3 సీజన్లు ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులు, సీసీఆర్సీ హోల్డర్లు ఈ పథకం ద్వారా దరఖాస్తుచేసుకోవాలని.సూచించారు.కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం కల్పించబడుతుందన్నారు. 50 రాయితీ పై వ్యవసాయ యంత్ర పరికరాలు సరఫరా చేయడం జరుగుతుంది అని వివరించారు. ఈ పథకంలో రాయితీ రూ.50,000 /దాటితే ఒక యంత్రం పరికరం, రాయితీ రూ.50,000/ లోపు అయితే రెండు పరికరాలకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం ఈ పథకం ద్వారా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కోత యంత్రాలు, పిచికారీ పరికరాలు మొదలైనవి రాయితీ పై అందించడం జరుగుతుంది అని ఆమె వివరించారు. మే 5 నుంచి 19వ తేదీ వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోగలరని సూచించారు.లాటరీ పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారు 15 రోజుల్లోపు నాన్ సబ్సిడీ ధర చెల్లించాలన్నారు.

## వేడుకగా ఎమ్మెల్యే దంపతుల వివాహ వార్షికోత్సవం



పార్వతీపురం, మే13, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అనూష దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా రైతు బజారు దగ్గర గల వృద్ధుల అనాథ ఆశ్రమంలో పట్టణ అధ్యక్షులు కోలా మధు, కార్యదర్శి మజ్జి వెంకటేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు తినిపించి ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ప్రియతమ నాయకులు, ప్రజల మనిషి, అందరి బంధువు అయిన బోనెల విజయచంద్రఅనూష దంపతులు ఇటువంటి వివాహ వేడుకలు భవిష్యత్తులో తమ మధ్య మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పార్వతీపురాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ మంచి మనసుతో అందరి అభిప్రాయాలు పరిగణంలోకి తీసుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న దూసుకెళ్తున్న ఎమ్మెల్యేకు ఎల్లవేళలా అండదండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్



కురుపాం,మే 13 ప్రభాతవార్త. సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా మలేరియా నివారణకు జిల్లా వ్యాప్తంగా"లార్వా వేట" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి తెలిపారు. బుధవారం జియ్యమ్మవలస మండలం గోర్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మలేరియా కేసులు అధికంగా నమోదయ్యేవని తెలిపారు. అయితే గత ఆరు నెలలుగా"మా ఊరికి మలేరియా వద్దు", "ఫ్రైడే-డ్రై డే" వంటి కార్యక్రమాల ద్వారా చేపట్టిన చర్యల ఫలితంగా కేసులు గణనీయంగా తగ్గాయని వివరించారు . ప్రస్తుతం నమోదవుతున్న స్వల్ప కేసులను కూడా పూర్తిగా అరికట్టేందుకు"లార్వా వేట" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. మంచినీటిలో పెరిగే దోమల లార్వాలను గుర్తించి నిర్మూలించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కొబ్బరి బోండాలు, పాత టైర్లు, రోళ్లు, చెట్టు తొర్రలు, ఇంటి పరిసరాల్లో నీరు నిలిచే ప్రదేశాల్లో దోమలు గుడ్లు పెడతాయని పేర్కొంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విస్తరించేలా ప్రణాళికలు రూపొందించామని, ఇప్పటికే ఎంపీడీవో లకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామని తెలిపారు. వారు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. స్నానం చేసిన తర్వాత చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరూ తప్పనిసరిగా ఒంటికి నూనె రాసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లోని మహిళలు , ప్రజలు సమయాల్లో దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి. చేతుల నిండా కప్పుకునేలా ఫుల్ హ్యాండ్స్ దుస్తులను ధరించాలి. ప్రతి గ్రామంలోని వాగుల వద్ద లార్వా ఐడెంటిఫికేషన్ ప్రక్రియను ముమ్మరం చేసి లార్వా నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో దోమల నివారణకు "వాగు వెంబడి" (వాగు పండగ) అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలోనూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న వాగులను గుర్తించి, అక్కడ పేరుకుపోయిన దోమల లార్వాను నాశనం చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో మాజీ సైనికుడికి 10 రోజుల జైలు.. జరిమాన

విజయనగరం/ లక్క వరపుకోట, ప్రభాత వార్త : లక్క వరపు కోట పోలీసు స్టేషను పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి, ఎల్.కోట పోలీసులకు పట్టుబడిన నిందితుడు జమ్మాదేవి పేట గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కూరిమిని శ్రీనివాసరావుకు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, కొత్తవలస ఎస్.విజయచందర్ 10 రోజుల జైలు శిక్ష మరియు రూ.10,000 జరిమాన.. విధించినట్లుగా జిల్లా ఎస్పీఎ.ఆర్.దామోదర్ మే 12న విలేకరులకు తెలిపారు. ఎల్.కోట ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మే 11న ఎల్.కోట పోలీస్ స్టేసన్ పరిధిలో గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా జమ్మాదేవి పేట గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కూరిమిని శ్రీనివాసరావు మద్యం సేవించి మోటారు సైకిల్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు అని ఎస్ పి అన్నారు. పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా, సదరు వాహన దారుడు మద్యం సేవించి ఉన్నట్లుగా నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని ఎల్.కోట పోలీసులు మే 12న జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, కొత్తవలస వారి వద్ద హాజరుపర్చారగా . జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, కొత్తవలస ఎస్.విజయచందర్ నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష మరియు రూ.10,000 జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతు మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నందున ఈ తరహా నేరాన్ని తీవ్రంగా పరిగణించి, నిందితులకు జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపడం ఖాయమని ఎస్పీ హెచ్చరించారు.

## చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన



బొబ్బిలి, మే 13 ప్రభాతవార్త : మండలంలో కారాడ గ్రామంలో శీజూశిది (చెత్త నుండి సంపద కేంద్రం) తనిఖీ చేసిన స్థానిక ఎంపీడీవో రవికుమార్ వారి వెంట స్థానిక డిప్యూటీ ఎంపీడీవో ఇన్చార్జి కృష్ణమ్మ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డివి అప్పారావు ,జిల్లా దీశిలిది కోఆర్డినేటర్ తమ్మిరెడ్డి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఆషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.నిర్వహణ కోసం తగు చూచనల జారీ చేయడం అయినది.

## వెయిట్‌లిఫ్టింగ్‌లో జ్ఞానేశ్వరి జాతీయ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్ రెండవ రోజున జ్ఞానేశ్వరి యాదవ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రెండు పతకాలను కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన మహిళల 53 కేజీల విభాగంలో భారత వెయిట్‌లిఫ్టర్ స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తి, తన సొంత జాతీయ రికార్డు అయిన 87 కేజీలను బద్దలు కొట్టింది. ఆమె 83 కేజీలు, 86 కేజీలు, మరియు 88 కేజీల బరువులతో స్నాచ్ ప్రయత్నాలు చేయగా, చివరి విజయవంతమైన లిఫ్ట్‌తో 95 కేజీలు నమోదు చేసిన చైనాకు చెందిన జావో జిన్లాన్ వెనుక నిలిచింది. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో జ్ఞానేశ్వరి తన తొలి ప్రయత్నంలో 103 కిలోల బరువును విజయవంతంగా ఎత్తింది. ఆ తర్వాత ఆమె తన రెండవ ప్రయత్నంలో 106 కిలోల బరువును ఎత్తడానికి ప్రయత్నించగా, అది మొదట విజయవంతమైనట్లు కనిపించినప్పటికీ, న్యాయనిర్ణేతలు దానిని విఫలమైనదిగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారత జట్టు సవాలు చేసినప్పటికీ, తీర్పులో ఎలాంటి మార్పు రాలేదు. జ్ఞానేశ్వరి 106 కిలోల బరువుతో తన చివరి ప్రయత్నానికి తిరిగి వచ్చి, ఆ లిఫ్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసి, మొత్తం 194 కిలోల (88 కిలోలు+106 కిలోలు) లిఫ్ట్‌తో పోటీని ముగించింది. ఆమె మొత్తం స్కోరుతో మహిళల 53 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ప్రారంభ రోజున మహిళల 48 కేజీల విభాగంలో కోమల్ కోహార్ పతకం సాధించిన తర్వాత, జ్ఞానేశ్వరి గెలుచుకున్న పతకాలతో ఈ ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు రెండవ మరియు మూడవ పతకాలు లభించాయి.

## ఆసియా బాక్సింగ్‌లో ఫైనల్స్‌కు 8 మంది మహిళా బాక్సర్లు

### మరో నలుగురికి కాంస్యాలు



**న్యూఢిల్లీ:** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అండర్17 మహిళల విభాగంలో ఎనిమిది మంది బాక్సర్లు ఫైనల్స్‌కు చేరుకోగా, నలుగురు బాక్సర్లు కాంస్య పతకాలతో ముగించారు. అలాగే పురుషుల విభాగంలో లక్ష్య్ ఫైనల్‌కు చేరగా, మరో నలుగురు కాంస్యాలు సాధించారు. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన బాలికల విభాగంలో రాఖీ (46 కేజీలు) యాటింగ్ జాంగ్ (చైనా) పై మూడవ రౌండ్‌లో గెలుపొందింది. ఖుషీ చంద్ (48 కేజీలు) ముంగుంజుల్ అల్తమ్‌గదాసపై (మంగోలియా) 5-0 తేడాతో ఆధిపత్య తెచ్చుకుంది. నవ్య (57) డాగీమా చులుతుమర్ (మంగోలియా)పై రెండవ రౌండ్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. 60 కేజీల బౌట్‌లో ఇషికా బాలిమ్ గాబిట్కిజీ (కజకిస్తాన్) తో జరిగిన పోరులో 2-3 తేడాతో ఓడిపోయింది.

దియా (63) జియాఎన్ సాంగ్ (చైనీస్ తైపీ)పై మొదటి రౌండ్‌లోనే విజయాన్ని సాధించింది. హర్నూర్ కౌర్ (66) అయౌలిమ్ ఒస్పనోవా (కజకిస్తాన్) చేతిలో 0-5 తేడాతో ఓడిపోగా, హిమాన్షి (70) జూడ్ (హబీజోర్డాన్) పై, జ్యోతి (75) చెందిన చెంగ్‌హుయ్ జౌ (చైనీస్ తైపీ)పై మొదటి రౌండ్‌లో గెలుపొందారు. వంశిక (80) ఫెరుజాబోను కమోలోవా (ఉజ్బెకిస్తాన్) పై 4-1 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. పురుషుల 75 కేజీల విభాగంలో లక్ష్య్ ఫోగట్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి కొరియాకు చెందిన సియోంగ్మిన్ లీని 5-0 తో ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నాడు.

## థాయ్‌లాండ్ ఓపెన్‌లో సింధు, శ్రీకాంత్ విజయం

### ఆయుష్, తరుణ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ విజయంతో రెండో రౌండ్‌కు చేరుకోగా, వర్ధమాన ఆటగాడు ఆయుష్ శెట్టి హోరాహోరీగా పోరాడి ఓటమితో టోర్నమెంట్ నుండి నిష్క్రమించాడు. బ్యాంకాక్‌లో బుధవారం జరిగిన ఈ టోర్నీలో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధు తన తొలి రౌండ్ పోరులో కేవలం 33 నిమిషాల్లోనే చైనీస్ తైపీకి చెందిన తుంగ్ సియోటాంగ్‌ను 21-9, 21-12 తేడాతో చిత్తు చేసింది. ఇక ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు రీమ్యాచ్‌గా జరిగిన పోరులో సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూను 21-14, 21-15 తేడాతో ఓడించి, శ్రీకాంత్ అద్భుతమైన ప్రదర్శనతో రౌండ్ ఆఫ్ 16లోకి దూసుకెళ్లాడు. అయితే, ఆయుష్ శెట్టి





మ్యాచ్‌ను నిర్ణయాత్మక సెట్‌కు తీసుకువెళ్లినప్పటికీ, జపాన్‌కు చెందిన ఆరో సీడ్ కోడై నరవోకపై ఆ ఊపును కొనసాగించలేక పోయాడు. 2-1 అనుకూలమైన హెడ్‌టు హెడ్ రికార్డుతో మ్యాచ్‌లోకి ప్రవేశించిన ఆయుష్ తొలి గేమ్‌లో ఓటమి తర్వాత పుంజుకుని, స్కోరును 1-1తో సమం చేశాడు. కానీ మూడవ గేమ్‌లో ఏకపక్షంగా నరవోక 59 నిమిషాల్లో 21-13, 17-21, 21-4 తేడాతో విజయాన్ని అందుకున్నాడు. మరోవైపు, యువ క్రీడాకారిణి ఉన్నతి హూడా, స్థానిక క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌ను 11-21, 21-17, 21-16 తేడాతో ఓడించింది. అలాగే 19 ఏళ్ల అన్మోల్ ఖర్బ్ ప్రస్తుత ఛాంపియన్ చెన్ యు ఫేను ఓడించడంలో విఫలమయింది. తొలి గేమ్‌ను గెలుచుకుని, నిర్ణయాత్మక గేమ్‌లో 11-2 ఆధిక్యం సాధించినప్పటికీ, చెన్ మరింత తీవ్రత పెంచడంతో అన్మోల్ ఓటమి చెందింది. ఇక జపాన్‌కు చెందిన కోకి వతనాబే చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోవడంతో మన్నేపల్లి తరుణ్ ప్రయాణం ముగిసింది.



## రివర్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్

### 65.7 శాతానికి పడిపోయిన ప్లేఆఫ్స్ ఛాన్స్

**న్యూఢిల్లీ:** శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపుగా ఖరారు చేసుకుంది. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై సాధించిన అద్భుతమైన 82 పరుగుల విజయం ఆ జట్టుకు కీలకమైన 16 పాయింట్లను తెచ్చిపెట్టింది. సాధారణంగా 12మ్యాచ్‌లలో 16పాయింట్స్‌ను ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారుచేసుకునే మేజిక్ నంబర్‌గా పరిగణిస్తారు. ఈగెలుపుతో ఇతరజట్ల ప్లేఆఫ్స్ అవకాశాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించే అవకాశాలు 94.9 శాతానికి పెరిగాయి. దీనికి భిన్నంగా సన్ రైజర్స్ అవకాశాలు 80% నుంచి 65.7శాతానికి పడిపోయాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్ అవకాశాలు80.1%నుంచి79.7శాతానికి తగ్గగా, చెన్నై సూపర్ కింగ్స్ అవకాశాలు స్వల్పంగా 42.7 శాతం నుంచి 42.8 శాతానికి పెరిగింది. నాలుగో స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ ఛాన్సెస్ కూడా 62.5% నుంచి 62.7 శాతానికి పెరిగాయి. ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను అధిగమించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్తుత స్థానం చూస్తే 11 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో (14 పాయింట్లు) పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో కొనసాగుతోంది. సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే మరిన్ని విజయాలు అవసరం ఉంటుంది. ఇక సన్‌రైజర్స్‌కు మిగిలి ఉన్న 3 మ్యాచ్‌లలో కనీసం 1లేదా 2గెలిస్తే, ఎలాంటి డోకాలేకుండా ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. అయితే ఈ మ్యాచ్‌ల్లో గట్టి పోటీ ఎదురుకానుంది. గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులతో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా సేఫ్ జోన్‌లో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక అంశాల్లో ప్రధానంగా +0.737తో మెరుగైన నెట్ రన్ రేట్‌తోఉంది. ఇది పాయింట్లుసమానంగా ఉన్నప్పుడు ప్లేఆఫ్స్ రేసులో చాలా సహాయపడుతుంది. ముఖ్యమైన మ్యాచ్‌లు చూస్తే గుజరాత్‌తో జరిగిన మ్యాచ్ వంటి కీలక పోరులు సన్‌రైజర్స్ స్థానాన్ని నిర్ణయిస్తాయి. సన్‌రైజర్స్ తన ఫామ్‌ను కొనసాగిస్తే, టాప్2 లేదా టాప్4లో క్వాలిఫై కావడం దాదాపు ఖాయం అవుతుంది.

## పాక్ ఘోర ఓటమి

### 104 రన్స్‌తో బంగ్లాదేశ్ చరిత్రాత్మక విజయం

**న్యూఢిల్లీ:** రెండు టెస్టుల సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో 104 పరుగుల తేడాతో విజయం సాధించిన బంగ్లాదేశ్ తమ స్వదేశంలో పాకిస్థాన్‌పై మొట్టమొదటి టెస్టు విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఢాకాలో జరిగిన ఈ మ్యాచ్‌లో 268 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ను వారి రెండవ ఇన్నింగ్స్‌లో 163 పరుగులకే ఆలౌట్ చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని సాధించింది. బంగ్లాదేశ్ అంతకు ముందు తమ తొలి ఇన్నింగ్స్‌లో 413 పరుగులు చేసి రెండో ఇన్నింగ్స్‌ను 240/9 వద్ద డిక్లేర్ చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 386



పరుగులు చేసినప్పటికీ నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హోస్సేన్ శాంటో ఇన్నింగ్స్‌లో 130 బంతుల్లో 101 పరుగులతో చిరస్మరణీయ ప్రదర్శన చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 87 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో పాక్ ప్లేయర్ అజాన్ అవైస్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించగా, మహ్మద్ రిజ్వాన్ (59), సల్మాన్ అలీ అఘా (58) పోరాట పటిమతో కూడిన అర్థ సెంచరీలు సాధించాడు. అయితే చివరి ఇన్నింగ్స్‌లో బంగ్లా బౌలర్లు ఆధిపత్యం చెలాయించడంతో, ఐదవ రోజున ఆతిథ్య జట్టు మ్యాచ్‌ను సునాయాసంగా ముగించింది.

## 10% పెరిగిన ఎయిర్‌టెల్ నికరలాభం!

**ముంబయి, ఏప్రిల్ 13:** టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ నాలుగో త్రైమాసికంలో నికరలాభాలు 10శాతం పెరిగి రూ.6631కోట్లనుంచి రూ.7325 కోట్లకు చేరాయి. ప్రతికస్టమరు పైనా సగటు రాబడి మాత్రం స్వల్పంగా తగ్గింది. రూ.259 నుంచి రూ.257గా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. అదే గత ఏడాది రూ.245తో పోలిస్తే పెరిగింది. లావాదేవీలనుంచి రాబడుల 2.6శాతంపెరిగి రూ.53,982 కోట్లనుంచి రూ.55,383 కోట్లుగా ఉంది. వడ్డీ, పన్నులు తరుగుదలతో కూడిన రాబడులు రూ.30,783 కోట్లనుంచి రూ.31,492 కోట్లకు చేరాయి. ఈత్రైమాసికంలో ఇబిటిడిఎ మార్జిన్ నిలకడగా 56.9 శాతంగానే ఉంది. అదనంగా ఎయిర్‌టెల్




తుది విడత డివిడెండ్ రూ.5 విలువ ఉన్న షేరుకు రూ.24గాప్రకటించింది. రికార్డు తేదీ, అర్హులైన వాటాదారుల వివరాలనుసత్వరమే వెల్లడిస్తామని ప్రకటించింది. కంపెనీ రుణం ప్రస్తుతం రూ.1.65 లక్షలకోట్లుగా ఉంది. అదే అంతకుముందు త్రైమాసికంలోచూస్తే ఏకంగా రూ.1.83 లక్షలకోట్లుగా ఉంది. ఇండియా మొబైల్ బిజినెస్ స్థిరంగా ఉందని రూ.28,831 కోట్లకు పెరిగినట్లు కంపెనీ వివరించింది. హోంబ్రాడ్‌బాండ్ విభాగంలో ఎబిడిటా 1రూ.1100 కోట్లనుంచి రూ.2191 కోట్లుగా ఉంది. కస్టమర్ బేస్ కూడా 36.85 కోట్లనుంచి 37.32 కోట్లకుపెరిగింది. 4జి బేస్ కూడా 29.10 కోట్లనుంచి 29.68 కోట్లకు చేరింది.

## సర్వోదయ బ్యాంకు లైసెన్సు రద్దు చేసిన ఆర్బీఐ

**ముంబయి, మే 13:** కొత్త బ్యాంకుల ఆర్థిక లావాదేవీలునిర్వహణలో ఆర్బీఐ నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాటించని పరిస్థితుల్లో బ్యాంకులకు భారీ జరిమానా వేయడంతోపాటు అవసరమైతే లైసెన్సులను కూడా రద్దుచేస్తుంది. గ్రామీణ బ్యాంకులు, సహకారబ్యాంకులు, ప్రైవేటు వాణిజ్యబ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు అన్నింటిపైనా ఆర్బీఐకి పర్యవేక్షణాధికారాలుంటాయి. తాజాగా ముంబై ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సర్వోదయ కోఆపరేటివ్ బ్యాంక్




లైసెన్స్ రద్దు చేసింది. ఈ బ్యాంక్ దగ్గర తగినంత మూలధనం లేదని భవిష్యత్తులో కూడా లాభాలు గడిస్తాయన్న అంచనాలు లేవని ఈ కారణంతోనే లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ తెలిపింది. బుధవారం నుంచే ఈ సహకార బ్యాంకు ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా ఆంక్షలు విధించింది. తమ రెగ్యులేటరీ నిబంధనల్ని పాటించని కారణంగా భవిష్యత్తులోనూ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. ఇక్కడ చట్టపరంగా మూసివేస్తున్నందున బ్యాంక్ ఆస్తుల్ని అమ్మి అప్పులు తీర్చేందుకు లిక్విడేషన్ ప్రాసెస్‌ను ప్రారంభించాలని మహారాష్ట్ర రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, కమిషనర్ ఫర్ కోఆపరేషన్‌ను ఆదేశించింది. ఇందుకోసం లిక్విడేటర్‌ను నియమించాలని కోరింది.

బ్యాంక్ దివాలా తీసినప్పుడు లేదా లైసెన్స్ రద్దు చేసినప్పుడు ప్రతి డిపాజిటర్‌కు బీమా రక్షణ ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ కింద గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకు డిపాజిట్ చేసిన వారికి డబ్బులు తిరిగొస్తాయి. ఆపైన ఎంత డిపాజిట్ ఉన్నా గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకే వెనక్కి వస్తుంది. అయితే బ్యాంక్ నివేదించిన డేటా ప్రకారం డీఐసీజీసీ కింద 98.36 శాతం వరకు డిపాజిటర్లు పూర్తి స్థాయిలో తమ డిపాజిట్లను పొందనున్నారు.

## వాణిజ్యం



## నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్, నిఫ్టీ!

**ముంబయి, మే 13:** దేశీయ సూచీలు వరుసగా రెండు రోజులు భారీ నష్టాలను చవిచూసిన తర్వాత బుధవారం స్వల్ప లాభాలను ఆర్జించాయి. ఉదయం భారీ నష్టాల్లో కొనసాగినా మధ్యాహ్నం కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం సూచీలకు కలిసి వచ్చింది. అలాగే అంతర్జాతీయంగా కాపర్ ధరలు పెరగడంతో మెటల్ స్టాక్స్ భారీగా లాభపడ్డాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాలతో రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (74,559)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు వెళ్లింది. అయితే మధ్యాహ్నం తర్వాత సూచీలు కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్ఠంతో పోల్చుకుంటే సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లు పైకి వచ్చింది. చివరకు సెన్సెక్స్ 49 పాయింట్ల లాభంతో 74,608 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 33 పాయింట్ల లాభంతో 23,412 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో సెయిల్, డిక్సన్ టెక్నాలజీస్, వొడాఫోన్ ఐడియా, వేదాంత, మనప్పురం ఫైనాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. మ్యాక్స్ ఫైనాన్సియల్స్, టాటా పవర్, పేటీఎమ్, కెఫిన్ టెక్నాలజీస్, ఎయిచర్ మోటార్స్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 99 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 460 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్‌కు 107 డాలర్లవద్ద ట్రేడ్ అవుతుంటే బంగారం ఔన్స్ ఒక్కింటికి 4701 డాలర్లుగా ట్రేడ్ అవుతోంది. టాటా స్టీల్ 3.63శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.78శాతం, ఎల్‌అండ్‌టి 1.56శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.71శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.27శాతం పెరిగాయి. మార్కెట్లపరంగాచూస్తే బిఎస్ఇలో 2407 కంపెనీలు పెరిగితే 1793 కంపెనీలు స్వల్పనష్టాలతోముగిసాయి. మరో 177 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 5.91శాతంపెరిగి రూ.1,62,512 గా ట్రేడ్ అయ్యాయి.

## పెట్రోలు, డీజిల్ ధరలు పెంచక తప్పదు!

### ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్‌మల్హోత్రా

**జెనీవా, మే 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధం వల్ల పెరుగుతున్న ఇంధన ధరలు దేశ ద్రవ్యోల్బణ లక్ష్యాలకు సవాలుగా మారుతున్నాయని, దీనిపై ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు. స్విట్జర్లాండ్‌లో మంగళవారం జరిగిన ఒక సదస్సులో మల్హోత్రా



మాట్లాడుతూ పశ్చిమాసియా సంక్షోభం ఇలాగే కొనసాగితే, రిటైల్ ఇంధన ధరల పెంపు అనేది కేవలం సమయం మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, ద్రవ్యోల్బణం మరింత అధికమవుతుందని హెచ్చరించారు. ఆర్‌బీఐ తదుపరి ద్రవ్య పరపతి విధాన సమావేశం జూన్ 5న జరగనుందని, వడ్డీ రేట్లపై అప్పుడు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ సమావేశంలో ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. పరిస్థితిని బట్టి మా విధానాలు ఉంటాయి. షాక్ తాత్కాలికమైతే సర్దుకుపోతాం. అది దీర్ఘకాలం కొనసాగితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. మరోవైపు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని, ధరల పెంపు అనివార్యం కావచ్చని సూచనప్రాయంగా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటినప్పటికీ, దేశంలో ధరలు పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని ఆయన వెల్లడించారు.

భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇప్పటివరకు చమురు సంస్థల అండర్‌రికవరీలు రూ.1.98 లక్షల కోట్లకు చేరగా, ప్రస్తుత జూన్ త్రైమాసికంలో నష్టాలు రూ.1 లక్ష కోట్లకు దగ్గరగా ఉన్నాయని పూరి తెలిపారు. సరఫరాకు అంతరాయం కలగకుండా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, ప్రస్తుతం దేశంలో 76 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం, చమురు సంస్థలు నష్టాలు భరించడం ద్వారా ప్రభుత్వం ధరలను నియంత్రించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెంపు అనివార్యమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## వెండి, పసిడి దిగుమతులపై సుంకాలు పెంపు!



**న్యూఢిల్లీ, మే 13:** బంగారం, వెండి కస్టమర్లకు కేంద్ర సర్కారు మళ్లీ షాకిచ్చింది. ఆ ఖరీదైన ఖనిజాలపై దిగుమతి సుంకాన్ని పెంచేసింది. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని ఆరు నుంచి 15 శాతానికి పెంచినట్లు కేంద్రం ప్రకటించింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దిగుమతి సుంకం గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బంగారం, వెండి సరఫరాను తగ్గించే ఉద్దేశంతో దిగుమతి సుంకాన్ని పెంచేశారు. పొదుపు చర్యల్లో భాగంగా ఓ ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నియంత్రించుకోవాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. విదేశీ మారకం నిల్వలను పెంచుకునే ఉద్దేశంతో ఈ చర్య తప్పదన్నారు. దీనిలో భాగంగానే బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. సుంకాన్ని పెంచడంతో ఓవరాల్‌గా బంగారంపై కస్టమ్స్ డ్యూటీ 15 శాతం పెరిగినట్లు అవుతంది. 2025-26 సీజన్‌లో బంగారం దిగుమతిలో భారత్ ఆల్ రికార్డు సృష్టించింది. 24 శాతం దిగుమతి పెరిగింది. సుమారు 72 బిలియన్ల డాలర్ల వ్యాపారం జరిగినట్లు భావిస్తున్నారు. బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం 10 గ్రాముల బంగారం రూ.లక్షా 55 వేలుగా ఉన్నది. ఇక వెండి కిలో 2 లక్షల 77 వేలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా బంగారం అధికంగా వినియోగిస్తున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉన్నది. మొదటి స్థానంలో చైనా ఉంది.

## రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌లో ఇన్‌సైడర్‌ట్రేడింగ్ రూ.1.99 కోట్లు చెల్లించాలని సెబీ ఆదేశం

### రష్మిసలూజాపై రూ.40 లక్షల జరిమానా

**న్యూఢిల్లీ, మే 13:** రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసారని సెబీ 'సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న రెష్మీ సలూజాను దోషిగా తేల్చింది. ఈ ఇన్‌సైడర్‌ట్రేడింగ్‌లో అనుచిత లబ్దిని పొందిన రూ.1.99 కోట్లలాభాలను తిరిగి చెల్లించాలని సెబీ ఆదేశించింది. అలాగే రష్మి సలూ జాపై రూ.40 లక్షల జరిమానా కూడా విధించింది. 2023 సెప్టెంబరులో బర్మన్ కుటుంబంప్రకటించనున్న ఓపెన్ ఆఫర్‌కు సంబంధించి ముందుగా వెల్లడించిన ధరలకు ప్రభావంచూపే సమాచారం తన వద్ద ఉన్నప్పటికీ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లను సలూజా విక్రయించారని సెబీ వెల్లడించింది. సెబీ వివరాల ప్రకారం సెప్టెంబరు 25న ఓపెన్ ఆఫర్ బహిరంగ ప్రకటనకు ముందే రష్మిసలూజా 21,22 తేదీల్లో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సుమారు 12.9 లక్షల షేర్లను విక్రయించారు. దీనితో కంపెనీ షేర్ ధరలు పడిపోవడంతోసుమారు రూ.2 కోట్ల నష్టం తప్పించుకునేందుకు ఈ ట్రేడింగ్



తోడ్పడిందని సెబీ ధృవీకరించింది. ఓపెన్ ఆఫర్ బహిరంగ ప్రకటనముందే బర్మన్ గ్రూప్ ఈప్రణాళిక గురించి రష్మి సలూజాకకు సమాచారం ఇచ్చిందని ఉత్తర్వుల్లో తెలిపింది. దర్యాప్తులోభాగంగా వాట్సాప్‌సంభాషణలు, సమావేశాల రికార్డులు, హోటల్ రికార్డులు ఆధారాలుగా సెబీ చూపింది. అన్‌పబ్లిష్డ్ ప్రైసింగ్ సెన్సిటివ్ ఇన్‌ఫర్మేషన్(యుపిఎస్ఐ)తనవద్ద ఉన్న సమయంలోనే నోటీసుదారు ఆర్‌ఈఎల్ షేర్లలోట్రేడింగ్‌చేసి ఇన్‌సైడర్‌ట్రేడింగ్ నిబంధనలు ఉల్లంఘించారని సెబీ వెల్లడించింది. బర్మన్‌కుటుంబానికి ఉన్న నాలుగు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు చేసిన ఫిర్యాదు ఆధారంగా విచారణ ప్రారంభించారు. బర్మన్ కుటుంబప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఓఎఫ్ఎస్ ఆఫర్ చర్చ జరిగిన వెంటనే రష్మి సలూజా రూ.34.71 కోట్ల షేర్లను విక్రయించారని సంస్థలు ఆరోపించాయి. అలాగే 2024 మధ్యలోకూడా ఇన్‌సైడర్‌ట్రేడింగ్‌తో 27.1 లక్షల షేర్లను రూ.43 కోట్లకు విక్రయించినట్లు బర్మన్ కుటుంబం ఆరోపించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.